www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వజ్రాల హారాలు.. బంగారు వడ్డాణాలు!

కోట్లకు పడగలెత్తిన ఆళ్లగడ్డ విద్యుత్ ఏడీఈ

భార్య బ్యాంకు లాకర్‌లో 2.8 కిలోల బంగారం

విలువ రూ.2.85 కోట్ల పైనే.. ఇంటి విలువే 3 కోట్లు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు

14



బ్యాంకు లాకర్ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు


బుధవారం | 21-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 35

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: నవమి తె.3.22 తదుపరి దశమి, నక్షత్రం: శతభిషం రా.6.58 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.1.03-2.34, దుర్ముహూర్తం: ఉ.11.46-12.37, అమృతఘడియలు: ఉ.11.56-1.29, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.38

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

"అంకుల్... కిలో పంచదార రూ.50. కానీ... నేను మా డాడీతో మీకు రూ.60 గూగుల్ పే చేయిస్తా. ఎక్స్‌ట్రాగా కొట్టిన రూ.10 నాకు ఇచ్చేయండి!"... ఇదో చిన్న పిల్లల చిల్లర స్కీమ్! జగన్ హయాంలో దాదాపు నాలుగున్నరేళ్లు నడిచిన 'లిక్కర్ స్కామ్' కూడా అచ్చం ఇలాగే జరిగింది. ఇక్కడ షాప్ అంకుల్... లిక్కర్ కంపెనీ! గూగుల్ పే చేసింది ప్రభుత్వ ధనాన్ని! 'అదనం'గా ఇచ్చిన డబ్బును సొంత జేబులోకి వేసుకున్నది... అప్పటి ప్రభుత్వ పెద్దలు!



కూల్‌గా కొల్లగొట్టారు!

ముడుపులే లక్ష్యంగా, ముడుపుల కోసం, ముడుపుల చుట్టూ తిరిగేలా రూపుదిద్దుకున్నదే మద్యం పాలసీ! దానిని రూపొందించింది, అమలు చేసింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో! దాని పాత్రధారులు, సూత్రధారులు ఒక్కొక్కరుగా అరెస్టవుతున్నారు. ఈ వేడి మెల్లగా 'తాడేపల్లి ప్యాలెస్'నూ తాకుతోంది. అప్పుడు ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన మద్యం స్కామ్ గులకరాయిలాంటిదైతే... జగన్ హయాంలో జరిగింది పెద్ద కొండంత! ఒక 'పథకం' ప్రకారం పకడ్బందీగా సాగిన కుంభకోణమిది! ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేయాలన్నది ఇందులో కీలకం! దాని ద్వారా వేల కోట్లు మింగేశారు! మద్యం కంపెనీలు తమకు వచ్చిన ఆదాయంలోంచి కట్టిన ముడుపులు మాత్రమే కాదు! అంతకుమించి చాలా ఉంది! ప్రజల సొమ్మును మద్యం కంపెనీలకు 'అదనం'గా చెల్లించి... అదే డబ్బును తిరిగి 'ప్యాలెస్'కు తరలించిన అత్యంత నీచమైన, దారుణమైన కుంభకోణమిది!

మద్యం స్కామ్‌లో మతిపోగొట్టే 'స్కీమ్'

తొలి 6 నెలలు కమీషన్ల కిక్కు

తర్వాత 'అదనంగా' పైసా వసూల్

వెయ్యి విలువైన మద్యానికి రూ.1600 చెల్లించడం

అదనంగా ఇచ్చిన రూ.600 సొంతానికి మళ్లించడం

అలా ఇచ్చి, పుచ్చుకున్నది ప్రజా ధనమే

మొత్తం చేతులు మారింది రూ.3113 కోట్లు

అందులో ప్రభుత్వ సొమ్మే అత్యధికం

కొనుగోలు ధర మేరకు ఎమ్మార్పీ కూడా అధికం

మందు బాబుల జేబులూ గుల్ల

కూటమి రాగానే 'అదనం' పోయింది.. ధర తగ్గింది

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అప్పుడెప్పుడో బోఫోర్స్ స్కామ్ నుంచి... తాజాగా ఢిల్లీలో జరిగిన లిక్కర్ స్కామ్ దాకా... స్వతంత్ర భారత దేశంలో ఎన్నో కుంభకోణాలు వెలుగు చూశాయి. కానీ... వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిన మద్యం కుంభకోణానికి మరేదీ సాటి రాదు! ఇది... 'మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్' అని ఆర్థిక నిపుణులే చెబుతున్నారు. 'సరుకు ఆర్డర్ ఇచ్చారు. కమీషన్లు పుచ్చుకున్నారు. ఇది ఇద్దరి మధ్య జరిగిన వ్యవహారం. మద్యం కంపెనీలు తమ లాభంలోంచి తీసి కొంత మొత్తాన్ని కమీషన్లుగా చెల్లించాయి. ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నష్టమేవిటి?' అని అమాయకంగా ప్రశ్నించేవాళ్లూ

మిగతా 14వ పేజీలో...



సంక్షేమానికి ఓ కేలెండర్

ఏ నెలలో ఏ పథకమో చెబుదాం: సీఎం

అప్పుడు మన విశ్వసనీయత పెరుగుతుంది

ఒకే విడతలో 'తల్లికి వందనం' జమ చేస్తాం

ఆర్థికంగా ఇబ్బందులున్నా తగ్గేది లేదు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై

మంత్రులు వినూత్నంగా ఆలోచించాలి: బాబు

రెవెన్యూ సమస్యలపై 3 నెలలకోసారి నివేదిక

రేషన్ వాహనాలు రద్దు

1 నుంచి చౌకధరల దుకాణాల్లోనే పంపిణీ

వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటికే సరుకులు

ఎండీయూలు ఫ్రీగా లబ్ధిదారులకు బదలాయింపు

ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ

రాజమండ్రిలో తెలుగు విశ్వవిద్యాలయం

అమరావతిలో ఐఐయూఎల్ఈఆర్ ఏర్పాటు

పీపీపీలో రాష్ట్రవ్యాప్తంగా జంతుప్రదర్శన శాలలు

ఎస్ఐపీబీ ఆమోదించిన పెట్టుబడులకు పచ్చజెండా

కేబినెట్ నిర్ణయాలు.. జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ, మద్దతు ధరలపై సబ్ కమిటీల ఏర్పాటుకు తీర్మానం



కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన వార్షిక కేలెండర్‌ను వీలైనంత త్వరగా విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.. ఏ నెలలో ఏ పథకం అమలు చేస్తామో చెబితే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వసనీయత మరింత పెరుగుతుందన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా 'తల్లికి వందనం' కింద ఒకే విడతలో తల్లుల ఖాతాలో నిధులు జమ చేసి తీరతామని స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడి

మిగతా 13వ పేజీలో...

రేపు ఢిల్లీకి చంద్రబాబు

ఎల్లుండి ఒకేరోజు అమిత్‌షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ.. బనకచర్లపై నిర్మలతోనూ..

ఏపీకి పెట్టుబడులపై పారిశ్రామికవేత్తలతో చర్చలు

శనివారం నీతీ ఆయోగ్ సమావేశానికి హాజరు



శ్రీనివాసన్ నార్లీకర్

ఎంఆర్ శ్రీనివాసన్, నార్లీకర్ కన్నుమూత

ఒకేరోజు ఇద్దరు సీనియర్ శాస్త్రవేత్తల మృతి

ఎంఆర్ శ్రీనివాసన్ అణు శక్తి కమిషన్ మాజీ చైర్మన్.. అణు విద్యుత్తు ప్రాజెక్టుల్లో కీలక పాత్ర

భారత ఖగోళ శాస్త్ర రంగంలో శిఖర సమానుడు జయంత్ నార్లీకర్

2

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

చర్చలు సఫలం.. నేడు షెడ్యూల్

విద్యార్థుల సంఖ్య 49కి మించితే రెండో సెక్షన్ ఏర్పాటుకు ఓకే

11

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

ఉద్యమానికి ఉపాధ్యాయుల స్వస్తి

ఫ్రీహోల్డ్‌లో ఉన్న పేదల భూముల్ని తీసుకోం!

పేదలకు న్యాయం జరిగేలా తుది నిర్ణయం

2

కక్ష సాధింపుగా ఎవరి భూముల్నీ 22ఏలో పెట్టం

సాదా బైనామాలను ల్యాండ్ రికార్డులుగా మార్చుకునేందుకు 2027 వరకు గడువు పెంపు

రాష్ట్రంలో నాలా చట్టాన్ని రద్దు చేస్తాం: అనగాని

ఒకేసారి పరీక్షలు, ఫలితాలు

ఉన్నత విద్య అకడమిక్ క్యాలెండర్ విడుదల

12

పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు 'ఫీల్డ్ మార్షల్' ర్యాంక్

2

భారత్‌తో పోరు నేపథ్యంలో పదోన్నతి

న్యాయ వ్యవస్థలో తిమింగలాలు?

జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్‌కు ఎన్నాళ్లు?

నేర న్యాయవ్యవస్థ సామాన్యులకేనా?

అంతర్గత విచారణలో పారదర్శకత ఏదీ?

నివేదికను బయట పెట్టాలి

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



న్యూఢిల్లీ, మే 20: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మరోసారి న్యాయవ్యవస్థ మీద విరుచుకుపడ్డారు. అధికార నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు దాచారని ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ మీద ఎందుకు ఇంతవరకు పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ప్రశ్నించారు. ముగ్గురు న్యాయమూర్తులతో జరిపించిన విచారణకు ఎలాంటి చట్టబద్ధతా లేదని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతి ఒక్కరూ ఈ కేసులో ఎలాంటి చర్యలూ లేకుండా మూసేస్తారని భావిస్తున్నారని చెప్పారు. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీలో ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. "మన ముందు ఒక చేదు నిజం

మిగతా 11వ పేజీలో...

ఇప్పటికి వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధమే

స్టే ఇవ్వాలంటే బలమైన కారణం చూపాల్సిందే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఆస్తులను లాక్కోవడమే చట్టం ఉద్దేశం: సిబ్బల్

పారదర్శకత కోసమే బోర్డులో ఇతర మతస్థులు

ప్రభుత్వ న్యాయవాది



మద్యం స్కాంలో నిందితులు రాజ్ కసిరెడ్డి, దిలీప్, గోవిందప్ప బాలాజీ, కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలను జైలు నుంచి కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఏసీబీ కోర్టుకు 'లిక్కర్' గ్యాంగ్

ఏడుగురు నిందితులకు జూన్ 3 వరకు రిమాండ్ పొడిగింపు

న్యాయాధికారికి సమస్యల చిట్టా.. 'నట్స్' ఇవ్వలేదన్న కృష్ణమోహన్‌రెడ్డి

ప్రత్యేక బ్యారక్ కావాలన్న గోవిందప్ప.. దిండు, మంచం ఇవ్వాలన్న శ్రీధర్‌రెడ్డి

జైల్లో జారి పడ్డానన్న ధనుంజయ్‌రెడ్డి.. కసిరెడ్డి వాంగ్మూలంపై ఈడీ పిటిషన్‌కు ఓకే

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ పిటిషన్

14

సినిమా చూపిస్తా!



రిటైర్ అయినా.. దేశం విడిచివెళ్లినా పట్టుకొస్తా

మీ జోలికి వచ్చిన వారందరి పేర్లూ రాసుకోండి

అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తా

మరోసారి బెదిరింపులకు దిగిన జగన్

ప్రతి చిన్న విషయానికీ హైకోర్టుకా?

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్థాయిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయికి దిగజార్చారు



కోర్టులను క్రీడా మైదానాలుగా మార్చారు

మీ మధ్య సిల్లీ వివాదాలు తీర్చడానికి మేమిక్కడ లేము: హైకోర్టు

రాజకీయ పార్టీలపై ఘాటు వ్యాఖ్యలు

వ్యవస్థ దుర్వినియోగంపై ఆగ్రహం

ఆదేశాలు అమలు చేయకుంటే కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకూ ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరిక

పిటిషనర్ల తప్పుందని తేలితే 10 లక్షల జరిమానా విధిస్తాం

తిరువూరు కౌన్సిలర్లకు భద్రత వ్యవహారంలో కీలక ఆదేశాలు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): గత ఐదారేళ్లలో రాజకీయ పార్టీలు ప్రతి చిన్న విషయాన్నీ హైకోర్టుకు తీసుకొచ్చి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్థాయిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయికి దిగజార్చారని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రెండు రాజకీయ పార్టీలు తమ మధ్య ఉన్న సమస్యలను కోర్టులకు తీసుకొచ్చి న్యాయస్థానాలను

మిగతా 12వ పేజీలో...

మాతృభాషతో.. మరింత అందంగా!

సొంత భాషలో ప్రసంగించిన మిస్‌వరల్డ్ సుందరీమణులు

ప్రత్యేక అనువాదకులతో టీ-హబ్‌లో కార్యక్రమం

'నమస్తే ఇండియా' అంటూ తొలి పలుకు.. కిమ్స్ ఆస్పత్రి సందర్శన

ప్రారంభమైన 'ఎలిమినేషన్' ప్రక్రియ

25వ తేదీ నుంచి హైదరాబాద్‌ను వీడనున్న పోటీదారులు



2



మంగళవారం సాయంత్రం బెజవాడలో వర్షం

నాలుగైదు రోజుల్లోనే కేరళకు నైరుతి

3

సాధారణం కంటే వారం ముందే రాక

రేపు అల్పపీడనం.. రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు



బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో 300 కి.మీ వంతెన పూర్తి

అహ్మదాబాద్-ముంబై మధ్య 518 కిలోమీటర్ల కారిడార్

న్యూఢిల్లీ, మే 20: అహ్మదాబాద్-ముంబై మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వంతెనలో 300 కి.మీ. పూర్తైందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు ఓ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ రైలు కారిడార్ మొత్తం పొడవు 518.17 కి.మీ.లు. దేశంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఇది. దీని విలువ రూ.1.08 లక్షల కోట్లు. 2017లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2021లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ రైలు అందుబాటులోకి వస్తే అహ్మదాబాద్ నుంచి ముంబైకి 3 గంటల్లోనే చేరుకోవచ్చు. తొలి ట్రయల్ రన్‌ను 2026లో చేపట్టనున్నారు. ఈ రైలు గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.



12

ఊరి కోసం మాటామంతీ!

స్క్రీన్ గ్రీవెన్స్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీకారం

రేపు టెక్కలిలోని భవానీ థియేటర్‌లో ప్రారంభం

మంగళగిరి నుంచి రావివలస ప్రజలతో మాటామంతీ

వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే వినతుల స్వీకరణ

తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ

3

ఒంటిమిట్టలో త్వరలో అన్నప్రసాదం

అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ ఆప్షన్

గ్రూపుగా వస్తే అదనంగా 5 లక్షలు చెల్లింపు

స్విమ్స్‌లో 597 పోస్టుల భర్తీకి ఆమోదం

అనంతవరంలో శ్రీవారి ఆలయానికి 10 కోట్లు

టీటీడీ బోర్డు భేటీలో కీలక నిర్ణయాలు: ఈవో

నా బదిలీ వెనుక దురుద్దేశం

- బెంగళూరు పంపాలని కోరినా పట్టించుకోలేదు
- ఇద్దరు సీజేఐలకు వినతులిచ్చినా పరిగణించలేదు
- వీడ్కోలు సభలో జస్టిస్ దుప్పల వెంకట రమణ ఆవేదన



అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు నుంచి తనను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయడం వెనుక దురుద్దేశం ఉందని న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణాలు లేకుండా తనను బదిలీ చేశారని ఆరోపించారు. జస్టిస్ వెంకటరమణ జూన్ 2న పదవీ విరమణ చేయబోతున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో మధ్యప్రదేశ్ హైకోర్టు మంగళవారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ వెంకటరమణ మాట్లాడుతూ.... 'బదిలీ సమయంలో ఆప్షన్లు కోరినప్పుడు నా భార్యకు మెరుగైన చికిత్స అందించేందుకు వీలుంటుందని బెంగుళూరును ఎంచుకున్నాను. అయితే సుప్రీంకోర్టు కొలీజియం పరిగణనలోకి తీసుకోలేదు. 2023 నవంబరు 1న మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశాను. కొవిడ్ కారణంగా మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నా భార్యకు వైద్య చికిత్స అందించేందుకు వీలుగా నన్ను బదిలీ చేయాలని 2024 జూలై 19న, ఆగస్టు 28న అప్పటి సుప్రీంకోర్టు ఇద్దరు ప్రధాన న్యాయమూర్తులకు వినతులు సమర్పించినా పరిగణనలోకి తీసుకోలేదు... ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ నా వినతిని పరిగణలోకి తీసుకోవచ్చు. అయితే ఇప్పటికే చాలా ఆలస్యమైంది. వారి అహాన్ని సంతృప్తిపరుచుకొనేందుకు నా సొంత రాష్ట్రం నుంచి అకారణంగా బదిలీ చేశారు. వారి అహాన్ని సంతృప్తిపరిచినందుకు నాకూ సంతోషంగానే ఉంది. ఇప్పుడు వారు పదవీ విరమణ చేశారు. దేవుడు వాళ్లని అంత తేలికగా మర్చిపోడు.. క్షమించడు. నన్ను ఇబ్బందులకు గురిచేసినందుకు వారు ఏదో రూపంలో బాధపడతారు. అదృష్టవశాత్తు వారి శాపమే నాకు వరంగా మారింది. ఇండోర్, జబల్‌పూర్ బెంచ్‌లలో సోదర న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి అపారమైన మద్దతు, ప్రేమ, సహకారం లభించింది' అని పేర్కొన్నారు. జస్టిస్ వెంకటరమణ 2022లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023లో కొలీజియం సిఫారసు మేరకు ఆయన మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

ఫ్రీహోల్డ్‌లో ఉన్నా.. పేదల భూముల్ని తీసుకోం!

- కక్షతో 22ఏలో పెట్టం: రెవెన్యూ మంత్రి అనగాని

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలా చట్టాన్ని రద్దు చేస్తామని, సాదా బైనామాలను ల్యాండ్ రికార్డులుగా మార్చుకునే గడువును 2027 వరకు పొడిగిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఫ్రీ హోల్డ్ భూములపై పేదలకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఫ్రీ హోల్డ్‌లో ఉన్నా.. పేదల భూములను తీసుకోబోమని, ఎవరి భూముల్నీ కక్ష సాధింపుగా 22ఏలో పెట్టాలనే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో భూ పరిపాలనలో సంస్కరణలపై మంత్రి సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, పి.నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు, 22ఏ నుంచి భూముల తొలగింపు, నాలా రద్దు, సాదా బైనామాలపై చర్చించారు. ఆ అంశాలను అనగాని మీడియాకు వెల్లడించారు. ఫ్రీ హోల్డ్ భూముల్లో 10 కేటగిరీలకు గానూ 8 కేటగిరీలకు ఉపసంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. దాదాపు 3-4 లక్షల ఎకరాల భూములను గత ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తమ అనుయాయులకు ఫ్రీ హోల్డ్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సర్వే నంబరులోని 30 ఎకరాల్లో 22ఏలో రెండు ఎకరాలు ఉంటే.. మొత్తం భూమిని పెట్టిన పరిస్థితి ఉందన్నారు. అన్నిటినీ పరిశీలించి, నిజమైన భూయజమానులు, పేదలకు నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ఎస్టేట్, ఈనామ్, ఎండోమెంట్ భూములపైనా చర్చిస్తామన్నారు. ఉండాల్సిన ఆస్తులు కంటే ఎక్కువగా ఉన్నాయని, ఇవెలా వచ్చాయో తెలియడం లేదన్నారు.

పాక్ దాడులను ముందే ఊహించి

స్వర్ణ దేవాలయంలో ఏడీ గన్స్!

మోహరించామని ఏఎన్ఐ ఇంటర్వ్యూలో తెలిపిన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్

- ఆ ఆలయ ప్రధాన పూజారి అందుకు మాకు అనుమతిచ్చారని వెల్లడి
- ఇవాన్ వ్యాఖ్యలను ఖండించిన ఆర్మీ



భారత్, పాక్ సరిహద్దుల్లో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిలిచిపోయిన బీటింగ్ రిట్రీట్ సైనిక కవాతును మంగళవారం పునరుద్ధరించారు. పంజాబ్‌లోని 3 సరిహద్దు చెక్‌పోస్టుల్లో(అట్టారీ, హుస్సేనీవాలా, సద్కీ) బీటింగ్ రిట్రీట్ జరిగింది.

న్యూఢిల్లీ, మే 19: ఆపరేషన్ సిందూర్ దరిమిలా భారత్‌లోని పలు ప్రాంతాలపై దాడులకు పాక్ ప్రయత్నించిన వేళ.. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో ఆయుధాల మోహరింపునకు ఆలయ యాజమాన్యం అంగీకరించిందని ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ, లెఫ్టినెంట్ జనరల్ సుమేర్ ఇవాన్ ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు! అంతేకాదు.. శత్రుదేశ డ్రోన్లు, క్షిపణులను గుర్తించేందుకు వీలుగా తొలిసారి స్వర్ణ దేవాలయంలో విద్యుద్దీపాలన్నీ ఆర్పివేసినట్టు ఆయన వెల్లడించారు. దీనివల్ల శత్రు డ్రోన్లను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయడం భారత సైన్యానికి సులువైందని వివరించారు. "పాక్ మన ప్రజలను, మన దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతుందని మేం ముందే ఊహించాం. ఆ సమయంలో స్వర్ణ దేవాలయ ప్రధాన గ్రంథి (ప్రధాన పూజారి) ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను ఆలయంలో మోహరించడానికి అనుమతించారు. ఆలయానికి పొంచి ఉన్న ముప్పు గురించి మేం చెప్పినప్పుడు ఆ విషయాన్ని ఆలయ యాజమాన్యం అర్థం చేసుకుంది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన, నిత్యం వందలు, వేలాది మంది సందర్శించే జాతీయ కట్టడాన్ని పరిరక్షించడం కోసం ఏడీ గన్స్‌ను మోహరించడానికి ఆమోదం తెలిపింది. దీంతో అక్కడ వాటిని మోహరించాం. అలాగే.. స్వర్ణదేవాలయంలో ఎన్నో ఏళ్లుగా వెలుగుతున్న దీపాలను బహుశా తొలిసారి ఆర్పివేశారు. దాంతో మేం ఆ దిశగా వచ్చే శత్రు డ్రోన్లను స్పష్టంగా చూడగలిగాం." అని ఆయన ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరంగా వెల్లడించారు. పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంపై అయినా దాడి చేయగల సత్తా తమకు ఉందని, భారత్ పూర్తిస్థాయిలో దాడి చేస్తే కలుగులో దాక్కోవడం తప్ప దాయాది దేశానికి మరో మార్గం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

అలాంటిదేం లేదు..

స్వర్ణ దేవాలయంలో ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను మోహరించినట్టు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ డీజీ సుమేర్ ఇవాన్ చెబుతున్న వీడియో క్లిప్ ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నప్పటికీ.. ఆర్మీ దాన్ని కొట్టిపారేసింది. స్వర్ణదేవాలయంలో ఎలాంటి ఆయుధాలనూ మోహరించలేదని ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "స్వర్ణదేవాలయంలో ఎయిర్‌డిఫెన్స్ గన్స్ మోహరింపునకు సంబంధించి కొన్ని కథనాలు మీడియాలో వస్తున్నాయి. కానీ.. శ్రీ దర్బార్ సాహిబ్ అమృత్‌సర్ (స్వర్ణదేవాలయం)లో ఏడీ గన్స్‌నుగానీ, మరే ఇతర ఆయుధాలనుగానీ మోహరించలేదని స్పష్టం చేస్తున్నాం" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. గోల్డెన్ టెంపుల్ ప్రధాన పూజారి.. సింగ్ సాహిబ్ జ్ఞానీ రఘుబీర్ సింగ్ సైతం ఆయుధాల మోహరింపు కథనాలను కొట్టిపారేశారు. "భారత సైన్యం సంప్రదింపుల గురించి నాకు ఎలాంటి సమాచారం లేదు. ఆ సమయంలో నేను సెలవులో ఉన్నా. వేరే దేశానికి వెళ్తున్నా. దీనిపై లోతైన విచారణ జరపాలి. దీని వెనుక భారత సైన్యం అసలు ఉద్దేశం ఏంటో తెలియాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆలయ అదనపు ప్రధాన పూజారి జ్ఞానీ అమర్జీత్ సింగ్ కూడా.. ఆలయంలో ఆయుధాల మోహరింపునకు అనుమతిచ్చామనడం అసత్యమన్నారు. అధికారుల ఆదేశాల మేరకు బ్లాకవుట్ సమయంలో ఆలయం బయట, పైభాగంలో ఉన్న దీపాలను ఆర్పేశామని.. లోపలిభాగంలో తప్పనిసరిగా దీపాలు వెలుగుతూ ఉండాల్సిన చోట ఆర్పకుండా అలాగే ఉంచామని వెల్లడించారు. స్వర్ణదేవాలయ పవిత్రతను పూర్తిస్థాయిలో కాపాడామని ఆయన పేర్కొన్నారు.

భారత్‌పై 'తుర్కియే' సంస్థ కుట్ర



'ఆపరేషన్ సిందూర్'లో భారత్‌ను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్‌కు క్షిపణులు, డ్రోన్లను తుర్కియే అందించగా.. ఇప్పుడు బంగ్లాదేశ్ కేంద్రంగా తుర్కియే కనుసన్నల్లో నడిచే ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా భారత్‌పై కుట్రలు చేస్తోంది. ఆ ఎన్‌జీవో తాజాగా బంగ్లాదేశ్ రాజ్యం పేరుతో మ్యాపును విడుదల చేసింది. ఆ మ్యాపులో భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలతో పాటు.. బిహార్, ఝార్ఖండ్, ఒడిసా, మయన్మార్‌లోని అరాకన్ రాష్ట్రం బంగ్లాదేశ్‌లో ఉన్నట్లు చూపించింది.


పహల్గాం దాడి గురించి ప్రధానికి

ముందే తెలుసు: ఖర్గే

బెంగళూరు/బళ్లారి, మే 20(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకుల ప్రాణాలను రక్షించడంలో కేంద్రం విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌ను 'చిన్న యుద్ధం'గా ఆయన అభివర్ణించారు. పహల్గాం దాడి గురించి ప్రధాని మోదీకి ముందే సమాచారం ఉందని, అందుకే జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హొస్పేటలో మంగళవారం నిర్వహించిన సమర్పణ సంకల్ప ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త

జయంత్ నార్లికర్ మృతి



పుణె, హైదరాబాద్, మే 20: ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లికర్(86) మంగళవారం పుణెలో మృతి చెందారు. భారత శాస్త్ర రంగంలో శిఖర సమానుడైన ఆయన ఖగోళ శాస్త్ర రంగానికి ఎన్నో సేవలు అందించారు. దేశంలో పలు పరిశోధన సంస్థల ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ప్రకటించారు. ఉన్నత విద్యను ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పూర్తి చేసిన నార్లికర్ 1972లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో చేరి 1989 వరకు పనిచేశారు. 1998లో యూజీసీ ఆయన్ను 'ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్'(ఐయూసీఏఏ)ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరి.. దానికి స్థాపక డైరెక్టర్‌గా నియమించింది. ఖగోళ భౌతికశాస్త్రంలో ఆయన చేసిన సేవలను గుర్తించి 1996లో యునెస్కో కళింగ అవార్డు ప్రదానం చేసింది. 1965లో కేవలం 26 ఏళ్లకే నార్లికర్ పద్మ భూషణ్ అవార్డు అందుకోవడం విశేషం. 2004లో పద్మ విభూషణ్ అందుకున్నారు. ఆయన మృతితో దేశం ఒక దూరదృష్టిగల ఖగోళ భౌతిక శాస్త్రవేత్తను కోల్పోయిందని ఇస్రో మాజీ ఛైర్మన్ సోమ్‌నాథ్ అన్నారు. నార్లికర్ మృతి పట్ల ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్ సంతాపం ప్రకటించారు.

అణు శక్తి కమిషన్ మాజీ ఛైర్మన్

శ్రీనివాసన్ కన్నుమూత



చెన్నై, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అణు శాస్త్రవేత్త, అణు శక్తి కమిషన్ మాజీ ఛైర్మన్ పద్మవిభూషణ్ ఎంఆర్. శ్రీనివాసన్(95) తమిళనాడులోని ఉదగమండలం(ఊటీ)లో మంగళవారం కన్నుమూశారు. బెంగళూరులో జన్మించిన శ్రీనివాసన్ 1955లో భారత అణు శక్తి విభాగంలో చేరారు. దేశంలో తొలి అణు పరిశోధన రియాక్టర్ అప్సర అభివృద్ధిలో ప్రముఖ శాస్త్రవేత్త హోమీ బాబాతో కలిసి పనిచేశారు. 1974లో అణుశక్తి శాఖలో అణు విద్యుత్తు ప్రాజెక్టుల ఇంజనీరింగ్ విభాగానికి డైరెక్టర్ అయ్యారు. 1984లో న్యూక్లియర్ పవర్ బోర్డు ఛైర్మన్ అయ్యారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా పలు అణు విద్యుత్తు ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణలో కీలక పాత్ర వహించారు. శ్రీనివాసన్ నాయకత్వంలో దేశంలో 18 అణు విద్యుత్తు యూనిట్లకు రూపకల్పన జరగడం విశేషం. ప్రస్తుతం వాటిలో ఏడు పని చేస్తున్నాయి. 1987లో అణు శక్తి కమిషన్ ఛైర్మన్‌గా, అలాగే అణు శక్తి శాఖకు కార్యదర్శిగా నియమితులయ్యారు. దేశ అణు శక్తి కార్యక్రమానికి శ్రీనివాసన్ చేసిన సేవలకు గుర్తింపుగా 2015లో కేంద్రం పద్మ విభూషణ్ అవార్డు ప్రదానం చేసింది. ఆయన మృతికి ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు

'ఫీల్డ్ మార్షల్' ర్యాంక్



న్యూఢిల్లీ, మే 20: భారత్‌తో పోరులో 'అద్భుత పనితీరు' కనబర్చారంటూ పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిం మునీర్‌కు పాక్ ప్రభుత్వం పదోన్నతి కల్పించింది!! భారత్‌తో యుద్ధవాతావరణ నెలకొన్న సమయంలో ఎవరికీ కనిపించకుండా పోయిన మునీర్‌కు అత్యున్నతమైన 'ఫీల్డ్ మార్షల్' ర్యాంకును పాక్ సర్కారు కట్టబెట్టింది! ప్రధాని షెహబాజ్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం మునీర్‌కు పదోన్నతి ఇవ్వడానికి ఆమోదించిందంటూ పాక్ పీఎంవో ఓ ప్రకటనలో తెలిపినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది.

సిరాజ్‌కు 10 బ్యాంకు ఖాతాలు!

- కాల్ డేటాపైనా ఎన్ఐఏ ఆరా
- పోలీస్ కస్టడీ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

విజయనగరం, మే 20(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులైన విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన్ సయ్యద్ సమీర్ కార్యకలాపాలపై ఎన్ఐఏ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సిరాజ్‌కు 10 బ్యాంక్ అకౌంట్‌లు ఉన్నట్లు సమాచారం. వీటిలో విజయనగరంలోని డీసీసీబీ ఖాతా, అతని తండ్రి పేరుపై ఉన్న లాకర్ గురించి పోలీసులు ఇప్పటికే ఆరా తీశారు. ఎన్ఐఏ అధికారులు రెండు రోజులుగా విజయనగరంలోనే ఉంటూ విచారిస్తున్నారు. సిరాజ్ సమీప బంధువులు, కుటుంబ సభ్యులు, అతని బ్యాంక్ ఖాతాల లావాదేవీలు, సెల్‌ఫోన్ నంబర్ల వినియోగం, కాల్‌డేటా తదితర విషయాలను మంగళవారం నమోదు చేసుకున్నారు. సిరాజ్ ఇంటిని మరోసారి పరిశీలించినట్లు సమాచారం. అలాగే సయ్యద్ సమీర్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆర్థిక లావాదేవీలు, మొబైల్ కాంటాక్ట్ నంబర్లపై ఓ స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. కాగా, సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి మంగళవారం వాదనలు విన్న తరువాత తీర్పును రిజర్వులో ఉంచారు.

భారత అండర్‌కవర్ ఏజెంట్ల వివరాలపై..

జ్యోతి ద్వారా పాక్ ఆరా



న్యూఢిల్లీ, మే 20: భారతదేశానికి చెందిన అండర్ కవర్ ఏజెంట్లను గుర్తించేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ.. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను ఉపయోగించుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. గూఢచర్యం కేసులో అరెస్టయి ఐదురోజుల పోలీసు కస్టడీలో ఉన్న జ్యోతి మల్హోత్రాను.. ఎన్ఐఏ, ఐబీ, హరియాణా పోలీసు అధికారులు విచారిస్తున్నారు. అందులో భాగంగా ఆమె ఫోన్‌లో వాట్సాప్ చాట్లను పరిశీలించగా.. భారతదేశం నిర్వహించే అండర్‌కవర్ ఆపరేషన్లపై ఆమె అలీ హసన్ అనే ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో సంకేత భాషలో చాట్ చేసినట్టు వెల్లడైంది. ఆమె అట్టారీ సరిహద్దు సందర్శనకు వెళ్లినప్పుడు.. "అక్కడ ఎవరైనా అండర్ కవర్ ఏజెంట్లకు ప్రత్యేక ప్రొటోకాల్ అమలుచేస్తున్నట్టు గమనించావా?" అని అలీ హసన్ ఒక చాట్‌లో ఆమెను ప్రశ్నించినట్టు, అలాంటిదేదీ తాను గమనించలేదని ఆమె సమాధానమిచ్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. కాగా.. దర్యాప్తులో భాగంగా తాము అడుగుతున్న ప్రశ్నలకు ఆమె సమాధానం ఇవ్వకుండా దాటవేస్తోందని, తమను తప్పుదోవ పట్టించే ప్రయత్నం కూడా చేస్తోందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఆమె డైరీలో 11 పేజీల్లో ఆమె పాక్ పర్యటనల గురించి రాసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

మాతృభాషతో.. మరింత అందంగా..!

సొంత భాషలో ప్రసంగించిన ప్రపంచ సుందరి ముద్దుగుమ్మలు



కిమ్స్ ఆస్పత్రిలో ప్రపంచసుందరి పోటీ దారులు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు కొందరు తమ మాతృభాషలో అందంగా ప్రసంగించారు. అందరికీ తెలిసిన ఇంగ్లీష్ కాదని.. కొద్దిమందే మాట్లాడే తమ సొంత భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు. పోటీదారుల్లో ప్రతిభను గుర్తించేందుకు ఉద్దేశించిన 'హెడ్ 2 హెడ్' పోటీలు మంగళవారం టీ-హబ్‌లో ప్రారంభమయ్యాయి. ఇందులో ప్రతి పోటీదారుకు కేటాయించిన 4 నిమిషాల సమయంలో తాము ఎంచుకున్న 'సేవా కార్యక్రమం (బ్యూటీ విత్ పర్పస్)' గురించి వివరించాల్సి ఉంటుంది. తొలిరోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన పోటీలో మూడు ఖండాలకు చెందిన 50 మంది పాల్గొన్నారు. వీరిలో 8 మంది తమ మాతృభాషలో ప్రసంగించారు. 'నా భాష.. నా గుర్తింపు.. నా ఆత్మాభిమానం.. నా ప్రజల భాషను నేడు ప్రపంచానికి పరిచయం చేస్తున్నందుకు గర్వంగా ఉంద'ంటూ మాట్లాడారు. మంగళవారం ప్రసంగించిన 50 మందిలో చాలా మంది 'నమస్తే ఇండియా' అంటూ ప్రారంభించడం గమనార్హం. 'బ్యూటీ విత్ పర్పస్' కార్యక్రమంలో భాగంగా పోటీదారులు తమ సామాజిక సేవ ఆలోచనలను పంచుకున్నారు. ఇక, ప్రపంచ సుందరి పోటీలో ఉన్న సుందరీమణులు కొందరు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్, కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్‌ను పరిశీలించి.. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాగా, ఇరవై రోజులుగా సాగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో కీలక దశ ప్రారంభమైంది. అందాల పోటీలు.. మంగళవారం నుంచి రసవత్తరంగా మారాయి. హెడ్ 2 హెడ్ పోటీలు బుధవారం సాయంత్రం ముగుస్తాయి. మొత్తం ఆరు విభాగాల్లో పోటీలు ముగిశాక.. టాప్-40 జాబితాను ప్రకటిస్తారు. మిగతావారు పోటీ నుంచి వైదొలగినట్టే. వారు హైదరాబాద్‌ను వీడనున్నారు.

లోకం తీరు



'ఏపీ ఐసెట్'లో 95% ఉత్తీర్ణత

విశాఖపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 ఫలితాలను చైర్మన్, ఆంధ్రా యూనివర్సిటీ(ఏయూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మంగళవారం విడుదల చేశారు. ఐసెట్‌కు 34,131 మంది హాజరుకాగా, 32,719 మంది(95.86%) అర్హత సాధించినట్టు వెల్లడించారు. ఏయూ పరిధిలో 20,480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. 19,793 మంది(96.6%), శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 12,804 మంది పరీక్షకు హాజరుకాగా..12,096 మంది(94.4%) అర్హత సాధించినట్టు తెలిపారు. నాన్ లోకల్ కేటగిరీలో 847 మంది పరీక్షకు హాజరుకాగా, 830 మంది (97%) అర్హత సాధించారన్నారు.

టాప్ ర్యాంకులు వీరికే!

విశాఖకు చెందిన మనోజ్ మేకా 197.91 మార్కులతో మొదటి ర్యాంకు సాధించాడు. కడప జిల్లాకు చెందిన ద్వారకచర్ల సందీప్‌రెడ్డి 179.51 మార్కులతో రెండో ర్యాంకు, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.కృష్ణసాయి 178.51 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు.

నాలుగైదు రోజుల్లో కేరళకు నైరుతి

సాధారణం కంటే వారం ముందే రుతుపవనాల రాక

- వయనాడ్ సహా నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్
- 24 గంటల్లో 204 మి.మీ.పైగా వర్షం కురిసే చాన్స్
- భారీ వర్షాలతో బెంగళూరు, గువాహటీ అతలాకుతలం
- రేపు అల్పపీడనం.. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది. సాధారణంగా జూన్ 1న నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయి. జూలై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయి. అయితే, ఈ ఏడాది ముందస్తుగానే మే 27న రుతుపవనాలు కేరళను తాకుతాయని ఇటీవల ఐఎండీ అంచనా వేసింది. దానికంటే కూడా ముందుగానే కేరళను తాకనున్నట్టు తాజాగా మంగళవారం వెల్లడించింది. తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళ, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాలను రుతుపవనాలు తాకుతాయని తెలిపింది. అంటే సాధారణం కంటే వారం ముందుగా రుతుపవనాలు కేరళకు రానున్నాయి. కేరళలోకి ప్రవేశించిన రెండు, మూడు రోజులకు రాయలసీమ, దక్షిణ కోస్తాను తాకుతాయని అంచనావేశారు.

ఉత్తర కేరళలో స్తంభించిన జనజీవనం

కేరళ ఉత్తర ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు అనేక పట్టణకేంద్రాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. కాసరగాడ్, కన్నూర్, వయనాడ్, కోళికోడ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పాలక్కడ్, మలప్పురం, త్రిశూర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఇడుక్కి, ఎర్నాకుళం, కొట్టాయం, అలప్పుఝా, పతనంతిట్ట జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కర్ణాటక రాజధాని బెంగళూరు, అసోం రాష్ట్రంలోని గువాహటీ నగరంలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి.

ఏ ఏడాది ఎప్పుడంటే..?

2009లో మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. ఇటీవలి సంవత్సరాలను పరిశీలిస్తే.. 2024లో మే 30న, 2023లో జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న కేరళను నైరుతి రుతుపవనాలు తాకాయి.



బెంగళూరు శాంతినగర్ బస్టాండ్ సమీపాన బీటీఎస్ రోడ్డుపై వర్షపునీరు

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దక్షిణ కర్ణాటకల్లో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. ఇంకా ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. బాపట్ల జిల్లా రేపల్లెలో 90, విశాఖపట్నంలోని సాగర్‌నగర్‌లో 75, కృష్ణా జిల్లా ఘంటసాలలో 71 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కాగా, రానున్న రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పలు ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఎల్ నినో ముప్పు లేదు..

ఈ ఏడాది ఎల్ నినో ఏర్పడే పరిస్థితులు లేవని గతనెలలోనే ఐఎండీ అంచనా వేసింది. దీంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగానే వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఎల్ నినో ఏర్పడదంటే బలమైన రుతపవనాలకు సంకేతం. దేశంలో వ్యవసాయం సమృద్ధిగా ఉండాలంటే బలమైన రుతుపవనాలు ఉండటం కీలకం. నైరుతి రుతుపవనాల సీజన్‌లో గత 50 ఏళ్ల సగటు వర్షపాతం 87 సెంటీమీటర్లు కాగా, దానికి 96 నుంచి 104 శాతాన్ని సాధారణ వర్షపాతంగా ఐఎండీ నిర్ధారించింది.

విశాఖ డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు ఏకగ్రీవం

- జనసేన తరఫున రంగంలోకి మద్దతు ప్రకటించిన 52 మంది కార్పొరేటర్లు, ఏడుగురు ఎమ్మెల్యేలు



విశాఖపట్నం, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) డిప్యూటీ మేయర్‌గా జనసేన పార్టీకి చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వైసీపీ నేత జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కొత్త డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే, కోరం లేక సమావేశాన్ని మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం ఎన్నిక నిర్వహించడానికి 56 మంది సభ్యులు అవసరమని పేర్కొన్నారు. ఏడుగురు ఎమ్మెల్యేలు, 52 మంది కార్పొరేటర్లు అప్పటికి హాజరైనట్టు అధికారులు నివేదించడంతో సమావేశాన్ని ప్రారంభించారు. డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు పేరును విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ప్రతిపాదించగా, ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరూ పోటీలో లేకపోవడంతో గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని ఆయనకు అందజేశారు.

అచ్యుతాపురంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- అదుపులో పలువురు యువతీ యువకులు
- అంతా ఉత్తర భారత, ఈశాన్య రాష్ట్రాల వాళ్లే!
- కాల్ సెంటర్ పేరిట డేటా సేకరించి ఎక్కడికో పంపుతున్నట్టు అనుమానం

అచ్యుతాపురం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం పరిసర ప్రాంతాల్లోని పలు అపార్టుమెంట్లలో మంగళవారం రాత్రి మూడు పోలీసు బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. కాల్ సెంటర్ పేరుతో మోసాలు జరుగుతున్నట్టు ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావడంతో భోగాపురం, శ్రీపురం లేఅవుట్, రామన్నపాలెం ప్రాంతాల్లో ఒకేసారి తనిఖీలు చేపట్టారు. ఉత్తర భారత, ఈశాన్య రాష్ట్రాల నుంచి యువతీ, యువకులు ఈ అపార్టుమెంట్లకు వస్తున్నట్టు సమాచారం. భోగాపురం ప్రాంతంలో తనిఖీలకు వెళ్లిన పోలీసులను చూసి కొందరు యువకులు పరిగెత్తడంతో అపార్టుమెంట్లలోని ప్రతి ఫ్లాట్‌ను పరిశీలించారు. భువనేశ్వరి గ్రాండ్ అపార్టుమెంట్‌లో 8 మంది అనుమానిత యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే భోగాపురంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక జంటను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. వారి వద్ద గంజాయి, మద్యం బాటిళ్లు దొరికినట్టు సమాచారం. మరో అపార్టుమెంట్ వద్ద నాగాలాండ్‌కు చెందిన ఒక యువకుడు పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. 20 మందికి పైగా యువకులు పరారైనట్టు తెలిసింది. అయితే వారు ఇక్కడకు ఎందుకు వచ్చారు? అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా? లేక ఏదైనా సమాచారం సేకరించే పనిలో ఉన్నారా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఈ తనిఖీలను గోప్యంగా ఉంచడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ నేతృత్వంలో అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.

తిరుమలలో యాంటీ డ్రోన్ టెక్నాలజీ

- ఒంటిమిట్టలో త్వరలో అన్నప్రసాదం
- టీటీడీ బోర్డు సమావేశంలో నిర్ణయాలు: ఈవో

తిరుమల, మే 20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రత పెంపు కోసం 'యాంటీ డ్రోన్ టెక్నాలజీ' వినియోగించాలని తీర్మానించినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ఇక్కడి అన్నమయ్య భవనంలో టీటీడీ బోర్డు మంగళవారం సమావేశమైంది. అనంతరం బోర్డు చేసిన తీర్మానాలను ఈవో మీడియాకు వెల్లడించారు. తిరుమలలో డ్రోన్లు పనిచేయకుండా చేసే ఇజ్రాయెల్‌కు చెందిన సాంకేతికత సిద్ధంగా ఉన్నట్టు తెలిసిందని చెప్పారు. దీనితోపాటు మరికొన్ని టెక్నాలజీలను కూడా పరిశీలించి, వాటిలో ఉత్తమమైన దాన్ని వినియోగించేందుకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అన్యమత ఉద్యోగులు 29మందిని టీటీడీ లోనే వేరే విభాగాల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. వీరికి వీఆర్ఎస్ అమలుకు కూడా నిర్ణయం తీసుకున్నామని, దీనిద్వారా ఒక్కొక్కరికి రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. వీరంతా గ్రూప్‌గా వీఆర్ఎస్‌కు అంగీకరిస్తే అదనంగా రూ.5లక్షలు ఇస్తామని ఈవో తెలిపారు. వారు ఇక, గోవింద నామాలను వక్రీకరిస్తూ 'డీడీ నెక్ట్స్ లెవల్' అనే సినిమాలో వినియోగించడంపై న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు నోటీసులు జారీ చేశామని ఈవో చెప్పారు.

మరికొన్ని నిర్ణయాలివీ...

- ఒంటిమిట్ట రామాలయంలో త్వరలో అన్నప్రసాద వితరణ ప్రారంభం. దీనికోసం తాత్కాలిక భవనం నిర్మాణం.
- రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో టీటీడీ శ్రీవారి ఆలయ అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయింపు.
- తిరుమల కొండల్లో పచ్చదాన్ని 80 శాతానికి పెంచేందుకు అటవీ విభాగానికి రూ.4 కోట్లు.
- తిరుమలలోని బిగ్, జనతా క్యాంటీన్ల లైసెన్స్‌కు ఒకే ఫీజు నిర్ధారిస్తూ నిర్ణయం. బ్రాండెడ్ హోటళ్ల సంస్థలకే కేటాయించాలని తీర్మానం. దీనికి అనుగుణంగా టెండర్లకు రూపకల్పన.
- స్విమ్స్‌లో 597 పోస్టుల భర్తీకి నిర్ణయం.



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో, సభ్యులు

టీటీడీ ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ

టీటీడీ ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ విధానం అమలవుతోంది. రెండ్రోజుల నుంచి వివిధ విభాగాల్లోని ఉద్యోగులు గుర్తింపు కార్డుతో పాటు నేమ్‌బ్యాడ్జీ కూడా ధరించి విధులు నిర్వహిస్తున్నారు.

వైఖానస సలహా కమిటీ నియామకం

టీటీడీకి నూతన వైఖానస సలహా కమిటీ నియామకమైంది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు ఏఎస్ కృష్ణశేషాచలం దీక్షితులు, ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పరాశరం భవనారాయణాచార్యులు, చెన్నైకు చెందిన పీకే వరదన్ భట్టాచార్యులు, గోవిందరాజస్వామి ఆలయంలోని సంభావన అర్చకుడు అనంతశయన దీక్షితులు, శ్రీవారి ఆలయ మాజీ అర్చకుడు ఖద్రీ నరసింహాచార్యులను కమిటీలో సభ్యులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరి పదవీకాలం రెండేళ్ల పాటు కొనసాగనుంది.

ఏపీఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ ప్రాథమిక కీ విడుదల నేడు

జేఎన్టీయూకే, మే 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2025 మంగళవారం రెండోరోజు ప్రశాంతంగా జరిగిందని ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 20,440 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 18,777 మంది హాజర య్యా రని, మధ్యాహ్నం అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 20,479 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 19,028 మంది హాజరయ్యారని తెలిపారు. బుధవారం ప్రాథమిక కీ విడుదల చేస్తామని చెప్పారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు ముగిశాయని.. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమై 27వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

ట్రిపుల్‌ఐటీలకు 48,850 దరఖాస్తులు

వేంపల్లె, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో చేరేందుకు మంగళవారం సాయంత్రం 5గంటల వరకు 48,850 దరఖాస్తులు వచ్చాయని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. జూన్ 6న ఎంపిక జాబితా విడుదల చేయనున్నా రు. జూన్ 11 నుంచి 17 వరకు అడ్మిషన్ ప్రక్రియ ఉంటుంది.

శ్రీవారి ఆలయం పోటులో సీబీఐ ఫోరెన్సిక్ బృందం తనిఖీలు

తిరుమల, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి వినియోగం కేసులో సిట్ విచారణ వేగంగా సాగుతోంది. సీబీఐ ఫోరెన్సిక్ విభాగం అధికారులు నలుగురు మంగళవారం తిరుమల చేరుకుని ముందుగా శ్రీవారిని దర్శించుకుని అనంతరం ఆలయంలో లడ్డూ, అన్నప్రసాదాల తయారీ పోటును పరిశీలించారు. పోటు కార్మికులతో మాట్లాడారు. లడ్డూ, అన్నప్రసాదాల తయారీని అడిగి తెలుసుకున్నారు. వారు ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు, సీనియర్లు ఎంతమంది ఉన్నారు వంటి విషయాలనూ తెలుసుకున్నారు. ముఖ్యమైన వాటిని వీడియో తీశారు. బూందీ తయారీ కేంద్రాన్ని కూడా సందర్శించి అక్కడి పోటు కార్మికులతోనూ మాట్లాడారు. అనంతరం తిరుపతిలోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు.

శ్రీశైలంలో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

- ప్రధాన నిర్మాణాల పునరుద్ధరణపై అధ్యయనం
- స్టీల్ సిలెండర్ల ఏర్పాటుకు 'బెకమ్'తో చర్చలు

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో దెబ్బతిన్న ప్రధాన కట్టడాల పునరుద్ధరణ చర్యలపై కేంద్ర వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం అధ్యయనం ప్రారంభించింది. ఈ బృందానికి ప్రభుత్వం రూ.50 లక్షలు రుసుము కింద మంగళవారం చెల్లించింది. దీంతో దెబ్బతిన్న అప్రోచ్ రోడ్, వరదకు కొట్టుకుపోయిన టెయిల్ పాండ్ ఎత్తిపోతల ప్రాజెక్టు, జలాశయం రాతిగోడలు, కొండ చరియలు విరిగిపడి పునాదులు దెబ్బతినడం, స్పిల్ వే వద్ద భద్రత కోసం ఏర్పాటు చేసిన స్టీల్ సిలెండర్లను మార్చడం వంటి అంశాలపై సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం అధ్యయనం ప్రారంభించింది ఇదే సమయంలో ప్లంజ్‌పూల్‌ను పరిశీలించి.. శాస్త్రీయ విధానంలో దానిని పూడ్చడంపైనా నిర్మాణాత్మక, సాంకేతిక సలహాలను ఇవ్వనుంది. మరోవైపు... స్టీల్ సిలెండర్ల ఏర్పాటులో విదేశీ సంస్థ బెకమ్ సేవలను వాడుకునేందుకు జలవనరుల శాఖ సంప్రదింపులు జరుపుతోంది.

స్టీల్‌ప్లాంటులో కార్మికుల సమ్మె పాక్షికం, ప్రశాంతం

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), మే 20(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోరుతూ స్టీల్‌ప్లాంటులో కార్మికులు తలపెట్టిన ఒక్కరోజు సమ్మె మంగళవారం ప్రశాంతంగా జరిగింది. అదే విధంగా కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె కూడా మొదలైంది. సమ్మె పాక్షికంగా జరిగింది. మరోవైపు.. స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే డిమాండ్లతో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నారు.

వైసీపీ సర్పంచ్ వేధింపులు.. పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

- తూర్పుగోదావరి జిల్లా కాపవరంలో ఘటన



పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి

బిక్కవోలు, మే 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరం పంచాయతీ వైసీపీ సర్పంచ్ వెంకటరమణ వేధింపులు తాళలేక కార్యదర్శి కె.విజయలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేశారు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కథనం మేరకు. 'విజయలక్ష్మి సోమవారం ఉదయం 10 గంటలకు బిక్కవోలు ఎంపీడీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిమిత్తం వచ్చి పక్కరూమ్‌లో సిట్రిజన్ టాబ్లెట్లు మిగింది. అంతకు ముందు ఆమె మొబైల్ నుంచి సర్పంచ్ వెంకటరమణకు బిల్లుల విషయమై ఫోన్‌చేయగా దుర్భాషలాడి అవమానపరిచాడు. కాపవరం వెల్నెస్ సెంటర్‌కు కిటికీలు, గుమ్మాల నిమిత్తం రూ.1,63,739 బిల్లును 15వ ఆర్థిక సంఘ నిధుల్లో పెట్టమని ఒత్తిడికి గురిచేస్తున్నాడు. సర్పంచ్ తమ్ముడు గ్రామపరిధిలో ఉన్న భూమిని ఆక్రమించి గేదెల షెడ్డు వేసుకున్నాడు. కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినా ఖాళీ చేయడం లేదు. ప్రతి విషయంలోనూ అవమానపరుస్తుండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసింది' అని ఎస్ఐ వివరించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఫోన్ చేయడంతో ఆమె భర్త వచ్చి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేర్చారని తెలిపారు. ఈ ఘటనపై రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య మంగళవారం విచారణ జరిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కరోనా మరణాల గుట్టు

ప్రపంచాన్ని కకావికలు చేసిన కరోనామహమ్మారి హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి కొన్ని ఆసియా దేశాల్లో మళ్ళీ ప్రభావం చూపుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈదేశాల్లో వందలాది కేసులు నమోదవుతున్నాయని, చైనాలో వ్యాప్తి ఉధృతంగా ఉంటూ, కేసులు వేలసంఖ్యలో ఉంటున్నాయని, ఆస్పత్రుల్లో చేరికలు కూడా హెచ్చుతున్నాయని వింటున్నాం. ఈ వేరియంట్ ప్రమాదకారి కాదని, ఆందోళన అక్కరలేదని ఆయా దేశాలు ప్రకటిస్తున్నాయి. భారతదేశంలోనూ మూడునాలుగు రాష్ట్రాల్లో కేసులు నమోదవుతూండటంతో కేంద్రప్రభుత్వం రంగంలోకి దిగి, దేశవ్యాప్తంగా 257యాక్టివ్ కేసులు మాత్రమే ఉన్నాయని, పరిస్థితి పూర్తినియంత్రణలో ఉన్నదంటూ ఒక ప్రకటన విడుదల చేసింది.

కరోనా బాగా బలహీనపడిందని, దగ్గు, జలుబుకు పరిమితమైపోయిందని, వేరియంట్లు, మ్యుటేషన్లు ఇత్యాది పదజాలానికి గతంలో మాదిరిగా వణికిపోనక్కరలేదని నిపుణులు ధైర్యం చెబుతూనే ఉన్నారు. కానీ, ఏటా వచ్చిపోతున్నప్పుడల్లా అది కాస్తంత ఆందోళనని కలిగిస్తూనే ఉంది. ఐదేళ్ళక్రితం యావత్ ప్రపంచం స్తంభించిపోయిన దృశ్యం సులువుగా చెరిగిపోయేది కాదు. 2020మార్చి పదకొండున ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని మహమ్మారిగా ప్రకటిస్తే, అదేనెల 24న భారత ప్రభుత్వం దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించి, బహుశా ప్రపంచంలోనే అత్యంత కఠినంగా దానిని అమలుచేసింది. వ్యాపారాలు స్తంభించిపోయాయి, చిన్నాచితకా చితికిపోయారు, ఎక్కడివారక్కడ ఇరుక్కుపోయారు. అంతిమంగా ఎన్ని అడ్డుగోడలు కట్టినా మహమ్మారి వ్యాప్తినీ, ప్రభావాన్ని నిలువరించలేకపోయాం. ఆ ఏడాది దాదాపు లక్షన్నర మరణాలు నమోదైనాయి. ఇక, డెల్టావేవ్ రూపంలో అత్యంత ప్రమాదకరమైన దాని రెండవ రాకడ మన ఆరోగ్యవ్యవస్థలను కుప్పకూల్చింది. ఆక్సిజన్ కోసం, ప్రాణాధారమైన మందులకోసం జనం గగ్గోలెత్తిపోయారు. ఆత్మీయుల ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆస్తిపాస్తులన్నీ అమ్ముకున్నారు, ప్రైవేటు ఆస్పత్రుల నిలువుదోపిడీకి గురైనారు. ఆ డెల్టావేవ్‌లో మృతుల సంఖ్య 3.32లక్షలని ప్రభుత్వం ప్రకటించింది.

కొవిడ్ మరణాలపై, అప్పటి క్షేత్రస్థాయి వాస్తవాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దాపరికం పాటించాయన్నది కాదనలేని నిజం. భారతదేశంలో 47లక్షలమంది కరోనాతో మరణించారని మూడేళ్ళక్రితం ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొన్నప్పుడు ఆ లెక్కలను ఖండించి, ఆ సంస్థ అనుసరించిన విధానాన్ని మన ప్రభుత్వం తప్పుబట్టింది. మునుపటి సంవత్సరాలతో పోలుస్తూ, ప్రస్తుత ఏడాదిలో అదనంగా సంభవించిన మరణాల ఆధారంగా కరోనా మరణాలెన్నో చెప్పడం సరికాదనుకున్నప్పటికీ, మహమ్మారి స్థాయిని, అధికశాతం మరణాలను ఇది పట్టిస్తుందన్న మాట నిజం. కానీ, 2020 జనవరి 1నుంచి 2021 డిసెంబరు 31వరకూ 4.81లక్షలమంది మరణించినట్టు భారత ప్రభుత్వం అధికారికంగా చెబుతూంటే, ఈ నివేదికలో మరణాల సంఖ్య అంతకు పదింతలు ఉండటం, ప్రపంచవ్యాప్త కరోనా మరణాల్లో 80శాతం ఒక్క భారతదేశంలోనే చోటుచేసుకున్నాయని అనడం మనకు నచ్చలేదు. లాన్సెట్ సహా దాదాపు నాలుగు స్వతంత్ర, గ్లోబల్ స్థాయి అధ్యయనాలు ప్రభుత్వ అధికారిక లెక్కలకంటే ఏడునుంచి పదిరెట్ల కరోనా మరణాలను ప్రకటించినప్పుడల్లా ప్రభుత్వం ఖండిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో, సివిల్ రిజిస్ట్రేషన్ డేటా ఆధారంగా ఇటీవల వెలుగుచూసిన మరణాల లెక్కల్లో డెల్టావైరస్ కాలంలో 21. 5లక్షలు అదనంగా ఉన్నట్లుగా తేలడం ఆశ్చర్యం కలిగించడం లేదు. మరణాలను తక్కువగా చూపడంలో గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తొలిస్థానాల్లో ఉన్నాయి. మహమ్మారిపై మహాయుద్ధం చేశామని చెప్పుకోవడానికి కేంద్రరాష్ట్రాలు దాచిపెట్టిన రహస్యం ఇది.

రోగవిస్తృతి, ప్రభావం ఇత్యాది అంశాల్లో దాపరికం పాటిస్తే, ఆ రోగం మీదే కాదు, భవిష్యత్తులో వచ్చిపడే ఆ తరహా మహమ్మారులమీద సైతం యుద్ధం చేయలేం. ఏ దేశమూ ఒంటరిగా ఉండలేని ఈ ఆధునిక కాలంలో సరికొత్త వాక్సిన్ల తయారీ సహా ప్రపంచస్థాయి ఉమ్మడి పోరాటం విజయవంతం కావాలంటే ప్రతి దేశమూ నిజాయితీగా వ్యవహరించాల్సిందే. ప్రమాదం లేదు, ప్రశాంతంగా ఉండండి అని సామాన్యుడికి భరోసా ఇవ్వడం అవసరమే. కానీ, పాలకులు వాస్తవాలు దాస్తున్నారని వారికి తెలిసినప్పుడు మరింత భయం కలుగుతుంది, అనుమానాలు పెరుగుతాయి.

సమతాభావం సాకారమయ్యేదెన్నడు?


■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'మీరు షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తి అయినందుకు మిమ్మల్ని గౌరవించడం లేదు. మీరు దళితుడైనందువల్ల ఈ పదవి మీకు లభించలేదు. ప్రజాజీవనంలో ఎంతో అనుభవమున్న మీకున్న ప్రతిభ వల్లే మీకీ పదవి వచ్చింది' అని 1998లో తొలి దళిత స్పీకర్ అయిన జిఎంసి బాలయోగిని అభినందిస్తూ రిపబ్లికన్ పార్టీ వ్యవస్థాపకుడు రామకృష్ణ సూర్యభాను గవాయి లోక్‌సభలో చేసిన ప్రసంగం చరిత్రలో నిలిచిపోదగ్గది. గత వారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కుమారుడు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పదవికి పూర్తి అర్హుడు. తండ్రి వారసత్వంలో బౌద్ధమతస్తుడుగా కొనసాగుతున్న జస్టిస్ గవాయి జస్టిస్ కెజి బాలకృష్ణన్ తర్వాత 18 సంవత్సరాలకు సీజేఐ అయిన రెండో దళితుడు. తనకు అర్హతలు ఉన్నప్పటికీ దళితుడినైనందువల్లే ఈ పదవి దక్కిందని జస్టిస్ బిఆర్ గవాయి 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైనప్పుడు అంగీకరించారంటే దేశంలో దళితులకు ప్రతి 10 ఏళ్లకో, 15 ఏళ్లకో ఏదో ఒక ఉన్నత పదవి ఇచ్చి కన్నీరు తుడవడం మన దేశంలో సాధారణమయిందని అర్థం చేసుకోవచ్చు.

'భారతదేశంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే కాదు, ఒకే విలువ ఉండాలి' అని బాబాసాహెబ్ అంబేడ్కర్ చేసిన వ్యాఖ్యలు ఎప్పటికైనా నిజం అవుతాయని ఆర్‌ఎస్ గవాయి కలలు కన్నారు. కాని ఈ మాటలు ఇప్పట్లో నిజమయ్యే అవకాశాలు లేవని ఆయన కుమారుడు జస్టిస్ గవాయికి ఆదివారం నాడు మహారాష్ట్ర బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం జరిగిన తీరును బట్టి అర్థమైంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ముంబై పోలీసు కమిషనర్ వంటి ఉన్నతాధికారులే హాజరు కాలేదు. 'మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తి సీజేఐ వంటి ఉన్నత పదవికి ఎంపికైన తర్వాత రాష్ట్రానికి తొలిసారి వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం వారు ఈ కార్యక్రమానికి హాజరు కావాలి. నేను నాకు లభించాల్సిన గౌరవం గురించి మాట్లాడడం లేదు. ఒక రాజ్యాంగ వ్యవస్థ మరో రాజ్యాంగ వ్యవస్థకు ఇవ్వాల్సిన గౌరవం గురించి మాట్లాడుతున్నాను' అని ఆయన స్పష్టంగా చెప్పాల్సి రావడం విషాదకరం. ఇదే మహారాష్ట్రకు చెందిన జస్టిస్ డివై చంద్రచూడ్ సీజేఐ అయిన తర్వాత స్వరాష్ట్రానికి వెళ్లినప్పుడు ఇదే విధంగా ప్రోటోకాల్ ఉల్లంఘన ఎందుకు జరగలేదు?

అత్యంత సంక్లిష్టమైన సమయంలో సీజేగా బాధ్యతలు చేపడుతున్న జస్టిస్ గవాయి కేవలం ఆరు నెలలే ఈ పదవిలో ఉంటున్నప్పటికీ తనదైన ముద్ర వేసే అవకాశాలు ఉన్నాయని ఆయన అనుసరిస్తున్న వైఖరిని బట్టి స్పష్టమవుతోంది. అంబేడ్కర్ అనుయాయుడుగా ఆయనతో పాటు బౌద్ధ మతాన్ని స్వీకరించిన ఆర్‌ఎస్ గవాయి కుమారుడైన జస్టిస్ గవాయిపై రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించాల్సిన గురుతర బాధ్యత ఉన్నది. ఆయన ఇచ్చే ప్రతి తీర్పును విమర్శకులు ఈ దృష్టితో చూసే అవకాశాలున్నాయి. ఎన్నికల బాండ్లను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించిన బెంచ్‌లో ఉన్న జస్టిస్ గవాయి ఎస్సీ ఎస్టీ వర్గీకరణను కూడా సమర్థించారు. మానవహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్ ఇచ్చినా, మోదీపై చేసిన వ్యాఖ్యల ఆధారంగా రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడం సరైంది కాదని చెప్పినా, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ ప్రసాదించినా, నేరస్తుల ఇళ్లను వారు నేరాలు చేశారన్న కారణంగా కూలగొట్టడం 'రూల్ ఆఫ్ లా' కు వ్యతిరేకమని ప్రకటించినా జస్టిస్ గవాయి తనదైన ప్రజాస్వామిక వైఖరిని ఇప్పటికే తన తీర్పుల ద్వారా స్పష్టం చేశారు.

దేశంలో ప్రధాన న్యాయమూర్తి వంటి ఉన్నత పదవులు నిర్వహించడం అంత సులభం కాదు. ఉన్నత పదవుల్లో ఉన్న వారిని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం కోసం రకరకాల శక్తులు ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో గత పది సంవత్సరాల్లో జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు ఆయనకు ముందున్నవారిలో కొందరు సీజేఐలు కూడా వివాదాస్పదులయ్యారు. అయినా రాజకీయ నాయకులతో పోలిస్తే న్యాయవ్యవస్థలో వివాదాస్పదులైన వారి సంఖ్య తక్కువే. అత్యంత క్లిష్టమైన సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి అయిన తెలుగువాడు జస్టిస్ రమణ తన పదవిని కత్తిమీద సాములా నిర్వహించినా ఆయనకు లభించినంత ప్రచారం, ఆదరణ మరే సీజేఐకి లభించలేదు. జస్టిస్ రమణకు ఉన్న జనాదరణ చూసిన తర్వాత అంతటి ఆదరణ తనకు లభిస్తుందా అన్న అనుమానం తనకు కలుగుతోందని ఆయన తర్వాత సీజేఐ అయిన జస్టిస్ లలిత్… జస్టిస్ రమణ వీడ్కోలు సందర్భంగా అన్నారు. ఇటీవల జస్టిస్ రమణ పుస్తకం 'నారెటివ్స్ ఆఫ్ బెంచ్ – ఎ జడ్జి స్పీక్స్' అన్న పుస్తకాన్ని జస్టిస్ బిఆర్ గవాయి ఆవిష్కరించినప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తులే కాదు, దేశవ్యాప్తంగా పలు హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జస్టిస్ రమణ తన ఆదరణను ఏ మాత్రం కోల్పోలేదని అర్థమవుతోంది.

న్యాయమూర్తులు ప్రజలకు దూరంగా ఒంటరిగా జీవించకూడదని, న్యాయవ్యవస్థ సామాన్యులకు అందుబాటులో ఉండాలని జస్టిస్ రమణ ఆశించారని, ఒక రకంగా జస్టిస్ రమణ 'ప్రజల న్యాయమూర్తి' అని జస్టిస్ బిఆర్ గవాయి ప్రశంసించారు. తాను, జస్టిస్ రమణ ఇద్దరం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చామని, కుటుంబంలో ఎవరూ న్యాయవాది కాకపోయినా తాము న్యాయవాద వృత్తి చేపట్టి అంచెలంచెలుగా పైకి ఎదిగామని ఆయన చెప్పారు. న్యాయవ్యవస్థను పటిష్టం చేయాలనే దీర్ఘకాలిక దృష్టితో జస్టిస్ రమణ పనిచేశారని, తాను ఆయన మార్గదర్శకత్వంలో నడుస్తానని జస్టిస్ గవాయి చెప్పడం గమనార్హం. జస్టిస్ రమణ హయాంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలకు చెందిన 9మంది న్యాయమూర్తులను నియమించారని, తొలిసారి సుప్రీంలో మూడో వంతు ప్రాతినిధ్యం మహిళలకు కల్పించారని ఆయన గుర్తు చేశారు. నిజానికి జస్టిస్ రమణ కొలీజియంలో ఉన్నప్పుడే ఇద్దరు సీనియర్లను కాదని జస్టిస్ గవాయిను సుప్రీంకోర్టుకు నియమించారు. లేకపోతే ఆయన సీజేఐ అయి ఉండేవారే కాదు. అదే విధంగా జస్టిస్ నాగరత్న వచ్చే ఏడాది భారత తొలి సీజేఐ అవుతున్నారంటే జస్టిస్ రమణ నేతృత్వంలోని కొలీజియం ఆమెను సుప్రీంకోర్టుకు ఎంపిక చేయడమే కారణం. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కూడా ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఈ విషయాలను జస్టిస్ గవాయి స్వయంగా వెల్లడించారు.


akbar

'భారత దేశంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే కాదు, ఒకే విలువ ఉండా'లన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ మాటలు ఎప్పటికి నిజమవుతాయి? అవి ఇప్పట్లో నిజమయ్యే అవకాశాలు లేవని కొత్త భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయికి మహారాష్ట్ర బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం తీరును బట్టి స్పష్టమవుతోంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ముంబై పోలీసు కమిషనర్ వంటి ఉన్నతాధికారులే హాజరు కాలేదు!

జస్టిస్ రమణతో పాటు పలు బెంచ్‌ల్లో ఉన్న జస్టిస్ గవాయి బహుశా ఆయన సీజేఐగా అయ్యే క్రమంలో ఎదుర్కొన్న సమస్యల్ని గ్రహించే ఉంటారు. బెంచ్‌లో చేరినప్పటి నుంచీ ఉన్నత స్థానానికి వచ్చేవరకూ తానెన్నో కుట్రపూరితమైన పరీక్షలకు గురయ్యానని, తాను, తన కుటుంబం మౌనంగా ఎంతో వేదనకు గురయ్యామని జస్టిస్ రమణ స్వయంగా వెల్లడించారు. వీడ్కోలు సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఆయన పుస్తకంలో కూడా చోటు చేసుకున్నాయి. ఏమిటా కుట్రలు? జస్టిస్ రమణ స్వయంగా వెల్లడిస్తే కాని అవి దేశానికి తెలిసే అవకాశాలు లేవు. నిజానికి న్యాయమూర్తులు, సీజేఐలు తమ హయాంలో ఎదురైన వ్యక్తిగత అనుభవాలు, ఒత్తిళ్ల గురించి చెప్పుకున్నప్పుడే భారతదేశంలో న్యాయవ్యవస్థ ఏ మార్గంలో పయనిస్తుందో అర్థమవుతుంది.

'ప్రభుత్వ అధికారాల్ని, చర్యల్ని న్యాయవ్యవస్థ సమీక్షించాలంటే అందుకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. న్యాయవ్యవస్థను ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ చట్టసభలు, ప్రభుత్వాలు నియంత్రించలేవు. అలా జరిగితే రూల్ ఆఫ్ లా అనేది భ్రమే అవుతుంది. మనం రూల్ ఆఫ్ లాను గౌరవించే సమాజాన్ని సృష్టించాలి' అని జస్టిస్ రమణ తన పుస్తకంలోని ఒక ప్రసంగ వ్యాసంలో అన్నారు. 'న్యాయానికి అధికారంలో ఉన్నవారు కూడా లొంగి ఉండాల్సిందే' అని అరిస్టాటిల్ అన్న వ్యాఖ్యలను గుర్తు చేశారు. అసలు అలా అనాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది?

'మీ విధేయత రాజ్యాంగానికి, రూల్ ఆఫ్ లా కే కాని, ఏ వ్యక్తికీ కాదు. రాజకీయాధికారం ఉన్నవారు కాలంతో పాటు మారుతూనే ఉంటారని, కాని ఒక వ్యవస్థగా మీరు శాశ్వతంగా ఉంటారు. అందుకే ఎవరికీ లొంగకుండా, స్వతంత్రంగా వ్యవహరించాలి' ఆయన సీబీఐ అధికారుల సమావేశంలోనే చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడమంటే ప్రతిపక్షాన్ని పటిష్టం చేయడం అని కూడా ఆయన మరో సందర్భంలో అన్నారు. కాని అలా జరుగుతోందా? జస్టిస్ రమణ పుస్తకంలో ఇలాంటి కీలక వ్యాఖ్యలు కోకొల్లలుగా ఉన్నాయి. మానవహక్కుల హననం గురించి కూడా ఆయన అనేక సందర్భాల్లో చెప్పారు. న్యాయమూర్తులు పలు సందర్భాల్లో చేసే ప్రసంగాల ద్వారా దేశంలో న్యాయవ్యవస్థ, ప్రభుత్వం నడుస్తున్న తీరుతెన్నులు స్పష్టంగా అర్థమవుతాయి. కాని ఆచరణలో మాత్రం అవి చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే మారతాయి.

తాను పదవీవిరమణ చేసిన తర్వాత మరే పదవీ చేపట్టబోనని జస్టిస్ గవాయి స్పష్టంగా ప్రకటించారు. తనకు పదవి ఇస్తామని ఎవరూ ప్రలోభపెట్టడానికి ఆస్కారం లేకుండా ఆయన ఈ ప్రకటన చేశారు. గతంలో సీజేఐలు మానవహక్కుల ఛైర్మన్, గవర్నర్, రాజ్యసభ సభ్యత్వం వంటి పదవులు స్వీకరించారు. జస్టిస్ చంద్రచూడ్‌కు ఏదో ఒక అంతర్జాతీయ పదవి వచ్చే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతోంది. జస్టిస్ గవాయిది రాజకీయ కుటుంబం కనుక పదవీ విరమణ తర్వాత తన తండ్రి నియోజకవర్గమైన అమరావతి నుంచి పోటీ చేసే అవకాశాలు లేకపోలేదు. కాని జస్టిస్ రమణ తనకు మొదటి నుంచీ క్రియాశీలక రాజకీయాలపై ఆసక్తి ఉన్నదని, విధి తనను న్యాయవ్యవస్థ దిశగా నడిపించిందని స్పష్టంగా చెప్పారు. సీజేఐగా తనకు లభించిన వీడ్కోలుతో తన క్రియాశీల జీవితం ముగియలేదని మరో అధ్యాయం ప్రారంభం కానున్నదని ఈ పుస్తకంలో ఆయన అన్యాపదేశంగా చెప్పారు. నిరంతరం క్రియాశీలకంగా యోచించేవారు ఖాళీగా ఉండలేరు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

తల్లిభాషను శ్వాసిస్తేనే వెల్గుల జీవితం

'దేశ భాషలందు తెలుగు లెస్స' అని కృష్ణదేవరాయలు చెప్పిన మాటలు మనకు ఎప్పటికీ గర్వకారణం. తెలుగు భాషకు అద్భుతమైన చరిత్ర, సంప్రదాయం, సాహిత్యం ఉన్నాయి. కానీ ఆధునిక కాలంలో ఉద్యోగాల వేటలో, విదేశాల బాటలో పరుగులు పెడుతూ మనమే మన భాషను విస్మరిస్తున్నాం. భవిష్యత్తుకు బాటలు వేసే బడి నుంచి తెలుగును నెమ్మదిగా వెలి వేశారు. ప్రైవేటు పాఠశాలల్లో మొదలైన ఈ పోకడ, రానురాను ప్రభుత్వ బడులకు కూడా పాకింది. కాన్వెంట్లలో చదివిన పిల్లలు ఆంగ్లం నేర్చుకొని, ఉన్నత విద్య పూర్తి కాగానే విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారన్న భావన సమాజంలో బలపడడంతో పల్లెల్లో కూడా ప్రభుత్వ బడులకు నిరాదరణ ఎదురైంది.

మాతృభాష అంటే కేవలం సంభాషణకు ఉపయోగించే భాష కాదు. అది మన భావోద్వేగాల ప్రతిబింబం, మన సంస్కృతికి మూలాధారం. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలలో మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వాలే కాకుండా ప్రజలు, ప్రజాసంఘాలు కూడా పాటుపడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే తల్లిభాష పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని చూస్తున్నాం. శాస్త్రవేత్తల పరిశోధనల ప్రకారం, మాతృభాషలో పునాది బలంగా ఉన్న విద్యార్థులు ఇతర భాషలను సులభంగా నేర్చుకుంటారు. పైగా మాతృభాషలో విద్యాబోధన వల్ల విద్యార్థులు బాగా అర్థం చేసుకుంటారు. ఇంట్లో మాట్లాడే భాషకు, బడిలో పాఠాలు నేర్చుకునే మాధ్యమానికి పొంతన లేకపోవడం వల్ల పిల్లలపై చిన్నప్పటి నుంచే భారం పడుతున్నది.



సమాజం ఎప్పుడూ పైకి చూస్తుంది. ఉన్నత స్థానాల్లో ఉన్న వాళ్లను అనుసరిస్తుంది, అనుకరిస్తుంది. ఈ వైఖరే తెలుగును ప్రమాదపు అంచుల దాకా తీసుకుపోయింది. దాదాపు మూడు నాలుగు దశాబ్దాల క్రితం పల్లెల్లో డబ్బున్న వాళ్లు తమ పిల్లలను పక్క ఊళ్లలోని ప్రైవేటు బడులకు పంపించడం, పట్టణాలూ నగరాల్లో పేరున్న విద్యాసంస్థల్లో చేర్పించడం మొదలయింది. అలా చదువుకున్న పిల్లలు మన దేశంలోనో పర దేశంలోనో బాగా డబ్బు సంపాదించి, సొంతూరికి వచ్చినప్పుడు మారిన జీవన శైలితో అందరి దృష్టిలో పడేవాళ్లు. అది చాపకింద నీరులా ఇంటింటికీ పాకింది. అప్పోసప్పో చేసైనా తమ పిల్లలను ప్రైవేటు బడులలో ఇంగ్లీషు మీడియం చదివించాలన్న భావన పల్లెల్లో బలపడింది.

తెలుగు భాష ప్రమాదంలో పడిందని భాషాభిమానులు గ్రహించే లోగానే పరిస్థితి దాదాపు చేతులు దాటిపోయింది. మాతృభాషలో చదువుల ఆవశ్యకతను తెలియజేస్తూ కాళ్లకు బలపాలు కట్టుకొని ఊళ్లు పట్టుకొని తిరుగుతున్న వాళ్లకు ప్రోత్సాహం లభించకపోగా, ప్రతిఘటన ఎదురయింది. వీళ్లంతా తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించి, విదేశాలకు పంపించి, ఇప్పుడిప్పుడే బలపాలు పట్టుకున్న నిరుపేదల పిల్లలను ఎదగకుండా చేసేందుకే తెలుగుభాషా పరిరక్షణ పేరుతో వీధుల్లోకి వస్తున్నారనే వాదన తెరమీదికి వచ్చింది. తెలుగును కాపాడుకోవాలని పిలుపునిస్తున్న అధిక శాతం ప్రముఖుల పిల్లలుగానీ, వాళ్ల పిల్లలుగానీ తెలుగు మాధ్యమంలో చదవడం లేదు.

ఒక భాష మనుగడ కోల్పోతే, ఆ భాషతో పాటు ఆ సంస్కృతి, ఆ చరిత్ర కూడా అంతరించిపోతుంది. ఐక్యరాజ్యసమితి విద్యా విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నెలకు సగటున రెండు భాషలు అంతరించిపోతున్నాయి. తెలుగు భాషకు అలాంటి ప్రమాదం ఇప్పుడే లేదు అనుకున్నా, మన నిర్లక్ష్య ధోరణి కొనసాగితే అది సమీప భవిష్యత్తులో విపత్తుగా మారవచ్చు. ఎంట్రెన్సుల కోసం విద్యార్థులను తోమీతోమీ ఆప్షనల్ సబ్జెక్టులను బట్టీ పట్టించే ప్రైవేటు విద్యాసంస్థలు దీనికి ఒక అడ్డదారి కనుగొన్నాయి. తెలుగుకు బదులుగా సంస్కృతాన్ని ద్వితీయ భాషగా తీసుకుంటే పెద్దగా కష్టపడకుండానే నూటికి నూరు మార్కులు తెచ్చుకునే అవకాశం ఉండడంతో అందరినీ సంస్కృతం వైపు నడిపించాయి. ఇది తెలుగు భాషకు పెద్ద ప్రమాదంగా పరిణమించింది. చదువు జనం భాషలో ఉన్నపుడే చదువుకున్నవాళ్లకూ సామాన్యులకూ మధ్య వారధిగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు ప్రతి విభాగంలోనూ తెలుగును ఆచరణీయమైన భాషగా అమలు చేయాలి.

మాతృభాషా పరిరక్షణ నినాదం ప్రతి ఇంటికీ చేరాలి. ప్రతి వ్యక్తిలోనూ భాషాభిమానం నింపాలి. ప్రతి ఇంట్లోనూ తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులోనే మాట్లాడేలా ప్రోత్సహించాలి. కథలు చెప్పాలి, పాటలు పాడాలి. పండగలు, పబ్బాలలో తెలుగుదనం ఉట్టిపడేలా చూడాలి. పదో తరగతి దాకా తెలుగును తప్పనిసరిగా బోధించాలి. తెలుగు మీడియాన్ని ప్రోత్సహించాలి. ఇంగ్లీష్ ప్రాముఖ్యతను కాదనకూడదు కానీ తెలుగును తక్కువ చేయకూడదు; తెలుగు భాషా దినోత్సవాలు, సాహిత్య ఉత్సవాలు నిర్వహించాలి. తెలుగు అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలి. యువ రచయితలకు ప్రోత్సాహం ఇవ్వాలి; మొబైల్ యాప్స్, వెబ్‌సైట్స్, ఆన్‌లైన్ పాఠాలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తెలుగును సాంకేతికతలోనూ విస్తరించాలి. కృత్రిమ మేధ, అనువాద యంత్రాలు, వాయిస్ అసిస్టెంట్లకు తెలుగును మరింత అనుకూలంగా తీర్చిదిద్దాలి.

30 ఏళ్ల క్రితం తెలుగు భాషోద్యమ సమాఖ్య వాళ్లు ఉద్యమ కరదీపికగా 'తెలుగువాణి' అనే పక్షపత్రికను నిర్వహించేవారు. ఆ పత్రికలో ప్రచురితమైన ఒక వక్కపొడుల సంస్థ ప్రకటనలోని నినాదం నాకింకా గుర్తుంది. 'వక్క పలుకుల రుచి మధురం, తెలుగు పలుకులు మృదుమధురం'. 15వ శతాబ్దంలో ఎక్కడో యూరప్ నుంచి విజయనగర సామ్రాజ్యానికి వచ్చిన నికోల్ డి కంటి అనే భాషా పరిశోధకుడు తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అని కొనియాడాడు. తెలుగు భాషలో అనేక ప్రత్యేకతలున్నాయి. వేల ఏళ్ల చరిత్ర కలిగిన మన తెలుగును కాపాడుకుందాం. భావి తరాలకు భద్రంగా అందిద్దాం.

■ పి. వేణుగోపాల్ రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్

నిరుద్యోగం కోరల్లో యువత

భారతదేశంలో ప్రస్తుతం నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. డిగ్రీలు పుచ్చుకున్న చాలా మంది యువతకు సరైన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. దేశంలోని మొత్తం జనాభాలో నిరుద్యోగ రేటు 2024 ప్రారంభంలో సగటున 7.5 శాతంగా ఉంది. 15 నుంచి 29 ఏళ్ల మధ్య యువతలో ఇది 16.1 శాతంగా నమోదవడం ఆందోళన కలిగించే అంశం. 2022లో ఈ యువ నిరుద్యోగిత రేటు 23.2 శాతంగా ఉండేది. నగరాల్లో ఈ రేటు 5.1 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 3.4 శాతం. కానీ రాష్ట్రాల వారీగా చూస్తే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది.

విద్యా వ్యవస్థ, నైపుణ్యాల లేమి నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. దేశంలో ప్రతి సంవత్సరం 15 లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యలో పట్టభద్రులవుతున్నా, వారిలో 80 శాతం మందికి ఆ ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు (Aspiring Minds) లేవని నివేదిక చెబుతోంది. ప్రస్తుతం కృత్రిమ మేధ (AI) కారణంగా చాలామంది ఉద్యోగాలను కోల్పోతున్నారు.

గ్రామీణ భారతంలోనూ ఈ నిరుద్యోగ సమస్య అధికంగానే ఉంది. దేశంలోని సుమారు 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధిని కల్పిస్తున్నా, దేశ జీడీపీలో దాని వాటా కేవలం 16.18 శాతం మాత్రమే! ఈ నిరుద్యోగ సమస్య సామాజికంగానూ తీవ్ర ప్రభావం చూపుతోంది. నిరుద్యోగిత, నేరాల మధ్య స్పష్టమైన సంబంధం ఉంది. NCRB నివేదిక ప్రకారం నిరుద్యోగం అధికంగా ఉన్న రాష్ట్రాల్లో దోపిడీలు, దొంగతనాలు, హత్యల వంటివి అధికంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువత మానసిక ఒత్తిడికిలోనై, అనేక చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. ఇది దేశ భద్రతకే ముప్పుగా మారే ప్రమాదం ఉంది.

MGNREGA ద్వారా గ్రామీణులకు 100 రోజులు ఉపాధి కల్పిస్తున్నా, వారి వాస్తవ జీతం సగటున రోజుకు రూ. 220–240 మాత్రమే! స్కిల్ ఇండియా ద్వారా శిక్షణ పొందినవారి లోనూ కేవలం 15 శాతం మందికే స్థిరమైన ఉద్యోగాలు లభిస్తున్నాయి. స్టార్టప్ ఇండియా ద్వారా 70,000కు పైగా స్టార్టప్‌లు రిజిస్టర్ అయినా, నిధుల కొరత, మానిటరింగ్ లోపాల కారణంగా వాటిలో సుమారు 95 శాతం స్టార్టప్ సంస్థలు ఐదు సంవత్సరాల్లోనే మూతబడ్డాయి. .

ఈ పరిస్థితిని అధిగమించాలంటే తయారీ రంగానికి దేశం అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. MSME లకు ఆర్థిక సాయం అందించాలి. విద్యా విధానాన్ని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగాలు కల్పించేలా రూపొందించాలి. సామాజిక భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలి. యువతలో స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలను తగ్గించే విధంగా సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం వ్యూహరచన చేయాలి.

– మహమ్మద్ ఉబైద్‌ఖాన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

బీసీల సమగ్రాభివృద్ధే తెలుగుదేశం లక్ష్యం

బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్న నేతలనే ఇన్నాళ్లూ చూశాం. బీసీల అభ్యున్నతి గురించి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న నేత ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబునాయుడు మాత్రమే. బీసీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వృద్ధిలోకి తెచ్చేలా తెలుగుదేశం పార్టీ బాటలు వేస్తోంది. ఆది నుంచి కూడా ఈ పార్టీ బీసీల కోసమే పనిచేస్తోంది. బీసీల హక్కులను కాపాడింది. బీసీ విద్యార్థుల చదువుల కోసం పాటుపడింది. వారికి ఉపాధి అవకాశాల కోసం, విదేశాల్లో చదివేందుకు కృషి చేసింది. స్పీకర్‌గా, కేంద్ర మంత్రులుగా, జాతీయ స్థాయిలో బీసీలకు గుర్తింపు తెచ్చింది. మూడుసార్లు పార్టీ పగ్గాలు బీసీలకే అప్పగించిన ఘనత టీడీపీది. బీసీల అభ్యున్నతికి పాటుపడిన జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి మరిన్ని బాటలు వేస్తున్నది. ఆర్థిక బడ్జెట్లో ఇప్పటివరకు రూ.లక్షల కోట్లు నిధులు కేటాయించి బీసీలను మరో ఎత్తుకు తీసుకెళ్లేందుకు పార్టీ కృషి చేస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు టీడీపీకి బలమైన మద్దతుదారులుగా నిలబడ్డారు.

బీసీలకు రాజ్యాధికారం దిశగా సీఎం చంద్రబాబు నాయుడు అద్భుతమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. కేవలం బీసీలకే కాదు, వెనకబడిన వర్గాల ఉన్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. గత పాలకులు వసతిగృహాల నిర్వహణను గాలికొదిలేశారు. ఆయా భవనాలకు కనీస మరమ్మతులు కూడా నిర్వహించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బీసీ వెల్ఫేర్ వసతి గృహాలను, గురుకుల పాఠశాలలను దశలవారీగా అభివృద్ధి చేసే ప్రణాళికలు అమలుపరుస్తోంది. వసతిగృహాలకు టాయిలెట్లు, సురక్షిత తాగునీటికి ఆర్వో ప్లాంట్, టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఇన్వర్టర్ వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల ఉన్నతి కోసం డిజిటల్ క్లాసెస్, స్పోకెన్ ఇంగ్లీష్, యోగ, వ్యాయామ విద్య వంటి వాటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సంబంధిత జిల్లా కలెక్టర్లు వసతి గృహాలను తప్పనిసరిగా నెలకోసారి పరిశీలించి సమీక్షించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రస్తుతం 28 రెసిడెన్షియల్స్‌కే సొంత భవనాలున్నాయి. మిగిలిన వాటికి కూడా సొంత భవనాలు నిర్మించేందుకు రూ.1200 కోట్లతో ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసింది.

బీసీల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా గతంలో ఉమ్మడి జిల్లాల్లో స్థలాలు కేటాయించి జిల్లాకు ఒకటి చొప్పున తెలుగుదేశం పార్టీ 13 బీసీ భవన్‌ల నిర్మాణాన్ని చేపట్టింది. కానీ అనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ నిర్మాణాలను పక్కనపెట్టి బీసీలను అవమానించింది. రూ.75,760 కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించి వారిని వంచించింది. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల మేలు కోసం ప్రస్తుతం 26 జిల్లాల్లో 26 బీసీ భవనాలు ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించింది. ఇప్పటికే చిత్తూరు, శ్రీకాకుళంలో ఈ నిర్మాణాలు పూర్తయ్యాయి.

రాజకీయంగా కూడా బీసీలను తెలుగుదేశం పార్టీ ప్రోత్సహిస్తోంది. శాసనసభ్యుల కోటా నుంచి తెలుగుదేశం పార్టీకి వచ్చిన మూడు ఎమ్మెల్సీలను బలహీనవర్గాల వారికే కేటాయించింది. బీద రవిచంద్రయాదవ్, బీటీ నాయుడు, కావలి గ్రీష్మ వంటి వారిని చట్టసభలకు పంపింది.




మిగిలిన చోట్ల కూడా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బీసీ యువతకు స్వయం ఉపాధిని కల్పించేలా చంద్రన్న స్వయం ఉపాధి, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్, MSMEల ద్వారా పలు రుణాలను, రాయితీలను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న బీసీ అభ్యర్థులకు స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందిస్తోంది.

కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించడంలో టీడీపీ ప్రభుత్వం అధిక శ్రద్ధ చూపుతోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే కుల వృత్తులు చేసుకుంటున్న వారికి 'ఆదరణ 3.0' ద్వారా అధునాతన పనిముట్లను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అసలు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజ్యాధికారం లభించింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా బీసీల నుంచి వేలాదిమంది నాయకులుగా ఎదిగారు. చట్టసభల్లో వారికి గౌరవప్రదమైన స్థానాలు కేటాయించి గౌరవించింది. రూ.1.50 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. బీసీల సామాజిక, ఆర్థిక, మౌలిక సంక్షేమం కోసమే ఏటా రూ.30 వేల కోట్లు ఖర్చు చేయనుంది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,110 బీసీ వసతిగృహాల్లో 660 మాత్రమే ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన వాటికి కూడా సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. బ్యాంక్ లింకేజీల ద్వారా రుణాలు అందజేసి బలహీనవర్గాలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి బీసీలకు శిక్షణా కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రాజకీయంగా కూడా బీసీలను తెలుగుదేశం పార్టీ ప్రోత్సహిస్తోంది. శాసనసభ్యుల కోటా నుంచి తెలుగుదేశం పార్టీకి వచ్చిన మూడు ఎమ్మెల్సీలను బలహీనవర్గాల వారికే కేటాయించింది. బీద రవిచంద్రయాదవ్, బీటీ నాయుడు, కావలి గ్రీష్మ వంటి వారిని చట్టసభలకు పంపింది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా బీసీలకే ప్రాధాన్యం ఇస్తూ… ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్‌గా పి.కృష్ణయ్య, శాసనమండలి చీఫ్‌విప్‌గా పంచుమర్తి అనురాధ, ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణతోపాటు కేంద్ర, రాష్ట్ర కేబినెట్ భర్తీలో కూడా బీసీలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా NBC FDC (వెనుకబడిన వర్గాల జాతీయ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలు అందించడం, మినీ డెయిరీ యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు, టైలరింగ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించి కుట్టుమిషన్ల పంపిణీ, MSME ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించే ఎన్నో కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోంది.



○ అనగాని సత్యప్రసాద్
ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి



హైడ్రామా..!

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో వైసీపీ మైండ్‌గేమ్



వైసీపీ కౌన్సిలర్లను నగరం నుంచి తిరువూరు పంపిస్తున్న పోలీసులు

- ఎన్నిక రద్దు కావడానికి శతవిధాలా ప్రయత్నాలు
- వైసీపీ కౌన్సిలర్లను విజయవాడలో దాచి కట్టుకథలు
- పోలీసులు అడ్డుకుంటున్నారంటూ ఈసీకి ఫిర్యాదు
- ఈసీ ఆదేశాలు పట్టించుకోవట్లేదంటూ హైకోర్టులో కేసు
- వైసీపీ నేత అవినాశ్ ఆధ్వర్యంలో తిరువూరులో హడావిడి
- ఎక్కడికక్కడ అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- ఈ తతంగంతో ముగిసిన ఎన్నిక సమయం.. రద్దు

చివరి నిమిషంలో వైసీపీ కౌన్సిలర్ల సమాచారం లీక్

ఎస్కార్టుతో తిరువూరు తరలించిన పోలీసులు



తిరువూరులో బందోబస్తు

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దే లక్ష్యంగా వైసీపీ డబుల్ గేమ్ ఆడింది. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లను బయటకు రానీయకుండా నగరంలోని ఓ హోటల్‌లో దాచి ఉంచిన నాయకులు.. తమ వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలను పోలీసులు అమలు చేయట్లేదంటూ మంగళవారం హైకోర్టులో కేసు వేసి విషయాన్ని పక్కదారి పట్టించారు. ఓవైపు ఎన్నిక జరగనివ్వట్లేదని ఆరోపిస్తూనే, మరోవైపు ఎన్నిక రద్దయ్యేలా మైండ్‌గేమ్ ఆడారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరువూరు మున్సిపాలిటీలో సంఖ్యాపరంగా వైసీపీకి-17, టీడీపీకి-3 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే, వైసీపీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీకి టచ్‌లోకి వచ్చారు. దీంతో వైసీపీ బలం 12కు పడిపోయింది. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు బయటకు రాకపోయినా టీడీపీకే మద్దతు ప్రకటిస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో టచ్‌లో ఉన్నారు. దీంతో వైసీపీకి పదిమంది మద్దతు మాత్రమే ఉంది. ఈ పదిమందిలో ఒక కౌన్సిలర్ అమెరికాలో ఉన్నారు. ఎన్నికకు రాలేదు. దీంతో ఆ పార్టీ బలం 9. టీడీపీ బలం.. ముగ్గురు కౌన్సిలర్లతో పాటు మద్దతు వచ్చిన ఐదుగురితో కలిపి మొత్తం 8కి చేరింది. మరో ఇద్దరు సభ్యులు టచ్‌లో ఉండటంతో టీడీపీకి 11 మంది సభ్యుల మద్దతు లభించినట్టైంది. ఫలితంగా తిరువూరు మున్సిపల్ పీఠం టీడీపీ వశమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎలాగైనా ఎన్నికను నిలుపుదల చేయాలని వైసీపీ నాయకులు మైండ్‌గేమ్ ఆడారు. సమావేశం ఉంది.. రమ్మనిచెప్పి కౌన్సిలర్లకు ఆహ్వానం పలికి, నగరంలోని ఓ హోటల్‌లో ఉంచారు. వారి సెల్‌ఫోన్లు మిగతా 6లో..

నిన్న అలా : తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లను టీడీపీ నాయకులు పోలీసుల సహాయంతో అడ్డుకుంటున్నారంటూ వైసీపీ నాయకులు సోమవారం డ్రామా సృష్టించారు. ఎన్నికల సంఘం అధికారిణి నీలం సాహ్నికి ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని, వారిని కౌన్సిల్ లోపలి వరకు పోలీసు భద్రత నడుమ తీసుకెళ్లాలని ఆమె సోమవారం ఉదయమే ఆదేశాలిచ్చారు. కానీ, సోమవారం వైసీపీ కౌన్సిలర్లు ఎన్నికకు రాలేదు. దీంతో కోరం లేక ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. కౌన్సిలర్లు అందరినీ విజయవాడలోనే ఓ హోటల్‌లో ఉంచి, ఏమీ తెలియనట్టుగా సోమవారమే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ తిరువూరు వెళ్లి హడావిడి చేశారు.

నేడు ఇలా : దేవినేని అవినాశ్ మంగళవారం మరో ఎత్తుగడ వేశారు. ఎన్నికల సంఘం అధికారిణి నీలం సాహ్ని ఆదేశాలను పోలీసులు అమలు చేయలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. ఓవైపు హైకోర్టులో పిటిషన్ వేస్తూనే, మరోవైపు నగరంలోని శిబిరంలో కౌన్సిలర్లను బయటకు రానీయకుండా చూశారు.

తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు

- కోరం లేకపోవటంతో రద్దు చేసిన ఎన్నికల అధికారులు
- వైసీపీ సభ్యులంతా గైర్హాజరు
- టీడీపీకి మద్దతుగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు

6







మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి జలమయమైన మొగల్రాజపురంలోని బిఐ ఎంక్లేవ్ రోడ్డు (ఇన్‌సెట్‌లో) బందరు రోడ్డులో జోరువాన

అప్రమత్తంగా ఉండండి

- వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలు
- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- పర్యవేక్షించాలని అధికారులకు సూచన
- అత్యవసరమైతేనే బయటకు రావాలని ప్రజలకు పిలుపు

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటం, వాతావరణ శాఖ, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 9154970454 నెంబరుతో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశామని, ప్రజలు తమకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఈ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, సరఫరాలో ఆటంకం లేకుండా ఉండాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, రోడ్లపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపేందుకు అవసరమైన సిబ్బంది, ఇంజన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా చెట్లు కూలితే వెంటనే తొలగించేలా ఆదేశాలిచ్చామన్నారు.

ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడటం వంటివి చేయొద్దని, వాహనాలను భద్రమైన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలని, వర్షాలు పడే సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు.

ఎండీయూ రద్దుతో నెలకు రూ.కోటి ఆదా

ఉమ్మడి కృష్ణాపై తగ్గిన భారం

- ఇక ప్రజలకు సులువుగా రేషన్
- రేషన్ షాపులపై ప్రత్యేక యాప్‌తో నిఘా



(ఆంధ్రజ్యోతి, మొగల్రాజపురం) : మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇకపై పాత పద్ధతిలో చౌక దుకాణాల్లో బియ్యం తీసుకునే విధానం అందుబాటులోకి రానుంది. అలాగే, ఇకపై రేషన్ మోసాలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా యాప్‌ను కూడా ప్రభుత్వం తీసుకొస్తోంది. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థ రద్దు కావడంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో నెలకు రూ.కోటీన్నర ఆదా కానుంది. ఎన్టీఆర్ జిల్లాలో 5లక్షల90వేల243 కార్డులకు గాను 957 రేషన్ దుకాణాలు, 374 ఎండీయూ వాహనాలు ఉండగా, కృష్ణాజిల్లాలో 5లక్షల22వేల589 కార్డులకు గాను 1,059 రేషన్ దుకాణాలు, 336 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. మొత్తం 710 వాహనాలకు ఒక్కో వాహనంపై ప్రభుత్వం రూ.5లక్షల82వేలు వెచ్చించింది. ఎండీయూ ఆపరేటర్‌కు రూ.10 వేల జీతం, రూ.3 వేల ఇంధనం, రూ.5 వేల హమాలీ చార్జీలు, బ్యాంక్ ఇన్‌స్టాల్‌మెంట్ రూ.3 వేలు కలిపి మొత్తం రూ.21 వేలు చెల్లిస్తుంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎండీయూలకు ప్రభుత్వం మిగతా 6లో..

బదిలీల జాతర

ఉమ్మడి కృష్ణాలో 4,761 మంది టీచర్లకు చాన్స్

త్వరలోనే నోటిఫికేషన్.. బందరులో కౌన్సెలింగ్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రభుత్వం బదిలీలకు పచ్చజెండా ఊపడంతో ఒక్కో శాఖలో స్థానాలు కదిలే వారి సంఖ్య తేలుతోంది. విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు అంకురార్పణ జరగబోతోంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయుల బదిలీల లెక్క వేరుగా సాగింది. కౌన్సెలింగ్‌లు, ఖాళీలతో సంబంధం లేకుండా పలుకుబడి ఉన్న వారంతా నచ్చిన బడుల్లో కుర్చీలు వేసుకున్నారు. ఈ ప్రక్రియతో విసిగిపోయిన ఉపాధ్యాయులు తాజాగా జరగబోయే బదిలీల్లో న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా.. భౌగోళికంగా వేర్వేరు జిల్లాలుగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల బదిలీల్లో మాత్రం ఒకే జిల్లాగా పరిగణిస్తున్నారు. ఈ బదిలీలకు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి రామారావు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈసారి ఉపాధ్యాయుల బదిలీలు మచిలీపట్నం కేంద్రంగా జరుగుతాయి.

4,761 మందిపై ప్రభావం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం సుమారు 12,250 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ప్రధానోపాధ్యాయులు 362, స్కూల్ అసిస్టెంట్లు (తెలుగు) 265, సంస్కృతం 20, ఉర్దూ 17, హిందీ 677, ఇంగ్లీష్ 932, గణితం 992, ఫిజికల్ సైన్స్ 686, జనరల్ సైన్స్ 743, సోషల్ స్టడీస్ 784, వ్యాయామ ఉపాధ్యాయులు 460 (ఫిజికల్ డైరెక్టర్లు) మంది ఉన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తెలుగు 5,744, ఉర్దూ 283 మంది ఉన్నారు. వారిలో ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్లు పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం మార్గదర్శకాలు మిగతా 6లో..

త్వరలో అమరావతిలో లేబర్ ఇన్‌స్టిట్యూట్

- 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా ప్రణాళికలు
- జేవియర్ లేబర్ రిలేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి కె.ఎస్.కాసిమిర్

8



ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌తోనే ఎయిర్ కార్గోకు మార్గం

- డిమాండ్ తేలకుండా కార్గో ఫ్లైట్స్ రావాలంటే కష్టం
- పాసింజర్ విమానాలు నడిపి పరిశీలించాలి
- తర్వాతే డిమాండ్‌పై అవగాహన



ఆటోనగర్‌లో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్


- పీపీపీ విధానంలో బహుళ ప్రయోజనకరంగా..
- ఎకరం 87 సెంట్లలో ఏర్పాటు
- నెల రోజుల్లో నివేదిక ఇవ్వనున్న సంస్థ

8

అసైన్డ్ బందీ

ఇంకెంతకాలం..!

- పీవోటీ నిబంధనలున్నా.. అమలు సున్నా..
- జీవోలు విడుదలైనా పట్టించుకోని వైనం
- కోర్టును ఆశ్రయించిన వారికే న్యాయం
- 40 ఏళ్లు దాటుతున్నా హక్కులు లేక దైన్యం
- ఉమ్మడి కృష్ణాలో 1.25 లక్షల మంది



పేదలకు అసైన్డ్ భూములను ఇళ్ల పట్టాలుగా ఇచ్చి దశాబ్దాలు దాటుతున్నా ఇంకా నిషేధిత భూముల జాబితా (22ఏ) చెర వీడలేదు. నిజమైన లబ్ధిదారులకు ఆటోమేటిక్‌గా ఆ భూములపై యాజమాన్య హక్కులు సంక్రమిస్తాయని పీవోటీ చట్టం చెబుతున్నా.. ఆ హక్కులను కాలరాస్తూ ఇంకా నిషేధిత జాబితా (22ఏ) చెరలోనే ఉంచారు. ఈ విషయంలో న్యాయస్థానాలను ఆశ్రయించిన వారికి న్యాయం జరుగుతుండగా, మిగతా వారికి మాత్రం ఇబ్బందులు తప్పట్లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1.25 లక్షల నివేశనా స్థలాలు ఇచ్చినట్టుగా రికార్డులను బట్టి తెలుస్తోంది. వీటిలో చేతులు మారని ఇళ్ల పట్టాల లబ్ధిదారులు 50 వేల మంది వరకు ఉండొచ్చని అంచనా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, నాటి ప్రభుత్వాల హయాంలో పేదలకు దఫదఫాలుగా ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ స్థలాల్లో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్బన్ ప్రాంతాల్లో లే అవుట్లు వేసి పేదలకు స్థలాలిచ్చారు. ఈ లే అవుట్లు కాలక్రమంలో కాలనీలుగా మారాయి. దశాబ్దాలు గడిచిపోతున్నా ఇవన్నీ నిషేధిత భూముల జాబితాలోనే ఉన్నాయి. తమ ఆర్థిక అవసరాల కోసం కొందరు లబ్ధిదారులు అమ్ముకున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1.25 లక్షల మందికి అసైన్డ్ పట్టాలు ఇస్తే, వాటిలో 75 వేలకు పైగా మిగతా 6లో..

కోర్టును ఆశ్రయించే వారికే న్యాయం

ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్ (పీవోటీ) చట్టంలోని సెక్షన్-6 ప్రకారం.. అసైన్డ్ ల్యాండ్‌లో పదేళ్లు ఇంటిని నిర్మించుకుని నివసిస్తే ఆటోమేటిక్‌గా ఆ లబ్ధిదారుడికి పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయి. కానీ, మినహాయింపులు అమలు కాకుండా అడ్డుకుంటున్నారు. దీంతో కొందరు అప్పులు చేసి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. అలా ఆశ్రయించిన వారికి న్యాయం జరుగుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వందల సంఖ్యలో లబ్ధిదారులు న్యాయస్థానాల్లో టైటిల్ డిక్లరేషన్ సూట్స్‌ను ఫైల్ చేస్తున్నారు. ఇలా ఫైల్ చేసిన వారికి మాత్రం కోర్టు ఆదేశాలతో నిషేధిత భూముల నుంచి తొలగిస్తున్నారు. మిగిలిన వారికి మాత్రం అన్యాయం చేస్తున్నారు. నాటి ప్రభుత్వాలు ఇచ్చిన నివేశనా స్థలాలకు నేడు మార్కెట్ రేటు గణనీయంగా పెరిగింది. అయినప్పటికీ పిల్లల ఉన్నత విద్య, పెళ్లిళ్లు వంటి వాటికి బ్యాంకుల్లో తనఖా పెట్టుకునే అవకాశం కూడా లేకుండాపోతోంది. నిషేధిత భూముల్లో ఉండటం వల్ల బ్యాంకులు రుణాలు ఇవ్వట్లేదు.

టీడీపీకి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లను నిర్బంధించారు!

● ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధే లక్ష్యంగా టీడీపీకి మద్దతు ఇస్తున్న ఇద్దరు కౌన్సిలర్లను వైసీపీ నాయకులు నిర్బంధించారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో టీడీపీ కౌన్సిలర్లతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 19వ తేదీన జరగాల్సిన ఎన్నిక కోరం లేక మంగళవారానికి వాయిదా పడిందని, అధికారుల సూచనలతో తమ సభ్యులంతా కార్యాలయానికి చేరుకొని, నిర్బంధంలో ఉన్న టీడీపీ సభ్యుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. సుమారు 10 మంది వైసీపీ కౌన్సిలర్లు అభివృద్ధి లక్ష్యంగా టీడీపీకి మద్దతు ప్రకటించారన్నారు. ఆరుగురు సభ్యులు టీడీపీలో చేరిన అనంతరం, మరో నలుగురు టీడీపీలో చేరుతున్న సమాచారంతో వారిని బెంగళూరు తరలించారని అన్నారు. ఈ సంఘనపై కేసు పెట్టడం జరిగిందన్నారు. నిర్బంధానికి గురైన సభ్యులు రాగానే వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని, స్వేచ్ఛగా నిర్ణయం తీసుకుని ప్రశాంతంగా ఛైర్‌పర్సన్ ఎన్నిక జరిగేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

త్వరలో కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మరోవారంలో కొండపల్లి మున్సిపాలిటీలో టీడీపీ విజయం సాధిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరంలో జరిగిన మినీ మహానాడు సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నిక త్వరలో జరుగుతుందని, ఇదో మంచి శుభవార్త అని అన్నారు. ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యిందన్నారు. వేదికపై ఉన్న ఛైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబును హర్షధ్వానాల మధ్య ఆయన అభినందించారు.

డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఇబ్రహీంపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేయాలని, అధిక లోడు రవాణా చేయరాదని ఆర్ఎస్సై లక్ష్మణరావు సూచించారు. ఏపీ మినీ వ్యాన్ మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర సదస్సు ఇబ్రహీంపట్నంలోని సీఐటీయు కార్యాలయం వద్ద మంగళవారం జరిగింది. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, సురక్షితమైన డ్రైవింగ్ చేయాలన్నారు. సలహాలు, సూచనలు అందించారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నార చిర్రా నాగరాజు, ఇబ్రహీంపట్నం మండల సీఐటీయు కార్యదర్శి ఎం.మహేష్, సురేష్ వర్మ, రాజమండ్రి వెంకటేశ్వరరావు, అశోక్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో ఆలయాలపై ప్రత్యేక దృష్టి

వన్‌టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం ఈవోలకు సూచించారు. మైలవరం నియోజకవర్గం చంద్రగూడెం గ్రామంలోని కోదండ రామాంజనేయ దేవస్థానం పైకప్పు నుంచి వర్షపు నీరు ఆలయంలోకి వస్తోందని, వెంటనే అభివృద్ధి చేయాలని ఆలయ ఈవో ఎస్.శ్రీనివాస్, గ్రామ పెద్దలు 20 మంది మంగళవారం గవర్నరుపేటలో దేవదాయశాఖ జిల్లా అధికారి షణ్ముగం వద్దకు వచ్చి ఆలయ పరిస్థితులను వివరించారు. స్పందించిన నటరాజన్ షణ్ముగం రెండు, మూడు రోజుల్లో దేవస్థానానికి విచ్చేసి ఉన్నతాధికారులతో మాట్లాడి అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాయితీ వేరుశనగ విత్తనాలు తగ్గింపు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగను ప్రధాన పంటగా సాగు చేస్తారు. రాయలసీమతోపాటు మన్యం, అల్లూరి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోనూ స్వల్పంగా వేరుశనగ సాగవుతోంది. ఏటా మే నెల రెండో వారంలోనే వేరుశనగ విత్తనాలు 40శాతం రాయితీపై ఎకరానికి 90కిలోల చొప్పున రైతులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.95లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇండెంట్‌ను సవరించి, కేవలం 1.95లక్షల క్వింటాళ్లకే పరిమితం చేసింది.

రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా మసులా బీచ్ ఫెస్టివల్

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, బందరు చరిత్రను తిరగరాసేలా మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం సచివాలయంలో ఇద్దరు మంత్రులు సమావేశమై జూన్ 6,7,8 తేదీల్లో నిర్వహించే మచిలీపట్నంలోని మంగినపూడి మసూల బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై చర్చించారు. పర్యాటకుల వినోదం కోసం బీచ్ కబడ్డీ, కయాకింగ్ జల క్రీడలు, హెలీ రైడ్, పారా గ్లైడింగ్, నీటిలో గ్లైడింగ్, స్కూబా డ్రైవింగ్, స్పీడ్ బోట్లు తదితర క్రీడలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో శానిటేషన్ రీ టెండర్లకు అనుమతి

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఆస్పత్రుల్లో శానిటేషన్ నిర్వహణకు ప్రభుత్వం మరోసారి టెండర్లు పిలిచింది. ఇప్పటికే టెండర్లు పిలిచినా వివిధ కారణాలతో బిడ్ ఫైనెల్జ్ కమిటీని రద్దు చేసి, రీ టెండర్లకు వెళ్లాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రత్యేక కమిటీ కమిటీ రూపొందించిన టెండర్ నిబంధనలకు ఆమోదం తెలుపుతూ ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ధరల పర్యవేక్షణకు 'అగ్రివాచ్' మంత్రుల కమిటీ నిర్ణయం

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 'అగ్రివాచ్' ద్వారా ధరలను పర్యవేక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రద్దు

● కోరం లేకపోవటంతో రద్దు చేసిన ఎన్నికల అధికారులు

తిరువూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రద్దైంది. మంగళవారం జరిగిన ఎన్నికకు సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో ఎన్నిక రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమావేశ మందిరంలో ఆమె సభ్యుల కోసం వేచి చూశారు. గడువు ముగిశాక కూడా టీడీపీ, వైసీపీ సభ్యులు రాకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, తదుపరి చర్యల కోసం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

కార్యాలయం వద్దే టీడీపీ కౌన్సిలర్లు

టీడీపీ మద్దతు తెలిపిన వైసీపీకి చెందిన ఐదుగురు సభ్యులతో పాటు టీడీపీ చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు మద్దతు ప్రకటించిన మరో ఇద్దరు కౌన్సిలర్లను వైసీపీ నాయకులు నిర్బంధించారని టీడీపీ కౌన్సిలర్లు ఆరోపించారు. కార్యాలయం వద్ద ఉన్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు 8 మంది టీడీపీ కౌన్సిలర్లు సమావేశ మందిరంలోకి వెళ్లారు. అయితే, కోరం పూర్తికాదని, మరో ఇద్దరు కౌన్సిలర్ల కోసం వేచి చేశారు. ఎన్నిక రద్దయినట్లు అధికారులు ప్రకటించడంతో వారు కూడా వెళ్లిపోయారు. 13వ వార్డు కౌన్సిలర్ ఇనపనూరి చిన్నారిని వైసీపీ నాయకులు నిర్బంధించారంటూ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం తో పాటు వైసీపీ నాయకుడు నల్లగట్ల స్వామిదాసు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు.

నిర్మానుష్యంగా కార్యాలయం రోడ్డు

తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నేపథ్యంలో సోమవారం ఇరువర్గాలతో కిటకిటలాడిన మున్సిపల్ కార్యాలయం రోడ్డు మంగళవారం మాత్రం బోసిపోయింది. పోలీసు బందోబస్తు నేపథ్యంలో నిర్మానుష్యంగా కనిపించింది. దాదాపు పట్టణం మొత్తం పోలీసుల నిఘాతో నిండిపోయింది.

భారీ బందోబస్తు

తిరువూరులో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఏడీసీపీ, నలుగురు ఏసీపీలు, ఇద్దరు డీసీపీలు, మైలవరం ఏసీపీ, సీఐలు 8 మంది, పలువురు ఎస్సైలు సోమ, మంగళవారాల్లో గస్తీ నిర్వహించారు.

అసైన్డ్ బందీ

(5వ పేజీ తరువాయి)

నివేశనా స్థలాలు చేతులు మారాయన్నది ఓ అంచనా. కేవలం 50 వేల స్థలాలే అసలైన లబ్ధిదారులు, వారి వారసుల చేతుల్లో ఉన్నాయి. పదేళ్ల దాటితే హక్కుదారులు అయిపోతారని పాత జీవోలు చెబుతున్నాయి. కానీ, ఏవీ అమల్లోకి రావట్లేదు. ఇది జరగాలంటే నిషేధిత భూముల జాబితా 22ఏ నుంచి తొలగించాలి.

ఇలా చేస్తే బెటర్

నిషేధిత భూముల నుంచి తొలగించటం వల్ల లబ్ధిదారులు తమ ప్లాట్లను కుటుంబ సభ్యుల పేరుతో గిఫ్ట్ డీడ్‌లు చేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. స్థలాలకు రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఫలితంగా లబ్ధిదారులు బ్యాంకుల్లో తనఖా పెట్టుకుని ఆర్థిక అవసరాలు తీర్చుకునే అవకాశం కలుగుతుంది.



మైలవరంలో మినీ మహానాడులో మాట్లాడుతున్న వసంత



జగ్గయ్యపేట మినీ మహానాడులో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, నెట్టెం, ఎమ్మెల్యే తాతయ్య



గన్నవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రవీంద్ర, యార్లగడ్డ, కొనకళ్ల

2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి

● కార్యకర్తలే టీడీపీ బలం : ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

మైలవరంరూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పునాది, బలం, శక్తి కార్యకర్తలేనని, 2029లో కూడా పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. మైలవరం నియోజకవర్గ మినీ మహానాడును మైలవరం వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో మంగళవారం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్యోతి వెలిగించి మినీ మహానాడును ఆయన ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పెహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, కె.విజయబాబు, నర్రా వాసు, ఉయ్యూరు నరసింహారావు, జువ్వారాంబాబు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, వజ్రాల కుమారరెడ్డి, లంకా లితీష్, ఇనుగంటి శోభన్‌బాబు, రాయల లీలాప్రసాద్, మోర్ల రోశాలు, దూరు బాలకృష్ణ, చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టకుదురు శ్రీనివాసరావు, దారు నాయక్ పాల్గొన్నారు.

గన్నవరంలో పటిష్టం చేస్తా : యార్లగడ్డ

గన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి విలువలతో కూడిన రాజకీయాలు చంద్ర బాబుకే సాధ్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గన్నవరం నియోజకవర్గ మినీ మహానాడు ఏబీ కన్వెన్షన్‌లో వల్లాణం హరిబాబు నాయుడు అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా టీడీపీని పటిష్టం చేస్తానని ఎన్నికల్లో చెప్పిన హామీలను అమలు చేసేలా విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు

జగ్గయ్యపేట, నందిగామల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్

● జగ్గయ్యపేట మినీ మహానాడులో ఎంపీ కేశినేని చిన్ని, నెట్టెం

జగ్గయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేట, నందిగామ నియోజక వర్గాల దశదిశ మార్చేలా ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు కాబోతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మినీ మహానాడులో వారు పాల్గొని మాట్లాడారు. వైసీపీ అస్తవ్యస్త పాలనతో అధోగతి పాలైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం చంద్రబాబు నేతృత్వంలో గాడిలో పెట్టడంతో ద్వారా అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నారన్నారు. జగ్గయ్యపేట, నందిగామల్లో రెండు వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్ వస్తే పరిశ్రమల స్థాపన జరిగి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జగ్గయ్యపేటలో ప్రభుత్వ కళాశాలకు డీపీఆర్ సిద్ధమైందని, ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తారన్నారు. వేదాద్రి, కంచెల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు విడుదల కానున్నాయన్నారు. కొత్తగా నియమితులైన పార్టీ బాధ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు దొంతు చిన్నా, మండల పార్టీల అధ్యక్షులు కట్టా నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, ఛైర్మన్ రామచంద్ర, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు : చిన్ని



నందిగామ, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. నందిగామ నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు స్థానిక ఆర్ఎస్ గార్డెన్‌లో మంగవారం జరిగింది. నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్ఫూర్తిగా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనతో కునారిల్లుతున్న రాష్ట్రానికి తిరిగి జీవం పోసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎస్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, నియోజకవర్గ పరిశీలకుడు బచ్చుల సుబ్రహ్మణ్యం, కోగంటి బాబు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కందుల కల్పన, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని సహించం

● గో బ్యాక్ అవినాష్

● అడ్డుకున్న టీడీపీ శ్రేణులు



దేవినేని అవినాష్ వాహనాన్ని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

తిరువూరు/ఎ.కొండూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను ఎ.కొండూరు మండలం రేపూడి-మాధవరం జంక్షన్ వేపచెట్టు సెంటర్ వద్ద టీడీపీ శ్రేణులు మంగళవారం అడ్డుకున్నారు.

తిరువూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో, విజయవాడ నుంచి వైసీపీ నాయకులు వస్తున్న సమాచారంతో రామచంద్రాపురం సమీపంలోని బాడవ టోల్‌ప్లాజా వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. వైసీపీ నాయకుల వాహనాలను అడ్డుకునేందుకు సిద్ధం అయ్యారు. అయితే, వైసీపీ నాయకులు రెడ్డిగూడెం మీదుగా తిరువూరు వస్తుండడంతో టీడీపీ శ్రేణులు ఎ.కొండూరు - విస్సన్నపేట రోడ్డులోని మాధవరం వేపచెట్టు సెంటర్‌వద్ద అవినాష్ ప్రయణిసున్న వాహనాన్ని అడ్డుకున్నారు. వాహనంలో అవినాష్‌తో పాటు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు ఉన్నారు. మరో నాలుగు వాహనాల్లో దేవినేని అవినాష్ అనుయాయులు ఉన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణు లు వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశాంతంగా ఉన్న తిరువూరులో అల్లరు సృష్టించి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు వస్తున్నారని, మంగళగిరి టీడీపీ కార్యాలయంపై దాడికేసులో నిందితుడిగా ఉన్న అవినాష్‌కు ఈ ప్రాంతంలో ఏం పని అని ప్రశ్నించారు. ఒక దశలో అక్కడ ఉన్న పోలీసులకు, టీడీపీ శ్రేణులకు పెద్దఎత్తున వాగ్వావాదం జరగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సుమారు రెండు గంటలు రోడ్డుమీదే టీడీపీ శ్రేణులు కారు ను అడ్డుకొని గోబ్యాక్ అవినాష్ అంటూ నినాదాలు చేశారు. తిరువూరు, మైలవరం సీఐలు గిరిబాబు, చంద్రశేఖర్, రెడ్డిగూడెం ఎస్సై తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని అవినాష్‌ను తిరిగి వెనక్కు పంపించే ప్రయత్నం చేశారు. అవినాష్ కారును టీడీపీ శ్రేణులు చుట్టుముట్టి కదలకుండా అడ్డుకున్నారు. గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున అరుస్తూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు టీడీపీ శ్రేణులను నియంత్రించారు. పోలీసులు అనివాష్‌తో మాట్లాడి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ వాహనంలో మైలవరం తరలిస్తామని చెప్పడంతో కార్యకర్తలు శాంతించారు. అనంతరం అవినాష్‌తో పాటుగా ఇతర నేతలను, పోలీసువాహనంలో ఎక్కించుకొని రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆలవాల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ, తిరువూరులో అల్లరు చేసేందుకు వస్తున్న విజయవాడ వైసీపీ శ్రేణుల్ని అడ్డుకున్నామని, తిరువూరులో ఎన్నికలు జరుగుతుంటే విజయవాడ నాయకులకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే తిరువూరు ప్రాంతంలో వైసీపీ నాయకుల రౌడియిజం చెల్లదని, ప్రశాంతతకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు. టీడీపీ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, భీమ్లానాయక్, పిక్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేవినేని అవినాష్ అరెస్టు, విడుదల

రెడ్డిగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను మంగళవారం పోలీసులు ముచ్చినపల్లి సమీపంలో అదుపులోకి తీసుకొని రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు అతనితో పాటు మొండితోక అరుణ్‌కుమార్, నల్లగట్ల స్వామిదాసులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై బి.మోహన్‌రావు తెలిపారు.

అధికారం పోయినా వైసీపీ దౌర్జన్యాలు ఆగడం లేదు

● తిరువూరు ఘటనలపై ఎంపీ కేశినేని శివనాథ్

జగ్గయ్యపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికారం పోయినా వైసీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు ఆగటం లేదని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మండిపడ్డారు. జగ్గయ్యపేట నియోజకవర్గ మినీ మహానాడు ప్రాంగణంలో ఆయన మంగళవారం తిరువూరు ఘటనలపై స్పందించారు. తిరువూరు మునిసిపల్ కౌన్సిలర్లను ఎవరూ, ఎక్కడా అడ్డుకోలేదన్నారు. విజయవాడ నుంచి కొంత మంది నేతల ముసుగులో వచ్చిన గుండాలను విస్సన్నపేట వద్ద తమ పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నారని చెప్పారు. ఎన్నిక నిస్పక్షపాతంగా జరగాలన్నదే తమ అభిమతమని, మెజార్టీ ఉన్న వ్యక్తే ఛైర్మన్ అవుతారని వ్యాఖ్యానించారు. ఆయన వెంట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఉన్నారు.

సమస్యలపై అధ్యయనానికే క్షేత్రస్థాయి పరిశీలన



మాడపాటి అతిథి గృహాన్ని, సీవీ చారిటీస్ విశ్రాంతి భవనాన్ని, వేదపాఠశాలను సందర్శిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, మే 20 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని వనరులు, సదుపాయాలపై అధ్యయనం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పరిశీలించటం వల్ల సమస్యలు ఆకళింపు చేసుకోవటానికి వీలవుతుందని దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. ఇటీవల ఈవో బాధ్యతలు స్వీకరించిన వి.కె. శీనానాయక్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. దుర్గగుడి పరిసరాలలోని అతిథి గృహాలను, వసతి సముదాయాలను పరిశీలించారు. మాడపాటి అతిథి గృహాన్ని తనిఖీ చేసిన ఆయన భక్తులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. అతిథి గృహానికి అవసరమైన మరమ్మతులను చేయించాలని, విద్యుత్ సరఫరా సమస్యను నివారించాలని ఈ.ఈ కోటేశ్వరరావుకు సూచించారు. సి.వి.రెడ్డి చారిటీస్ భక్తుల విశ్రాంతి సముదాయాన్ని కూడా పరిశీలించారు. భక్తులకు ఏవిధంగా సేవలు అందిస్తున్నారో ఆరా తీశారు. గుణదలలోని దేవస్థానం ఉద్యోగుల నివాస సముదాయాన్ని కూడా ఆయన పరిశీలించారు. క్వార్టర్లలో ఎంత మంది నివాసం ఉంటున్నారు, వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. అత్యంత ఖరీదైన దేవాలయ భూమి పరిరక్షణకు ఏవిధమైన చర్యలు తీసుకువాలో సిబ్బందికి సూచనలు చేశారు. పోరంకిలోని స్మార్త వేద పాఠశాలను కూడా ఆయన పరిశీలించారు. వేద విద్యార్థులకు అందే సదుపాయాలు, అధ్యాపకుల సమస్యలు తదితర అంశాలను తెలుసుకున్నారు.

హైడ్రామా

(5వ పేజీ తరువాయి)

తీసుకుని మరీ కమ్యూనికేషన్ లేకుండా చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో టచ్‌లోకి వచ్చిన ఇద్దరు కౌన్సిలర్లు కూడా ఇక్కడే ఉండిపోయారు.

తిరువూరులో ఉద్రిక్తత

ఓవైపు విజయవాడలో కౌన్సిలర్లను దాచి ఉంచిన దేవినేని అవినాశ్.. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, మరికొందరు అనుచరులతో కలిసి మంగళవారం తిరువూరు బయల్దేరారు. టీడీపీ కార్యాలయంపై దాడి చేయించారన్న కసి ఒకవైపు, ఎన్నిక సందర్భంగా అల్లర్లు సృష్టించటానికి వస్తున్నాడన్న కసి మరోవైపు.. కలగలసి టీడీపీ శ్రేణులు అవినాశ్ తిరువూరు రాకుండా అడ్డుకున్నాయి. బాడవ టోల్ ప్లాజా వద్ద ఆ పార్టీ నాయకులు కాపు కాశారు. ఈ విషయాన్ని పసిగట్టిన అవినాశ్.. రెడ్డిగూడెం మీదుగా తిరువూరు వెళ్లే ప్రయత్నం చేసినా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ తతంగంతో ఎన్నిక సమయం ముగిసిపోయింది. ఎన్నిక సమయం ముగిసే వరకు విజయవాడలో దాచి ఉంచిన వైసీపీ కౌన్సిలర్లు.. తిరువూరులోని కౌన్సిల్‌కు రాలేదు. హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాలతో వైసీపీ సభ్యులకు రక్షణ కల్పించాలని పోలీసులు విచారణ చేయగా, విజయవాడలో ఉన్నారని తెలిసింది. ఎన్నిక ముగిసే సమయానికి ఫలానా హోటల్‌లో ఉన్నారంటూ అవినాశ్ వర్గీయులు సమాచారాన్ని లీక్ చేశారు. దీంతో పోలీసులు ఆ హోటల్‌కు వచ్చి వైసీపీ కౌన్సిలర్లను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అప్పటికే ఎన్నికకు గడువు ముగియటం, ఎన్నిక రద్దు కావటంతో ఎస్కార్టుతో ఒక బస్సులో వారిని తిరువూరు తీసుకెళ్లారు.

నెలకు రూ.కోటి ఆదా

(5వ పేజీ తరువాయి)

చెల్లించేది రూ.కోటి49లక్షల10వేలు. ఒక కార్డుదారుడికి బియ్యం ఇవ్వడానికి డీలర్‌కు కమీషన్, ఎండీయూ ఆపరేటర్‌కు జీతం+ఖర్చులు ప్రభుత్వమే భరించాల్సి వచ్చేది.

ప్రజల కష్టాలకు చెక్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పౌరసరఫరాల వ్యవస్థపై దృష్టి పెట్టింది. రేషన్ పంపిణీ విధానంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేసింది. దీంతో ఎండీయూ వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి.

సమస్యలు అనేకం

ఎండీయూ వాహనంలో పేరుకే డోర్ డెలివరీ చేస్తున్నారు. కానీ అనుకున్న లక్ష్యాన్ని ఇది చేరలేదు. గత ప్రభుత్వానికి ఈ విషయం తెలిసినా పట్టించుకోలేదు. వాహనం వచ్చేరోజు ఆ గంట కోసం కార్డుదారుడు పని మానుకుని పడిగాపులు పడాల్సి వచ్చేది. వాహనం వచ్చినపుడు లేకపోతే ఆ నెల బియ్యం పోయినట్టే. ఈ విధానం రద్దు కావడం వల్ల కార్డుదారుడు ప్రతినెలా 1 నుంచి 15వ తేదీలోపు తనకు కుదిరినపుడు రేషన్ షాపునకు వెళ్లి తెచ్చుకోవచ్చు.

బదిలీల జాతర

(5వ పేజీ తరువాయి)

నిర్దేశించింది. బదిలీలు కోరుకున్న ఉపాధ్యాయులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మాత్రం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని, మచిలీపట్నంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. మిగిలిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్ల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తారు. ఇప్పటికే రెండు జిల్లాల విద్యాశాఖాధికారులు బదిలీల ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ వ్యవహారం పూర్తయ్యాక పదోన్నతుల ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. బదిలీలు జరిగాక ఖాళీగా ఉన్న స్థానాలను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. కాగా, బదిలీలకు దరఖాస్తులు చేసుకోవడానికి త్వరలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనున్నందున ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. ఇంటికి దగ్గరగా ఉండేలా నాలుగైదు పాఠశాలలను ఎంపిక చేసుకుంటున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పరస్పర అంగీకారంతో స్థానాలు మార్పు చేసుకునేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

విజయవాడ - కర్నూల్ విమాన సర్వీసు

● జూలై 2 నుంచి ప్రారంభించనున్న ఇండిగో

విజయవాడ - ఆంధ్రజ్యోతి : విజయవాడ విమానాశ్రయం నుంచి కర్నూల్‌కు జూలై 2 నుంచి విమాన సర్వీసు అందుబాటులోకి రాబోతోంది. ఇండిగో సంస్థ ఈ విమాన సర్వీసును నడుపుతోంది. రాష్ట్ర రాజధాని ప్రాంతమైన అమరావతిని కర్నూల్‌కు అనుసంధానం చేసేలా ఈ కొత్త విమాన సర్వీసు దోహదపడుతుంది. ఉడాన్‌లో భాగంగా కర్నూల్‌కు ఈ సర్వీసు నడుపుతున్నారు.. ఇండిగో విమాన సంస్థ ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ అవకాశం కల్పించింది. విజయవాడ - కర్నూల్ మధ్య టిక్కెట్ ధర రూ.2,506గా నిర్ణయించింది. ఈ సర్వీసు సోమవారం, బుధవారం, శుక్రవారం వారంలో మూడ్రోజులు నడుస్తుంది. విజయవాడ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4.50గంటలకు కర్నూల్ చేరుకుంటుంది. కర్నూల్ నుంచి 5.10 గంటలకు బయలుదేరి, సాయంత్రం 6.15 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది.

ఎర్రచందనం అమ్మకం ధరపై కమిటీ

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ వద్ద ఉన్న ఎర్రచందనం నిల్వలను ఈ-టెండర్, ఈ-వేలం ద్వారా విక్రయించడానికిగాను ధరను నిర్ణయించడానికి ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. అటవీ, పర్యావరణ, శాస్త్రసాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన, పీసీసీఎఫ్ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

దుర్గగుడిలో హనుమజ్జయంతి వేడుకలు రేపు

ఇంద్రకీలాద్రి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా ఈ నెల 22న ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీఆంజనేయస్వామి, ఘాట్ రోడ్‌లోని ఆంజనేయస్వామి, పాతమెట్ల మార్గంలో ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, నాగవల్లీ దళార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



పిన్నమనేని రోడ్డులో...



బెంజిసర్కిల్‌లో...



బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్డులో...



రమేష్ ఆసుపత్రి జంక్షన్‌లో



గురునానక్ రోడ్డులో

రోడ్లు జలమయం

- బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్లలో వర్షంనీటిలో కలిసిన డ్రెయినేజీ నీరు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- వాహనదారుల పాట్లు

నగరంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. రహదారి పై నీళ్లు నిలిచిపోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరో వైపు వాహనాలు నిలిచి ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు.

మొగల్రాజపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలో పలు వీధులు జలమయం అయ్యాయి. పటమట సబ్ రిజిస్ట్రార్ రోడ్డు వర్షం నీటికి మునిగింది. పిన్నమనేని రోడ్డులో డ్రెయిన్‌లపై కాంక్రీట్ బిళ్లలు వేయడంతో వర్షంనీరు కాల్వలోకి వెళ్లే మార్గం లేక రోడ్డు మీదకు చేరింది. సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఫార్మసీ కళాశాల వద్ద సైడు కాల్వపై బడ్డీలు ఉండటంతో వర్షం నీరు కాల్వలోకి వెళ్లే మార్గం మూసుకుపోయింది. జమ్మిచెట్టు వద్ద కూడా ఇదే పరిస్థితి. వర్షం తగ్గిన తరువాత వీఎంసీ సిబ్బంది వచ్చి అక్కడక్కడ వర్షం నీటి ఉధృతికి కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు.

విజయవాడ: అంబేడ్కర్ నగర్ రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి నీరు రోడ్డుమీదే నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తిచెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పిన్నమనేని రోడ్డులో సైడ్ కాల్వల్లో...

నీటమునిగిన పారిశ్రామికవాడ



ఆటోనగర్: వర్షంతో పారిశ్రామికవాడ నీటమునిగింది. ఏ రోడ్డు చూసిన నీటి కుంటలే తారసపడుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తునాయి. వర్షపునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. ఆటోనగర్ బురదమయమైంది. పోలీస్‌స్టేషన్ రోడ్డు, సన్‌సిటీ సెంటర్, కామినేని నగర్ వంటి పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఆటోనగర్ మీదుగా మురళీనగర్, కానూరు, నాగార్జుననగర్, రామవరప్పాడు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐలా అధికారులు ఇప్పటికైనా రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థలపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నారు.

బెంజిసర్కిల్ కూడలి ప్రాంతం

బెంజిసర్కిల్: అకాల వర్షానికి బెంజిసర్కిల్ కూడలి ప్రాంతం వర్షపునీటితో నిండిపోయింది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. బెంజిసర్కిల్ నుంచి వారధివైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో వర్షపు నీటికి డ్రెయినేజీ నీరు తోడవడంతో ఆ ప్రాంతం మురికికూపం వలే తయారై దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల స్థానికులు, వాహనదారులతో పాటు పాదచారులు సైతం ఇబ్బందిపడ్డారు. బెంజిసర్కిల్ వైపు వచ్చిన వాహనదారులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు.

నాల్గో డివిజన్‌లో...

భారతీనగర్: నాల్గో డివిజన్‌లోని పలు ప్రధాన రహదారులు అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా నాల్గో డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన, కనకదుర్గ గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ సమీపంలోని గమేశా బజార్ రోడ్డు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, భారతీనగర్ మెయిన్‌రోడ్డు, పలు కాలనీ అంతర్గత రోడ్ల వర్షపు నీటికి జలమయ మయ్యాయి.

కొట్టిరెడ్డి రోడ్డు అధ్వానం

గుంతలు పడి అధ్వానంగా మారిన కొట్టిరెడ్డి రోడ్డులో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడాల్సిందే. భారతీనగర్ హైటెన్షన్ రోడ్డు వెంబడి ఉన్న విజయలక్ష్మి కాలనీలోని హోసన్నా గాస్పెల్ సెంటర్ సమీపంలో కొట్టిరెడ్డి రోడ్డు ఉంది. ఈ రోడ్డు ఆటోనగర్‌కు అనుసంధాన రోడ్డు కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డు మీద నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్లో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు.



బురదగామారిన కొట్టిరెడ్డి రోడ్డు

అప్రమత్తంగా ఉండండి: కమిషనర్



డ్రెయిన్లను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షాలు కురుస్తుండటంతో రోడ్లపైన నీటి నిల్వలు ఉండ కుండా సిబ్బంది మొత్తం అప్ర మత్తంగా ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశిం చారు. నగర పర్యటనలో భాగంగా ఎంజీరోడ్డు, బెంజి సర్కిల్, నిర్మలస్కూల్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్, లయోలా కాలేజీ రోడ్డు, లతా సూపర్ స్పెషాలిటీ రోడ్డు, కండ్రిక ప్రాంతాలను మంగళవారం కమిషనర్ పర్యవేక్షించారు. వర్షం వలన రోడ్లపైన నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఏమినిటీ సెక్రటరీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ సిబ్బంది వర్షపు నీరు ఉన్న రోడ్ల దగ్గర వెంటనే చర్యలు తీసుకోడానికి అవసరమైన వాహనాలను ఉపయోగించి నీటిని తక్షణమే తొలగించాలని సూచించారు. ఈ సందర్భంలో కండ్రిక నుంచి 33 తూములు వరకు జరిగిన డీసిల్టింగ్ పనులను, డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ పరిశీలించారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో ప్రవాహానికి ఎటువంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈఈలు సామ్రాజ్యం, శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ రోగులకు మానసిక మద్దతు కావాలి

నరాల వైద్యనిపుణులు పి. హరిణి



ప్రసంగిస్తున్న డాక్టర్ పి. హరిణి, వేదికపై డాక్టర్ సమరం

బెంజిసర్కిల్, మే 20 (ఆంధ్రజ్యోతి): మూర్ఛ రోగులకు మందులతోపాటు తల్లిదండ్రులు, సమాజం నుంచి మానసిక మద్దతు అవసరమని ప్రముఖ నరాల వైద్య నిపుణులు పి. హరిణి అన్నారు. బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో మంగళవారం మూర్ఛ వ్యాధిపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈకార్యక్రమానికి డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్‌హరిణి మాట్లాడుతూ వైద్యశాస్త్ర ప్రగతితో మూర్ఛవ్యాధిని శాశ్వతంగా అదుపుచేయవచ్చని చెబుతూ దీనిపై సమాజంలో అనేక అపోహలు, భయాలు ఉండ టం వల్ల బాధితులు సరిగా కోలుకోలే పోతున్నారని చెప్పారు. మెదడులో అకస్మాత్తుగా జరిగే విద్యుత్ సంకేతాల అసాధారణ స్థితివల్ల మూర్ఛ వ్యాధి వస్తుందన్నారు. మూర్ఛ వ్యాధికి జన్యు సంబంధిత కారణాలు, తలకి గాయాలు, మెదడులో ట్యూమర్, ఇన్‌ఫెక్షన్‌లు కారణాలు కూడా ఉండవచ్చని పేర్కొన్నారు. పలువురు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ హరిణి సమాధానం ఇచ్చారు.

అయ్యప్పనగర్‌లో ఆక్రమణలు



రిపేర్‌కు వచ్చిన బండ్లను రహదారి పై నిలిపిన షెడ్ యజమాని

పటమట, ఆంధ్రజ్యోతి: ఆటోనగర్ బస్టాండ్ నుంచి కుడి వైపునకు తిరిగి అయ్యప్పనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి రెండు వైపులా ఆక్రమణలకు గురైంది. అయ్యప్పనగర్ వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం ముందు భాగంలో రోడ్డు మార్జిన్ దాటి అయ్యప్పనగర్ ఆర్చి వరకు టిఫిన్ బండ్లు, పండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు పూర్తిగా ఆక్రమించేశారు. కొనుగోలుకు వచ్చే వారు వారి వాహనాలను రోడ్డు మీద పెట్టడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. కుడి పక్కన రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం పక్కనే ఉన్న మోటార్ బైక్ షెడ్ వల్ల ట్రాఫిక్ స్తంభిస్తోంది. రిపేర్‌కు వచ్చే వాహనాలను రహదారి మీద ఉంచడంతో ట్రాఫిక్‌కు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలి, వెంటనే ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత దత్తక్రియ యోగా శిక్షణా తరగతులు

పటమట, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఉచిత దత్త క్రియ యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని దత్త క్రియ యోగా లోటస్ సమన్వయకర్త దంతులూరి తిరుపతిరాజు మంగళవారం ఒక తెలిపారు. శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఉదయం 6 గంటల నుంచి 7 వరకు, వెల్ఫేర్‌హాల్ అయోధ్య నగర్‌లో ఉదయం 5 గంటల నుంచి 6.30 వరకు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9866041332 నంబరును సంప్రదించాలన్నారు.

వ్యర్థాలు తొలగించరూ





12వ డివిజన్ అశోక్‌నగర్‌కు వెళ్లే దారిలో సిరీస్ కంపెనీ వెనుక భాగంలో చాలా కాలం నుంచి థర్మాకోల్ షీట్ల వ్యర్థాలను పెద్ద పెద్ద గుట్టలుగా పెట్టారు. ధనేకుల పున్నారావు వీధిలో నరికిన చెట్టు కొమ్మలను గుట్టలుగా వేసి వదిలేశారు. క్రిమి కీటకాలకు, దోమలకు అవి నిలయంగా మారకముందే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

- పటమట, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న బార్ ప్రెసిడెంట్ ఏకే బాషా

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి

విజయవాడ లీగల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : బెజవాడ బార్ అసోసియేషన్‌లో మంగళవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ కోశాధికారి ముద్దాడ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాస్, జయకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుజనా చౌదరికి కూటమి నేతల పరామర్శ

విద్యాధరపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరిని పలువురు కూటమి నాయకులు వేర్వేరుగా మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి శ్రీనివాస్, తదితరులు, బీజేపీ నాయకులు దుర్భేశుల హుస్సేన్, దుర్భుశుల మీరావలి, పోతిన బేసుకంతేశ్వరుడు, ఉన్నారు.



సుజనా చౌదరిని పరామర్శించిన గన్నే ప్రసాద్, శ్రీనివాస్

యూజీడీ సమస్యతో తప్పని తిప్పలు



17వ డివిజన్‌లో యూజీడీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: రాణిగారితోట ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య నిత్యకృత్యంగా మారింది. ఈ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క స్థానికుల ఫోన్లతో టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న 17, 18 రెండు డివిజన్లలో ఇదే సమస్యతో బాధపడుతున్నారు. ఒక డివిజన్ కార్పొరేటర్ స్పందిస్తుంటే మరో డివిజన్ కార్పొరేటర్ అసలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం శోచనీయం. ఈ సమస్యపై స్థానికులు నిలదీస్తుంటే చేసేది లేక ప్రతిరోజు డ్రెయినేజీలను శుభ్రం చేయించడం టీడీపీ నేతల వంతయింది. ప్రతిరోజు ఏ రోడ్డు చూసినా పొంగి పొర్లుతున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీతో స్థానికులు పడుతున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. దీంతో వారు కార్పొరేటర్లకు కాకుండా డివిజన్ టీడీపీ నాయకులకు ఫోన్లు చేసి అడుగుతుంటే నాయకులు కార్పొరేషన్ అధికారుల పై ఒత్తిడి తెచ్చి యూజీడీ శుభ్రం చేయిస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టిలో ఉంది

రాయి రంగమ్మ, 17వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు

రాణిగారితోట ప్రాతంలో ఉన్న అండర్ గ్రౌండ్ సమస్య ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టిలో ఉంది. ఆయన ఈ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ సమస్య పరిష్కారం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవాలో సంబంధిత అధికారులతో సంప్రదించడమే కాకుండా అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు నిధులు కూడా మంజూరైనట్లు తెలిసింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఈ సమస్య ఈ ప్రాంతంలో ఇంత తీవ్రంగా ఉంది. అయినా ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం ఎమ్మెల్యే చూపిస్తారు, అప్పటి వరకు ఎవరు ఫోన్ చేసినా కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తున్నాం.

నిర్వహణ కారణాలతో పలు రైళ్ల రద్దు

రైల్వే స్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాల దృష్ట్యా ఈనెల 21 నుంచి 25 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ రైలును ఈనెల 21న, 02863 సత్రాగచ్చి - యశ్వంతాపూర్ రైలును ఈనెల 22న రద్దు చేశారు. 22817 హౌరా - మైసూర్, 22850 సికింద్రాబాద్ - షాలిమార్ రైళ్లను ఈనెల 23న, 02864 యశ్వంతాపూర్ - సత్రాగచ్చి రైలును ఈనెల 24న, 22818 మైసూర్ - హౌరా రైలును ఈనెల 25న రద్దు చేశారు.

11న ఇండియన్ రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ వార్షిక సర్వసభ్య సమావేశం జూన్ 11న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు, కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ నియామకాలు 2017ను అనుసరించి జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను అనగా చైర్మన్, వైస్‌చైర్మన్, కోశాధికారి, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకుంటారన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు (పోషకులు/వైస్ పోషకులు/లైఫ్ సభ్యులు/లైఫ్ అసోసియేట్లు) తప్పనిసరిగా హాజరుకావాలని కోరుతున్నట్టు లక్ష్మీశ తెలిపారు.

బుడమేరు, వాగుల గండ్లు పూడ్చివేతకు నిధులు

● మరమ్మతులకు రూ.48.15కోట్లు మంజూరు

● కేబినెట్ ఆమోదం

తెలిపిందన్న ఎమ్మెల్యే వసంత

మైలవరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): బుడమేరు, వాగుల గండ్లు, పూడ్చివేత, మరమ్మతుల పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.48.15కోట్ల మంజూరుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన మినీ మహానాడులో ఆయన ఈ వివరాలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందినట్టు చెప్పారు. అతి త్వరలోనే పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మినీ మహానాడు రోజున ఈ రెండు శుభవార్తలు వినటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 22న ఎన్టీఆర్ జిల్లా స్థాయి మహానాడు గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తారన్నారు.

రెండు రోజుల కస్టడీకి ఓలుపల్లి రంగా

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన భూకబ్జా కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగరావు అలియాస్ రంగాను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. తేలప్రోలుకు చెందిన శనగల శ్రీధర్‌రెడ్డికి చెందిన భూమిని రంగా బెదిరించి బలవంతంగా మరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయించాడని పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారించేందుకు రంగాను వారంపాటు కస్టడీకి ఇవ్వాలని ఆత్కూరు పోలీసులు గన్నవరంలోని 8వ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు కొద్దిరోజుల క్రితం ముగిశాయి. ప్రస్తుతం గన్నవరం కోర్టుకు వేసవి సెలవులు కావడంతో ఇన్‌చార్జి కోర్టుగా ఉన్న విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుధ, గురువారాలు రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిచ్చింది.

ఇంటర్నేషనల్ ఫ్లైట్స్‌తోనే ఎయిర్ కార్గోకు మార్గం!



● డిమాండ్ తేలకుండా కార్గో ఫ్లైట్స్ రావాలంటే కష్టం ● పాసింజర్ విమానాలు నడిపి పరిశీలించాలి ● తర్వాతే డిమాండ్‌పై అవగాహన

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వ్యాపార వర్గాలు విదేశాలకు ఎగుమతులను మరింతగా విస్తరించేందుకు కార్గో విమాన సదుపాయం కల్పించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. అయితే డైరెక్ట్‌గా ఇంటర్నేషనల్ కార్గో విమానాలు నడిపేందుకు ప్రస్తుతం తగిన వనరులు లేవు. కార్గో విమాన సర్వీసులు నడవాలంటే ప్రత్యేక కార్గో విమానాలుండాలి. లేదంటే విదేశాలకు నేరుగా కనెక్టవిటీ కలిగిన అంతర్జాతీయ ప్రయాణికుల విమానాలైనా ఉండాలి. విజయవాడ కేంద్రంగా తయారీ రంగాలు ఎక్కువ. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఎక్కువ. పండ్లు, కూరగాయలు, ఆక్వా ఉత్పత్తులు వంటివి పెద్ద ఎత్తున ఎగుమతికి అవకాశం ఉంది.



డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకే ప్రాధాన్యం

ప్రపంచంతో బలమైన కనెక్టివిటీ కలిగిన సింగపూర్, దుబాయ్, అబుదాబి, ఖతార్ వంటి డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు విజయవాడ నుంచి నేరుగా విమాన సర్వీసులు ఉంటేనే, కార్గో ఎగుమతులకు మార్గం సుగమవుతుంది. ప్రస్తుతం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి షార్జాకు 2 విమానాలు నడుస్తున్నా, షార్జా డెస్టినేషన్ ఎయిర్‌పోర్టు కాకపోవడంతో ప్రయోజనం తక్కువ.

సింగపూర్ సర్వీసు విజయవంతం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీజీఎఫ్ (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్) పద్ధతిలో ఇండిగో ద్వారా ప్రారంభించిన విజయవాడ-సింగపూర్ సర్వీసు భారీ స్పందన పొందింది. ఇది 95 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. కొంతకాలానికే వీజీఎఫ్‌ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో ఆ సర్వీసు నిలిపేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పండ్లు, కూరగాయలు, ఆక్వా ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలు విస్తృతంగా ఉన్నాయి. ఇవన్నీ విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఏకైక మార్గం విజయవాడ నుంచి డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు నేరుగా విమానాలు నడవడమే.

హాప్ పద్ధతిలో అవకాశాలు

హాప్ పద్ధతి అంటే విజయవాడ నుంచి బయలుదేరే విమానాలు దేశంలోని మరో ఎయిర్‌పోర్టులో కూడా ఆగి అక్కడి నుంచి కూడా ప్రయాణికులను తీసుకువెళ్లేలా విమానాలు నడపవచ్చు. నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించడం సాధ్యపడకపోతే ఇలా చేయొచ్చు. అంటే విజయవాడ నుంచి విశాఖపట్నం లేదా హైదరాబాద్ మీదుగా హాప్ పద్ధతిలో దుబాయ్, ఖతార్, అబుదాబి వంటి ఎయిర్‌పోర్టులకు విమాన సర్వీసులు నడిపితే, ఆక్యుపెన్సీ పెరగడమే కాకుండా కార్గో లోడింగ్‌కు స్థలాన్ని కూడా కల్పించవచ్చు. ఒక అంతర్జాతీయ విమానంలో సగటున 50-60 మెట్రిక్ టన్నుల సరకులు లోడ్ చేయవచ్చు. ఇలా ఎన్ని విమానాలు నడుస్తాయో అంత సామర్థ్యం కార్గో ఎగుమతికి ఏర్పడుతుంది. దీనివల్ల నూరు శాతం ఆక్యుపెన్సీ లభించే అవకాశం ఉంది.

ఏపీ చాంబర్స్ నిరంతర కృషి

అంతర్జాతీయ సర్వీసుల కోసం ఏపీ చాంబర్స్ నిరంతర కృషి చేస్తోంది. గతంలో ముంబయికి విమాన సర్వీసుల ఏర్పాటుకు లేఖల ద్వారా విమానయాన సంస్థలను ఒప్పించి విజయవంతమైంది. ఇప్పుడు అంతర్జాతీయ సంస్థలను ఆశ్రయిస్తూ, విజయవాడ ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని వివరించేలా లేఖలు రాస్తోంది. ఇటీవల ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు విజయవాడకు వచ్చి పరిశీలనలు జరిపిన అనంతరం పరిశీలిస్తామంటూ తెలిపింది.



ధర్నాలో పాల్గొన్న వివిధ కార్మిక, రైతు సంఘాల నేతలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● జూలై 9న సమ్మెను జయప్రదం చేయండి: వక్తలు

ధర్నాచౌక్, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులకు శాపంగా మారాయనీ తక్షణమే వీటిని రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతంలో లాక్‌డౌన్ సమయంలో దొడ్డి దారిన కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లకు రూపకల్పన చేసి ప్రవేశపెట్టిందని ధ్వజమెత్తారు. యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు ఈ కోడ్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 9న సమ్మెకు సన్నద్ధం కావాలని, ఇప్పటి నుంచే సమ్మె నోటీసులు అందజేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే దుర్గారావు, ఏఐటీయూసీ నగరాధ్యక్షుడు మూలీ సాంబశివరావు అధ్యక్షతన ఏపీ రైతు సంఘాల సమన్వయకర్త వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు వీఎల్ నరసింహులు, ఏ వెంకటేశ్వరరావు, ఏ కమల, వెంకటసుబ్బయ్య, కేఆర్ ఆంజనేయులు, ఏఐటీయూసీ, ఏఐసీసీటీయూ, ఇఫ్టూ, టీయూసీఐ నేతలు సుధీర్, ఉదయ్‌కుమార్, ఎం.రామకృష్ణ, శంకర్, మరీదు ప్రసాద్, రైతు సంఘాల నేతలు రావుల వెంకయ్య, వై.కేశవరావు, డీ హరినాథ్, ఈశ్వరయ్య, జమలయ్య, ఆశా, అంగన్‌వాడీ యూనియన్ నేతలు శ్రీలక్ష్మీ, టి.గజలక్ష్మీ పాల్గొన్నారు.

ఐసెట్‌లో మెరిసిన ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు

● మూడో ర్యాంక్ సాధించిన సాకల కృష్ణసాయి

● విజయవాడ నుంచి 1,980 మందికి అర్హత

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంసీఏ, ఎంబీఏ కోర్సులకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన సాకల కృష్ణసాయి రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించాడు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2528 మంది విదార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో పురుషులు 1,147 మంది, మహిళలు 1,381 మంది ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో పురుషులు 1,012 మంది, మహిళలు 1255 మంది (మొత్తం 2,267 మంది) పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 2,191 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. 975 మంది పురుషులు కాగా, మహిళలు 1,216 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాలో మైలవరం నుంచి 153 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 144 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 139 మాత్రమే అర్హత సాధించారు. తిరువూరు నుంచి 85 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 76 మంది పరీక్షకు హాజరైతే 72 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. విజయవాడ నుంచి మొత్తం 2,290 మంది దరఖాస్తు చేసుకుంటే 2,051 మంది పరీక్షకు హాజరయ్యారు. హాజరైన వారిలో 1,980 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు.

కృష్ణా జిల్లా నుంచి మొత్తం 713 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 338 మంది పురుషులు, 375 మంది మహిళలున్నారు. 311 మంది పురుషులు, 357 మంది మహిళలు మొత్తంగా 668 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 638 మంది ఐసెట్‌కు అర్హత సాధించారు. 299 మంది పురుషులు, 339 మంది మహిళలున్నారు.

ఆటోనగర్‌లో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్

● పాత కన్సల్‌టెంట్ సంస్థకే డీపీఆర్ బాధ్యతలు

● ఎకరం 87 సెంట్లలో ఏర్పాటు

● బస్‌స్టేషన్‌తో పాటు వ్యాపార కేంద్రంగా మార్చేలా నిర్మాణం

● నెల రోజుల్లో నివేదిక ఇవ్వనున్న సంస్థ

పీపీపీ విధానంలో బహుళప్రయోజనకరంగా ఏర్పాటు



ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నమూనా

బస్టేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్టీసీకి చెందిన ఖాళీస్థలాలను కమర్షియల్‌గా వినియోగించుకోవటానికి చర్యలు చేపట్టారు. అందుకు తగిన ప్రతిపాదనలు ఇవ్వాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆటోనగర్ డిపోను ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్‌గా నిర్మించటానికి జీప్లస్2 భవన నిర్మాణం చేపట్టటానికి ప్రయత్నం జరుగుతోంది. గతంలోనూ ప్రయత్నించినప్పటికీ అమల్లోకి రాలేదు. గతంలో రూపొందించిన డీపీఆర్‌ను అదే సంస్థ ఇచ్చి సవరణలు చేయించనున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ నిర్మాణం జరగనుంది. ఆటోనగర్‌లో ఉన్న బస్టేషన్‌ను నేలమట్టం చేసి అక్కడే ఈ బహుళ ప్రయోజన బస్ టెర్మినల్ నిర్మాణానికి ఆర్టీసీ నిర్ణయించింది. దాదాపు 2 ఎకరాల్లో నిర్మించనున్న ఈ బస్ టెర్మినల్‌కు ప్రైవేటు సంస్థలు పెట్టుబడి పెట్టి వాణిజ్య దుకాణాలు, సినిమా థియేటర్లు, మాల్స్, విశ్రాంతి గదులు, డార్మిటరీలు నిర్మించనున్నారు. వచ్చిన ఆదాయంలో ఆర్టీసీకి వాటా చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోనున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇక్కడి నుంచి బందరు రోడ్డు వైపు మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ వైపు బస్సులు నడుస్తున్నాయి. ఇప్పుడీ భవనాన్ని నేలమట్టం చేస్తే ఇక్కడి నుంచి వెళ్లే బస్సులను సమీప బస్టాండ్‌కు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. వాస్తవంగా బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో నిర్మించాలనుకున్నప్పటికీ ఆదాయార్జిత మార్గాల అన్వేషణలో భాగంగా పీపీపీ విధానంలోనే నిర్మించాలన్న యోచిస్తున్నట్టు తెలిసింది.

జాబ్‌మేళాకు భారీగా రాజధాని యువత

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో మంగళవారం తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జాబ్‌మేళా జరిగింది. ఈ మేళాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిటైల్, ఆటోమొబైల్, హెల్త్‌కేర్, ఐటీ సేవలు, ఫైనాన్స్ రంగాలకు చెందిన 11 ప్రముఖ కంపెనీలైన ఎన్‌సీసీ, సీఐఐ-ఎంసీసీ, కాన్‌స్టన్ సర్వీసెస్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఎస్‌బీఐ కార్డ్స్, వెకెన్ ఇండియా, హ్యాపీ మొబైల్స్, వరుణ్ మోటార్స్, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పటల్స్, స్కిల్‌క్రాఫ్ట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్‌మేళాకు 589 మంది అభ్యర్థులు హాజరుకాగా, పలువురు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. దీంతో మొత్తంగా 900 మందికి హాజరైన సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాలో 100 మంది ఆఫర్ లెటర్లు అందుకోగా, 170 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారు. ఏపీసీసీడీసీ నైపుణ్య శిక్షణ అధికారి సాయి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు. ఎస్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.నర్సింహారావు, సీఆర్‌డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు, సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్ పాల్గొని జాబ్‌మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

మైనారిటీ కార్పొరేషన్ 50 శాతం సబ్సిడీ

● ఆన్‌లైన్ ప్రక్రియకు రంగం సిద్ధం

రామలింగేశ్వర నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, యువతకు జీవనోపాధి, నిరుద్యోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ వర్గాలకు చెందిన యువతకు 50 శాతం సబ్సిడీతో అతి తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు రాష్ట్రప్రభుత్వం రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల మించకూడదని, దరఖాస్తుదారుల వయస్సు 21 నుంచి 55ఏళ్ల మధ్య ఉండాలని ఈ ప్రకటన ద్వారా తెలిపారు. మైనారిటీ వర్గాలైన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన మతాల వారికి మాత్రమే అర్హులుగా ప్రకటించారు. దీంతో పాటు కొన్ని ప్రత్యేక స్కీమ్స్‌కు డీఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్హతతో పాటుడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గోతుల రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం

● 20 వేల కిలోమీటర్ల రోడ్లు బాగుచేశాం: ఆనందసూర్య

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గోతుల మయమైన రాష్ట్రంలోని రహదారులను అభివృద్ధి చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో రోడ్లు సరిగా లేక 1.15 లక్షల ప్రమాదాలు సంభవించాయన్నారు. 43వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రహదారులకు రూ.500 కోట్లు కేటాయించి, రూ.10 కోట్లే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. 20,058 కిలోమీటర్ల గోతుల రహదారులను బాగు చేసేందుకు రూ.861 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.55వేల కోట్లతో 2,376 కిలోమీటర్ల జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయన్నారు.

త్వరలో అమరావతిలో లేబర్ ఇన్‌స్టిట్యూట్

● 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా ప్రణాళికలు

● జేవియర్ లేబర్ రిలేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి కాసిమిర్

విజయవాడ, మే 20 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అతి త్వరలో క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎక్స్‌ఎల్ఆర్ఐ సంస్థ ప్రతినిధి కేఎస్ కాసిమిర్ సీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఎక్స్‌ఎల్ఆర్ఐ (జేవియర్ లేబర్ రిలేషన్ ఇన్‌స్టిట్యూట్) విద్యాసంస్థల ప్రతినిధి కేఎస్ కాసిమిర్ సమావేశమయ్యారు. గతంలో ఈసంస్థకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిన విషయం తెలిసిందే. మంగళవారం అమరావతిలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ క్యాంపస్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అమరావతి క్యాంపస్ వర్సిటీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి గరిష్ఠంగా 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. క్యాంపస్‌ను వర్సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

యోగా మాసోత్సవానికి పటిష్ట బందోబస్తు

వన్‌టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో పున్నమిఘాట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి సీఎం చంద్రబాబు పాల్గొంటున్నారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఇతర శాఖల అధికారులతో కలిసి భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పున్నమీఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలిచ్చారు. భద్రతాపరంగా చిన్న లోపం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అప్రమత్తంగా బందోబస్తు ఏర్పాట్లతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఇతర మార్గాలను నిర్దేశించే విధంగా, వాహనాల రద్దీ ఏర్పడకుండా ఏర్పాట్ల గురించి సూచనలు చేశారు. పున్నమిఘాట్ పరిసర ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు రాజశేఖర్ బాబు తెలిపారు. డీసీపీలు కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, సబ్ కలెక్టర్ శ్రీచైతన్య, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్, పశ్చిమ ఏసీపీ దుర్గారావు పాల్గొన్నారు.

ఒలింపిక్ పతకం సాధనే లక్ష్యం కావాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): విలువిద్యలో క్రీడాకారులకు మరింత నైపుణ్యాలను అందించి, వచ్చే ఒలింపిక్ క్రీడల్లో వోల్గా ఆర్చరీ అకాడమీ శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాన్ని సాధించడమే లక్ష్యంగా శిక్షణ అందించి, నగరానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, పీ4 విధానం స్ఫూర్తితో క్రీడా పరికరాలను అందించేందుకు ముందుకొచ్చిన అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులను అభినందిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వోల్గా ఆర్చరీ అకాడమీకి రూ.1.16 లక్షల విలువైన ఆర్చరీ ఉపకరణాలను అమరావతి బోటింగ్ క్లబ్ ప్రతినిధులు కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ-4 విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని వోల్గా ఆర్చరీ అకాడమీకి అమరావతి బోటింగ్ క్లబ్ మార్గదర్శిగా సహాయం అందించినట్టు తెలిపారు. ఆర్చరీ అకాడమీకి ఎలాంటి లాభాపేక్ష లేకుండా శిక్షణ అందిస్తూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తోందని కలెక్టర్ వివరించారు. అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, వోల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ, ఆర్చరీ నేషనల్ కమిటీ సభ్యులు టీవీ రమణ, జిల్లా ట్రెజరర్ జి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్చరీ ఉపకరణాలను కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందిస్తున్న అమరావతి బోటింగ్ క్లబ్ సభ్యులు

సైనిక సంక్షేమ నిధికి సహాయం సామాజిక బాధ్యత

దేశం కోసం అహర్నిశలు సేవలందిస్తూ విధి నిర్వహణలో ఆటుపోట్లను ఎదుర్కొంటున్న సైనికుల సంక్షేమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని భావించి విరాళం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సైనిక సంక్షేమ నిధికి విరాళంగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు అందించిన రూ.లక్ష చెక్కును మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ ఆయన చాంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కమాండర్ కె.కళ్యాణవీణకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ప్రతినిధులు సామాజిక బాధ్యతగా రూ.లక్ష విరాళాన్ని సైనిక సంక్షేమ నిధికి విరాళంగా అందించడం వారి దాతృత్వానికి నిదర్శనమన్నారు. సైనిక సంక్షేమ నిధికి సహాయం అందించేందుకు మరింత మంది ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కళ్యాణవీణ, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ జనరల్ మేనేజర్ కేవీ మారుతీరావు, జిల్లా క్లస్టర్ హెడ్ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ-పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘిస్తే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని, సమన్వయ శాఖల అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ-సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ సత్యానందం హాజరైన సమావేశంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలని, ఫిర్యాదులు వస్తే త్వరగా విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మీ, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ, ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని నిర్వహించనుందని, నెలరోజుల పాటు జరిగే ఈ ప్రచారాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. యోగాంధ్రపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది కూడా యోగా సాధన చేయాలని, పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర నిర్వహించనున్నట్టు వివరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య ఆరోగ్యం, ఇలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యోగాంధ్ర విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్సులో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల జిల్లా స్థాయి, మండలాధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య

9

కుటుంబ కదంబం

బుధవారం • 21 మే 2025





జైపూర్‌లోని ఒక హోటల్‌లోని స్పాలో రిసెప్షనిస్ట్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించి.. అంచలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా 75 'మేఘావి' వెల్‌నెస్ సెంటర్లను నెలకొల్పిన వాణిజ్యవేత్త **మేఘన**. వాటిద్వారా సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. చిన్నప్పుడు లైంగిక వేధింపుల బాధితురాలైన మేఘన తాజాగా తన జీవిత కథ ఆధారంగా 'ది రైజ్ ఆఫ్ శక్తి' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ నేపథ్యంలో తన జీవిత, వృత్తి ప్రస్థానాలలో ఎదురైన సవాళ్లను, వాటిని ఎదుర్కొన్న తీరును 'నవ్య'తో పంచుకున్నారు.

కొత్త సవాళ్లంటే ఇష్టం..

"మాది రాజస్థాన్‌లోని జైపూర్. మధ్యతరగతి ఉమ్మడి కుటుంబం. బాబాయ్‌లు, పిన్నిలు, అక్కలు, అన్నలతో ఇల్లంతా ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది. మా ఇల్లు చిన్నగానే ఉండేది... కానీ ఇంటి వెనక పెద్ద గార్డెన్ ఉండేది. దాంతో పిల్లలందరం ఎప్పుడు చూసిన చెట్ల మీద ఆడుకుంటూ ఉండేవాళ్లం. చిన్నప్పటి నుంచి నాకు చదువు అంటే చాలా ఇష్టం. అమ్మ, నాన్న కూడా ఆ ఇష్టాన్ని గుర్తించారు. జైపూర్‌లో ఒక ప్రముఖ స్కూల్లో జాయిన్ చేశారు. మా ఇంట్లో అలాంటి ఇంగ్లీషు మీడియం స్కూలుకు వెళ్లిన తొలి అమ్మాయిని నేనే! నా దురదృష్టమేమిటంటే- నాకు ఏడేళ్లు వచ్చేసరికి అమ్మ, నాన్న విడిపోయారు. నాన్నతో పాటు నేను ఉమ్మడి కుటుంబంలో ఉండిపోయాను. 1970, 80 దశకాలలో రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో మహిళలకు అంత స్వేచ్ఛ ఉండేది కాదు. ఇంటి పనంతా అమ్మాయిలే చేయాల్సి వచ్చేది. మా ఇంట్లోని అమ్మాయిల్లో నేనే పెద్ద కాబట్టి వంటపని బాధ్యత నామీద పడింది. 13 ఏళ్ల వయస్సు వచ్చేనాటికి- ఇంట్లో ఉన్నవారందరికీ నేను వండాల్సి వచ్చేది.

అదంతా ఒక పీడకల...

ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. మా ఇంటి పక్కనే ఇద్దరు అమ్మాయిలు ఉండేవారు. నేను వాళ్లింటికి ఆడుకోవటానికి వెళ్లేదాన్ని. నా స్నేహితురాళ్ల నాన్న నన్ను తాకరాని చోట్ల తాకుతూ ఉండేవాడు. అసభ్యకరమైన చేష్టలు చేస్తూ ఉండేవాడు. ఎవరితో చెప్పాలో కూడా తెలియని అమాయకత్వం నాది. ఈ లైంగిక వేధింపులు సుమారు ఏడేళ్ల పాటు సాగాయి. ఇప్పుడు ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే- అదంతా ఒక పీడకలలా అనిపిస్తుంది. బాల్యంలో జరిగిన అవాంఛనీయమైన సంఘటనలు మనస్సులో ముద్రపడిపోతాయి. అప్పుడే కాదు... ఇప్పుడు కూడా మన సమాజంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. అందుకే తల్లితండ్రులు... ముఖ్యంగా తల్లులు తమ అమ్మాయిల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వారికి 'గుడ్ టచ్..బ్యాడ్ టచ్'ల గురించి చెప్పాలి. అనుకోని సంఘటనలు ఎదురయితే- ఎలా ఎదుర్కోవాలో శిక్షణ ఇప్పించాలి. సాధారణంగా ఇలాంటి విషయాల గురించి ఎక్కువగా ఎవరు మాట్లాడరు. కానీ ఎవరో ఒకరు ముందుకు వచ్చి మాట్లాడితే తప్ప - ఈ తరహా సమస్యలకు పరిష్కారం గురించి సమాజం ఆలోచించదు. అందుకే ఆ అనుభవాలను నా ఆత్మకథలో రాశాను. కొన్ని పాడ్‌కాస్ట్‌లలో కూడా మాట్లాడాను.

స్ఫూర్తి వీరే...

తమకు ఎదురయిన అవాంతరాలను ఎదుర్కొని నిలబడే మహిళలంటే నాకు చిన్నప్పటి నుంచి చాలా గౌరవం. వాళ్లనే స్ఫూర్తిగా భావించేదాన్ని. జైపూర్ రాణి సాహిబా గాయత్రీ దేవి నెలకొల్పిన మహిళా పాఠశాలలోనే నేను చదువుకొన్నా. మనకు స్వాతంత్ర్యం రాకముందే మహిళలకు సాధికారత అవసరమని భావించి నెలకొల్పిన పాఠశాల అది. ఆమె ఫోటో చూసినప్పుడల్లా నాలో కొత్త శక్తి వచ్చేది. అలాంటి మరో వ్యక్తి ఇందిరా గాంధీ. నాన్నకు ఇందిరాగాంధీ అంటే ఇష్టం. ప్రధానిగా ఆమె చేసిన పనులన్నీ కథలు కథలు చెబుతూ ఉండేవాడు. పురుషులతో నిండిపోయిన రాజకీయాల్లో ఆమె తనదైన ముద్ర వేయగలగటం చాలా ఆశ్చర్యంగా అనిపించేది. వీరిద్దరితో పాటుగా మా చుట్టూ పక్కలే నివసించే అనేక మంది మహిళలు చాలా గొప్పగా అనిపించేవారు. వీరు పెద్ద పెద్ద పనులు చేయకపోవచ్చు. కానీ తమకు ఎదురయిన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేవారు. నాకు కూడా వాళ్ల మాదిరిగానే జీవించాలని ఉండేది. కానీ కొన్ని పరిస్థితుల వల్ల 18 ఏళ్ల వయస్సులో ఇల్లు వదిలి బయటకు వచ్చేశాను. ఒక స్కూల్లో టీచర్‌గా చేరాను. ఆ రోజుల్లో ఇల్లు గడవాలంటే నెలకు రూ.4 వేలు ఖర్చు అయ్యేది. వేసవి సెలవుల్లో మాకు జీతాలు ఉండేవి కావు. ఏదో ఒక పని చేయకపోతే రోజు గడవదు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక రోజు ఓ స్నేహితురాలు ఒబెరాయ్ హోటల్‌లో రిసెప్షనిస్ట్ ఉద్యోగం ఉందని చెప్పింది. వాస్తవానికి నా చిన్నప్పటి నుంచి ఎప్పుడూ పెద్ద హోటల్‌కు వెళ్లి ఎరగను. బయట తినటం అసలు ఉండేది కాదు. హోటల్‌లో ఉద్యోగం అంటే మొదట్లో చాలా భయం వేసింది. ఇంటర్వ్యూకి వెళ్లకూడదనుకున్నా. కానీ జీతం రాకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి. పెద్ద హోటల్‌లో ఉద్యోగం వస్తే జీతం క్రమం తప్పకుండా ఇస్తారనుకున్నా. ఇంటర్వ్యూకి వెళ్లా. ఇంగ్లీషు మాట్లాడగలను కాబట్టి నన్ను ఎంపిక చేసుకున్నారు. వాళ్ల స్పాలోని ఫ్రంట్ ఆఫీస్‌లో ట్రైనీగా చేర్చుకున్నారు. నెలకు నాలుగు వేలు జీతం. ఆ ఉద్యోగమే నా జీవితాన్ని మలుపు తిప్పింది.

> హోటల్‌లో ఉద్యోగం అంటే మొదట్లో చాలా భయం వేసింది. ఇంటర్వ్యూకి వెళ్లకూడదనుకున్నా. కానీ జీతం రాకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి. పెద్ద హోటల్‌లో ఉద్యోగం వస్తే జీతం క్రమం తప్పకుండా ఇస్తారనుకున్నా. ఇంటర్వ్యూకి వెళ్లా. ఇంగ్లీషు మాట్లాడగలను కాబట్టి నన్ను ఎంపిక చేశారు. నెలకు నాలుగు వేలు జీతం. ఆ ఉద్యోగమే నా జీవితాన్ని మలుపు తిప్పింది.



అంచలంచెలుగా ఎదుగుతూ...

ఉద్యోగంలో చేరిన కొత్తల్లో నాకు కొన్ని లక్ష్యాలు ఉండేవి. సగంలో మానేసిన డిగ్రీ పూర్తి చేయటం మొదటిది. ఆ తర్వాత ఇంకో మంచి ఉద్యోగం చూసుకొని మారిపోవటం రెండోది. పెళ్లి చేసుకొని... భర్త, పిల్లలతో ఆనందంగా జీవించటం మూడోది. మొదటి మూడు నాలుగేళ్లు ఈ లక్ష్యాల కోసమే పని చేశాను. ఆ తర్వాత నాకు ఆ ఉద్యోగం నచ్చటం మొదలయింది. ఒక స్పాను ఎలా నడపాలి, దానిలో ఎలాంటి వస్తువులు ఉండాలి, కస్టమర్లకు ఎలాంటి సేవలు అందించాలి? అనే విషయాలు నాకు తెలియకుండానే నేర్చేసుకున్నాను. కొత్త కొత్త ఆవిష్కరణలు చేసేదాన్ని. ఆ తరువాత ఒబెరాయ్ నుంచి మరొక హోటల్‌కి మారా. ఇలా అతి తక్కువ కాలంలోనే ఒక పెద్ద గ్రూప్‌నకు డైరక్టర్ ఫర్ ఆపరేషన్స్‌గా ఎదిగా. ఆ స్థాయికి చేరుకున్న తర్వాత- హోటల్ పరిశ్రమలో నేను చేయగలిగింది ఏమి లేదనిపించింది. కొత్త సవాళ్లు కావాలనిపించింది. అలా ప్రారంభమయిందే 'మేఘావి వెల్‌నెస్ సెంటర్'.

ఆ అపోహ చాలామందిలో ఉంది...

ఒకే ఒక బ్రాంచ్‌తో ప్రారంభమయిన 'మేఘావి'కి ప్రస్తుతం 75 సెంటర్లు ఉన్నాయి. త్వరలోనే ముంబాయి ఎయిర్‌పోర్టులో మా బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నాం. వీటిలో దేని నిర్వహణనూ ఇతరులకు ఇవ్వలేదు. అన్నింటినీ మేమే దగ్గరుండి చూసుకుంటాం. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. వెల్‌నెస్ సెంటర్ అంటే కేవలం మసాజ్‌లు మాత్రమే చేస్తారనే అపోహ చాలామందిలో ఉంది. అలసిపోయిన దేహానికి, మనస్సుకు సాంత్వన చేకూర్చేదే వెల్‌నెస్ సెంటర్. అలా సాంత్వన చేకూర్చడానికి అంతర్జాతీయంగా అనేక రకాల అత్యాధునిక సాంకేతిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటి ద్వారా ఫలితాలు త్వరగా లభిస్తాయి. వీటిని మా సెంటర్ల ద్వారా మన దేశంలో కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నాం.. నా ఈ ప్రయాణంలో అనేకమంది సహకరించారు. వారి నుంచి అనేక కొత్త విషయాలు నేర్చుకున్నాను. నాకు ఎంతో అభిమానాన్ని పంచి ఇచ్చిన సమాజానికి తిరిగి ఇవ్వటానికి అనేక రకాలుగా నా వంతు కృషి చేస్తున్నా. ముఖ్యంగా చిన్నపిల్లలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిపి పనిచేస్తున్నా. అందరూ కలిసి కృషిచేస్తే ఈ సమస్యను తరిమివేయవచ్చని భావిస్తున్నా."

• సీవీఎల్ఎన్ ప్రసాద్

"సైబర్ నేరాల బాధితులు ఎదుర్కొనేది ఆర్థిక నష్టం మాత్రమే కాదు, అంతకుమించిన వేదన కూడా... అటువంటి వేలాది సైబర్ నేరాల బాధితులకు మానసికంగా అండగా నిలుస్తున్నారు ఒడిశాకు చెందిన **స్వాతి దాస్**. మరోవైపు సైబర్ నేరాల గురించి, సోషల్ మీడియాకు బానిసలు కావడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.



'సైబర్ వల'లో పడకుండా

ఐటీ రంగంలో పని చేసేవారిలో ఎక్కువమంది వారాంతాల్లో విశ్రాంతికి ప్రాధాన్యం ఇస్తారు. 32 ఏళ్ల స్వాతి దాస్ దీనికి మినహాయింపు. శని, ఆది వారాల్లో ఉదయాన్నే భువనేశ్వర్- కటక్ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకుంటారు. సైబర్ నేరాల బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తారు. అలాగే విద్యా సంస్థలకు వెళ్తారు. యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారు. గత రెండున్నర ఏళ్లుగా క్రమం తప్పకుండా ఆమె ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. "సాంకేతికత పెరుగుతున్నకొద్దీ నష్టపోయే ముప్పు కూడా పెరుగుతోంది. పెద్దగా చదువులేనివారే కాదు విద్యావంతులు కూడా బలైపోతున్నారు. వారికి ఊరట కలిగించి, ఆత్మస్థైర్యాన్ని పెంచాలనే ఆలోచనే నాకు ప్రేరణ" అని చెబుతున్నారు స్వాతి. ఒడిశాలోని కటక్‌కు చెందిన ఆమె ఒక ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. తన బంధువులు, స్నేహితులు, తోటి ఉద్యోగుల్లో కొందరు సైబర్ నేరాల బారిన పడి... డబ్బుతోపాటు మనశ్శాంతిని సైతం పోగొట్టుకోవడం ఆమెకు వేదన కలిగించింది. అదే సమయంలో స్వాతి పని చేస్తున్న ఐటీ సంస్థ తమ ఉద్యోగుల కోసం ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్‌లో ఆమె శిక్షణ పొందారు. తన పరిచయస్తులు కొందరికి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వాలంటీర్లతో ఆమెకు పరిచయం అయింది. వారి ప్రోత్సాహంతో... పోలీసులు నిర్వహిస్తున్న సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొనడం మొదలుపెట్టారు. ఈ సమస్య తీవ్రత అప్పుడే తనకు మరింత లోతుగా అర్థమయిందంటారు స్వాతి.

బాధ్యతగా భావించా...

"సైబర్ నేరాలు ప్రజలను మానసికంగా, భావోద్వేగపరంగా కల్లోలానికి గురిచేస్తాయి. దీనివల్ల వాళ్ళ బ్యాంకు ఖాతాలు ఖాళీ కావడం మాత్రమే కాదు... మనశ్శాంతి నాశనమవుతుంది. చేతకానితనం వల్లే మోసపోయామనే అపరాధ భావం, నలుగురికీ తెలిస్తే ఎలా? అనే ఆందోళన, నిస్సహాయత కారణంగా మనస్థిమితం కోల్పోయే ప్రమాదం ఉంది.. తోటివారి మీద నమ్మకం తగ్గిపోతుంది. కొందరు జీవితకాలం దాచుకున్నదంతా పోగొట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు కూడా చేస్తారు. ఇవన్నీ చివరికి పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పిటిఎస్‌డి)కి దారితీస్తాయి. తీవ్ర నిస్పృహలో ఉన్న ఇటువంటివారికి సామాజికమైన మద్దతు అవసరం. వారి సమస్యలను శ్రద్ధగా విని, కౌన్సెలింగ్ ద్వారా వారికి అండగా నిలవడం నా బాధ్యతగా భావించాను" అని చెబుతున్నారు స్వాతి. మన దేశంలో సగటున రోజుకు ఏడువేల సైబర్ నేరాలు నమోదవుతున్నట్టు "ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్" (ఐ4సి) నిరుడు మేలో విడుదల చేసిన నివేదిక చెబుతోంది. అంటే ప్రతి నిమిషానికి నలుగురైదుగురు మోసగాళ్ళ బారిన పడుతున్నారు. ఆ బాధితులకు సాయపడే కీలకమైన పాత్రను స్వాతి పోషిస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన, మానసిక ఆరోగ్యంపై పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కొన్ని వందల వర్క్‌షాపులను ఆమె నిర్వహించారు. వెయ్యి మందికి పైగా బాధితులు వారి సమస్యల నుంచి బయటపడడానికి వ్యక్తిగతంగా సాయపడ్డారు. ఆమె భువనేశ్వర్-కటక్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి పని చేస్తున్న ఏకైక మహిళా వాలంటీర్ కూడా. తన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నుంచి, వివిధ సంస్థల నుంచి పురస్కారాలు సైతం అందుకున్నారు.

అతి ఏదైనా అనర్థమే

"సైబర్ నేరాల బాధితుల్లో రకరకాల వ్యక్తులు ఉంటారు. భారీ ఆర్థిక నష్టం కారణంగా కుమిలిపోతున్నవారు వారి వివరాలను చెబుతున్నప్పుడు ఏడ్చేస్తూ ఉంటారు. మరికొందరు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇష్టపడరు. హనీట్రాపింగ్ లేదా డీప్ ఫేక్ బారిన పడి డబ్బు పోగొట్టుకున్నవారు కూడా ఎంతో మంది. వారితో సహానుభూతితో మాట్లాడతాను. ఇలాంటిది జరిగింది వారొక్కరికే కాదని చెబుతాను. మానసికంగా దృఢంగా ఉంటేనే మిగిలిన జీవితాన్ని సజావుగా సాగించగలరనీ ఆత్మస్థైర్యాన్ని ఇస్తాను. ఇప్పటివరకూ యాభైకి పైగా



పాఠశాలల్లో పిల్లలకు సైబర్ నేరాల గురించి వివరించాను. దీనితోపాటు ప్రస్తుతం మన జీవితాల్లో సోషల్ మీడియా కారణంగా తలెత్తుతున్న దుష్పరిణామాల గురించి కూడా చెబుతున్నాను. చిన్న వయసులోనే పిల్లలు స్మార్ట్ ఫోన్లకు, దానిలో వచ్చే రకరకాల కంటెంట్‌కు బానిసలవుతున్నారు. అతి ఏదైనా అనర్థమే. సామాజిక సంబంధాలమీద సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉంది. ముఖ్యంగా పిల్లల్లో దాని వాడకాన్ని నియంత్రించాల్సిన బాధ్యత కుటుంబాలపైనా, ఉపాధ్యాయులపైనా ఉంది" అని చెబుతున్నారు స్వాతి. ప్రస్తుతం భువనేశ్వర్, కటక్ నగరాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాల్లోనూ ఆమె చేపట్టబోతున్నారు.

జామ ఆకు ప్రయోజనాలెన్నో...

జామ పండును పేదల యాపిల్ అని అంటారు. ఎందుకంటే అందులోని పోషకాలు యాపిల్‌కు తీసిపోవు. అయితే జామ పండు వలనే కాదు దాని ఆకుల వలన కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే జామ ఆకులను నేరుగా లేదా జామ ఆకుల టీ లేదా జామ ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిని తీసుకోవచ్చు.



- జామ ఆకులు మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.
- వీటిల్లోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు హానికరమైన సూక్ష్మజీవులతో పోరాడతాయి. శరీరంలో చక్కెర స్థాయులను, ఆకలిని నియంత్రించి శరీర బరువును తగ్గించడంలో సహాయ పడతాయి.
- మహిళల్లో నెలసరి వలన కలిగే నొప్పులను జామ ఆకులు తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకతను పెంచుతాయి.
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులను నియంత్రించడంలో జామ ఆకులు బాగా పనిచేస్తాయి. దీని వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.
- జామ ఆకుల క్యాన్సర్ కణాల పెరుగుదలను నివారిస్తుందని కొన్ని పరిశోధనల్లో తేలింది. క్యాన్సర్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను జామ ఆకుల్లోని యాంటీ ఆక్సిడెంట్లు నివారిస్తాయి.

బట్టల మన్నిక కోసం...

సాధారణంగా మనం వెతికి వెతికి మరీ నచ్చిన బట్టలు కొనుక్కుంటూ ఉంటాం. ఒక్కోసారి ఇవి త్వరగా రంగులు వెలిసి పోవడమో, చిరుగులు పట్టడమో జరుగుతూ ఉంటుంది. ఇలా కాకుండా బట్టలు ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం.

- బట్టలను ఎక్కువసార్లు ఉతకడం వల్ల వాటి నాణ్యత దెబ్బతింటుంది. కొద్దిసేపు ధరించినవాటిని వెంటనే ఉతకకుండా గాలి తగిలేలా హ్యాంగర్‌కు తగిలించాలి.
- ముదురు రంగు బట్టలను మొదటిసారిగా ఉతికేటప్పుడు నీళ్లలో కొద్దిగా గళ్ల ఉప్పు కలిపితే అవి రంగు విడవకుండా ఉంటాయి.
- రంగుల బట్టలను ఉతికిన తరవాత నేరుగా ఎండలో ఆరవేయకూడదు. ఎండ వల్ల రంగులు వెలిసిపోతాయి. కాబట్టి వాటిని నీడలో గాలి తగిలేలా ఆరవేయాలి.
- బట్టలను ఉతికేటప్పుడు ఎక్కువ డిటర్జెంట్ ఉపయోగించకూడదు. సబ్బుతో అదేపనిగా రుద్దకూడదు. ఏవైనా మరకలు పడితే ఆ ప్రాంతం వరకు సబ్బు లేదా షాంపూతో రుద్దితే సరిపోతుంది.
- తెల్లని బట్టలను ఉతికేముందు వాటిని కొద్దిసేపు సర్ఫ్ నీళ్లలో నానబెడితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- కొత్త బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేయకూడదు. ఒకవేళ ఇవి రంగులు విడుస్తున్నట్లయితే అవి విగిలిన బట్టలకు అంటుకునే అవకాశం ఉంటుంది.
- బాగా వేడెక్కిన ఇస్త్రీ పెట్టెతో బట్టలు ఇస్త్రీ చేయకూడదు. బట్టల మీద ముడుతలు పోయేలా ఇస్త్రీ పెట్టెను మధ్యస్థాయిలో వేడిచేస్తే సరిపోతుంది.
- అనుకోకుండా బట్టల మీద చిరుగులు ఏర్పడితే వెంటనే వాటిని దర్జీ వద్దకు తీసుకువెళ్లి కుట్టించాలి. లేదంటే ఇంట్లో కుట్టుమిషన్ మీదనైనా సరిచేసుకోవచ్చు.
- కాలానుగుణంగా ధరించే బట్టలను శుభ్రంగా ఉతికి సరైన విధానంలో మడతపెట్టి జాగ్రత్త చేసుకోవాలి.
- బట్టలను భద్రపరచే చోట కలరాఉండలు ఉంచితే పురుగులు చేరకుండా ఉంటాయి.



పసందైన ప్యాచ్ వర్క్

సాదాసీదా చీరలకు బదులుగా 'ప్యాచ్ వర్క్' చేసిన వినూత్నమైన చీరలు ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాంట్రాస్ట్ రంగులతో, అందమైన డిజైన్ల రూపంలో ప్యాచ్ వర్క్ చేసిన ఆ కాటన్ చీరలు ఇవే!

ఫ్యాషన్





- పువ్వులు, లతల డిజైన్లతో కూడిన కాటన్ చీరకు, అంచుల వెంబడి కాంట్రాస్ట్ కలర్ ప్యాచ్‌ను జతచేస్తే ఆ చీర లుక్ పూర్తిగా మారిపోతుంది. అదనపు ఆకర్షణ కూడా తోడవుతుంది.
- ప్యాచ్‌వర్క్‌ను పోలిన మ్యాచింగ్ బ్లౌజ్ ధరిస్తే, చీరకు అందం వస్తుంది. అయితే చీర కట్టుకు నప్పేలా బ్లౌజ్ నెక్ డిజైన్ జాగ్రత్తగా ఎంచుకోవాలి. ఓవల్, రౌండ్ షేప్ నెక్ డిజైన్లు బాగుంటాయి.
- ప్లెయిన్ కలర్ చీరకు, కాంట్రాస్ట్ కలర్ అంచు ఒక్కటే సరిపోదు. చీర రంగును పోలిన డిజైను అంచులో ఉండి తీరాలి. అప్పుడే ప్యాచ్‌వర్క్ నలుగురి కళ్లనూ ఆకర్షిస్తుంది
- ప్యాచ్ వర్క్ మరీ పెద్దవైతే ఎబ్బెట్టుగా ఉంటుంది. మరీ చిన్నవిగా ఉంటే స్పష్టంగా కనిపించవు. కాబట్టి ప్రత్యేకంగా కనిపించే డిజైన్లనే ఎంచుకోవాలి
- ప్లెయిన్ కాటన్ చీర మీద, కలంకారి, ఇక్కత్ వస్త్రపు ప్యాచ్ వర్క్ తాజా ఫ్యాషన్. కాబట్టి ఇలాంటి చీరలే ఎంచుకోవాలి.





- ఎరుపు, పసుపు... ఆకుపచ్చ, నీలం... నలుపు, ఎరుపు.. కాంట్రాస్ట్ డిజైన్లు బాగుంటాయి

స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 21 మే 2025

అహ్మదాబాద్‌లో ఫైనల్



క్వాలిఫయర్ 2 కూడా..
ముల్లన్‌పూర్‌లో ఎలిమినేటర్
ఐపీఎల్ ప్లేఆఫ్స్ షెడ్యూల్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ప్లేఆఫ్స్ వేదికలను మంగళవారం బీసీసీఐ ప్రకటించింది. దీంట్లో భాగంగా జూన్3న జరిగే ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. దీనికి ముందు జూన్ ఒకటిన జరిగే క్వాలిఫయర్2 కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. అలాగే క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు న్యూ చండీగఢ్‌కు సమీపంలోని ముల్లన్‌పూర్ నూతన స్టేడియంలో జరుగనున్నాయి. టాప్-2 జట్లు ఆడే క్వాలిఫయర్1లో విజేత నేరుగా ఫైనల్‌కు చేరే విషయం తెలిసిందే. అయితే ప్లేఆఫ్స్‌లో ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా గత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతాలో జరగాల్సింది. కానీ ప్రయాణ సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల వేదికలను మార్చాల్సి వచ్చింది. కాగా ఐపీఎల్ ఫైనల్‌కు అత్యధికంగా మూడోసారి ఆతిథ్యమివ్వనున్న అహ్మదాబాద్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

ఆర్‌సీబీ మ్యాచ్ లఖ్‌నవూలో..: బెంగళూరులో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్‌సీబీ తమ సొంత వేదికను మార్చింది. చిన్నస్వామి స్టేడియంలో ఈనెల 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే అదే రోజున లఖ్‌నవూ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి.

ప్లేఆఫ్స్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మే 29	క్వాలిఫయర్-1	ముల్లన్‌పూర్
మే 30	ఎలిమినేటర్	ముల్లన్‌పూర్
జూన్ 1	క్వాలిఫయర్-2	అహ్మదాబాద్
జూన్ 3	ఫైనల్	అహ్మదాబాద్

2 గంటల ఎక్స్‌ట్రా టైమ్

ఈ సీజన్ ఐపీఎల్‌లో జరగబోయే మిగిలిన అన్ని లీగ్ మ్యాచ్‌లకు మరో గంట అదనపు సమయం కేటాయించారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని బీసీసీఐ ప్రకటించింది. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే మ్యాచ్ నిర్వహణ కోసం మామూలుగానైతే లీగ్ మ్యాచ్‌లకు గంట, ప్లే ఆఫ్స్‌కు 2 గంటల ఎక్స్‌ట్రా టైమ్ ఉంటుంది. అయితే ఈ సీజన్‌లోని మిగిలిన 9 లీగ్ మ్యాచ్‌లకు కూడా రెండు గంటల సమయాన్ని కేటాయిస్తున్నట్టు బోర్డు తెలిపింది. ఇది మంగళవారం జరిగిన చెన్నై-రాజస్థాన్ మ్యాచ్‌నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో భారీ వర్షం కురిసినా మ్యాచ్‌లు ఆడించేందుకు మరో గంట వేచి చూసే వీలుంటుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	12	6	5	1	13	0.260
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్

ముంబై x ఢిల్లీ
వేదిక ముంబై
రా.7.30 నుంచి

ఢిల్లీకి చావోరేవో!

ముంబైతో కీలక పోరు నేడు

ముంబై: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేస్ రసవత్తరంగా మారింది. సన్‌రైజర్స్ చేతిలో ఓటమితో లీగ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కథ ముగిసింది. దీంతో ప్లేఆఫ్స్‌లో మిగిలిన నాలుగో బెర్త్ కోసం వాంఖడేలో బుధవారం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోరు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఓడితే ఢిల్లీ నాకౌట్ ఆశలు ఆవిరవుతాయి. ముంబై నెగ్గితే వారికి ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది. ప్రస్తుతం ముంబై 12 మ్యాచ్‌ల నుంచి 14 పాయింట్లతో ఉండగా.. ఢిల్లీ 12 మ్యాచ్‌ల నుంచి 13 పాయింట్లు సాధించింది. రెండు టీమ్‌లు తమ చివరి మ్యాచ్‌ల్లో పంజాబ్ కింగ్స్‌తో తలపడాల్సి ఉంది. ఢిల్లీ చివరి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గితే మొత్తం 17 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకొంటుంది. ఒకవేళ ముంబైపై గెలిచి.. 24న పంజాబ్ చేతిలో ఓడితే ఫలితం వారి చేతుల్లో ఉండదు. మరోవైపు ఫుల్‌జోష్‌లో ఉన్న ముంబై సొంతగడ్డపై జరిగే ఈ మ్యాచ్‌లో నెగ్గి నాలుగో బెర్త్ పట్టేయాలనుకొంటోంది.

ముంబై-ఢిల్లీ మ్యాచ్‌కు వరుణ గండం తప్పేట్టు లేదు. మంగళవారం సాయంత్రం వర్షం కారణంగా ఇరు జట్లు ప్రాక్టీస్‌ను ముందే ముగించాల్సివచ్చింది. అలాగే బుధవారం ముంబైలో భారీ వర్షం కురిసే అవకాశం పుష్కలంగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.

రాజస్థాన్‌కు ఓదార్పు విజయం

చెలరేగిన వైభవ్.. 6 వికెట్ల తేడాతో ఓడిన చెన్నై



వైభవ్ (57)

యుధ్‌వీర్, మధ్వల్

న్యూఢిల్లీ: అన్ని విభాగాల్లోనూ రాణించిన రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్ సీజన్‌ను విజయంతో ముగించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 57) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ రెండు జట్లు ఇదివరకే ప్లేఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. అటు సీఎస్‌కేకిది పదో ఓటమి కావడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే (43), బ్రెవిస్ (42) దూబే (39) రాణించారు. మధ్వల్, యుధ్‌వీర్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసి నెగ్గింది. శాంసన్ (41), జైస్వాల్ (36), జురెల్ (31 నాటౌట్) ఆకట్టుకున్నారు. అశ్విన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆకాశ్ మధ్వల్ నిలిచాడు.

టాపార్డర్ అదుర్స్: ఓ మాదిరి ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ ఆరంభంలో మెరుపులు మెరిపించగా.. ఆ తర్వాత మరో ఓపెనర్ వైభవ్ జోరు చూపాడు. కెప్టెన్ శాంసన్ తన సహజశైలిలో ఆడాడు. దీంతో ఆర్ఆర్ సునాయాసంగా ఛేదనను ముగించింది. జైస్వాల్‌ను పేసర్ అన్షుల్ బౌల్డ్ చేసినా పవర్‌ప్లేలో రాజస్థాన్ 56/1తో నిలిచింది. ఇక వైభవ్ బ్యాట్‌కు పనిచెప్పడంతో 27 బంతుల్లోనే అతని ఫిఫ్టీ పూర్తయింది. ఈ సమయంలో శాంసన్‌తో పాటు వైభవ్‌ను 14వ ఓవర్‌లో అశ్విన్ అవుట్ చేయగా, పరాగ్ (3)ను నూర్ వెనక్కి పంపాడు. దీంతో మ్యాచ్‌లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే జురెల్ భారీ షాట్లతో చెలరేగి 17 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

మాత్రే, బ్రెవిస్ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై తొలి ఎనిమిది ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయింది. అయితే ఓపెనర్ ఆయుష్ మాత్రేతో పాటు మిడిల్ ఆర్డర్‌లో బ్రెవిస్ విజృంభించాడు. కానీ డెత్ ఓవర్లలో తడబాటుతో స్కోరు 200 సమీపంలోనే నిలిచింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ కాన్వే (10), హిట్టర్ ఉర్విల్ (0)లను పేసర్ యుధ్‌వీర్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత మాత్రే రాజస్థాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మఫాక చక్కటి క్యాచ్‌తో అతడి దూకుడుకు పేసర్ తుషార్ తెరదించాడు. అప్పటికి మూడో వికెట్‌కు అశ్విన్ (13)తో కలిసి 56 పరుగులు జత చేయగా, పవర్‌ప్లేలో జట్టు 68/3 స్కోరుతో నిలిచింది. అనంతరం వరుస ఓవర్లలో అశ్విన్, జడేజా (1) వికెట్లను కోల్పోవడంతో సీఎస్‌కే తడబడినట్టు కనిపించింది. కానీ బ్రెవిస్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. పదో ఓవర్‌లో అతడి 4,6తో స్కోరు కూడా వంద దాటింది. యుధ్‌వీర్ ఓవర్‌లోనూ సిక్సర్‌తో చక్కటి జోరు మీదున్న అతడిని పేసర్ మధ్వల్ బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు దూబేతో కలిసి జత చేసిన 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ధోనీ (16) 14వ ఓవర్‌లోనే అడుగుపెట్టినా, క్రీజులో అప్పటికే దూబే ఉన్నప్పటికీ పరుగుల్లో వేగం కనిపించలేదు. చివరి మూడు ఓవర్లలో పేసర్లు తుషార్, మధ్వల్ అద్భుత బౌలింగ్ కారణంగా 17 పరుగులే వచ్చాయి. దీనికి తోడు ఆఖరి ఓవర్‌లో దూబే, ధోనీ వికెట్లను కూడా కోల్పోవడంతో స్కోరు 190లోపే ఆగింది.

స్కోరుబోర్డు

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) మఫాక (బి) దేశ్‌పాండే 43; కాన్వే (సి) పరాగ్ (బి) యుధ్‌వీర్ 10; ఉర్విల్ (సి) మఫాక (బి) యుధ్‌వీర్ 0; అశ్విన్ (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 13; జడేజా (సి)ధ్రువ్ జురెల్ (బి) యుధ్‌వీర్ 1; బ్రెవిస్ (బి) ఆకాశ్ మధ్వల్ 42; శివమ్ (సి) జైస్వాల్ (బి) మధ్వల్ 39; ధోనీ (సి) దేశ్‌పాండే (బి) మధ్వల్ 16; అన్షుల్ కాంబోజ్ (నాటౌట్) 5; నూర్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 20 ఓవర్లలో 187/8. వికెట్ల పతనం:** 1-12, 2-12, 3-68, 4-70, 5-78, 6-137, 7-180, 8-185; **బౌలింగ్:** దేశ్‌పాండే 4-0-33-1; యుధ్‌వీర్ 4-0-47-3; మఫాక 2-0-22-0; హసరంగ 4-0-27-1; రియాన్ పరాగ్ 2-0-26-0; ఆకాశ్ మధ్వల్ 4-0-29-3.

రాజస్థాన్: జైస్వాల్ (బి) కాంబోజ్ 36, సూర్యవంశీ (సి) జడేజా (బి) అశ్విన్ 57, సంజూ (సి) బ్రెవిస్ (బి) అశ్విన్ 41, పరాగ్ (బి) నూర్ 3, జురెల్ (నాటౌట్) 31, హెట్‌మయెర్ (నాటౌట్) 12, **ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: 17.1 ఓవర్లలో 188/4, వికెట్లపతనం:** 1-37, 2-135, 3-138, 4-158; **బౌలింగ్:** ఖలీల్ 3-0-35-0, కాంబోజ్ 3-0-21-1, అశ్విన్ 4-0-41-2, నూర్ అహ్మద్ 3-0-42-1, పతిరణ 2.1-0-22-0, జడేజా 2-0-27-0.

'ద వరల్డ్'తో కార్ల్‌సన్ మెగా గేమ్ డ్రా



బెర్లిన్: 'కార్ల్‌సన్ వర్సెస్ ద వరల్డ్' ఫ్రీస్టయిల్ మెగా గేమ్ డ్రాగా ముగిసింది. చెస్ డాట్ కామ్ వేదికగా గత నెల 4న ఈ ఆన్‌లైన్ సింగిల్ మ్యాచ్ ఆరంభమైంది. ఇందులో కార్ల్‌సన్ సునాయాసంగా గెలుస్తాడని అంచనా వేశారు. కానీ, 1.43 లక్షల మందితో కూడిన బృందం... 'ద వరల్డ్' అద్భుతంగా ఆడుతూ మ్యాచ్‌ను డ్రా చేసింది. 32వ ఎత్తులో మూడోసారి చెక్ చెప్పడంతో 'త్రీఫోల్డ్ రిపిటీషన్' రూల్ ప్రకారం గేమ్ డ్రా అయింది.

దిగ్వేష్‌పై మ్యాచ్ నిషేధం

50 శాతం జరిమానా



లఖ్‌నవూ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీపై ఓ మ్యాచ్ నిషేధం విధించారు. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో దుందుడుకుగా ప్రవర్తించినందుకు రాఠీ మ్యాచ్ ఫీజులో 50శాతం కోత విధించడంతో పాటు రెండు డీమెరిట్ పాయింట్లను చేర్చారు. దీంతో ఈ సీజన్‌లో పాయింట్లు ఐదుకు చేరడంతో ఓ మ్యాచ్ సస్పెన్షన్ పడింది. అలాగే దిగ్వేష్‌తో గొడవలో భాగమైనందుకు అభిషేక్ మ్యాచ్ ఫీజులోనూ 25శాతం కోత విధించి ఒక డీ మెరిట్ పాయింట్‌ను చేర్చారు.

ముంబై జట్టులో బెయిర్‌స్టో

ముంబై: ముంబై ఇండియన్స్ జట్టులో ముగ్గురు ఆటగాళ్లు చేరనున్నారు. చివరి రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడాక జాక్స్, రికెల్టన్, బాష్ తమ జాతీయ జట్లతో చేరేందుకు స్వదేశాలకు వెళ్లనున్నారు. దీంతో ప్లేఆఫ్స్ కోసం ఇంగ్లండ్‌కు చెందిన బ్యాటర్ బెయిర్‌స్టో, పేసర్ గ్లీసన్, శ్రీలంక స్పిన్నర్ అసలంకలతో ముంబై తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకుంది.

డోపింగ్‌లో పట్టుబడ్డ శివ్‌పాల్

ఎనిమిదేళ్ల నిషేధం?



న్యూఢిల్లీ: ఒలింపిక్ జావెలిన్ త్రోయర్ శివ్‌పాల్ సింగ్ (29) రెండోసారి డోప్ పరీక్షల్లో విఫలమయ్యాడు. ఒకవేళ అతడు డోపీగా నిర్ధారణ అయితే గరిష్ఠంగా ఎనిమిదేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో సింగ్ బరిలోకి దిగాడు. అయితే, ఈ ఏడాది ఆరంభంలో అవుటాఫ్ కాంపిటీషన్‌లో సేకరించిన మూత్రం శాంపిల్‌లో నిషేధిత ఉత్ప్రేరక ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో అతడిపై తాత్కాలికంగా నిషేధం విధించారు. 2019లో దోహాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించడం శివ్‌పాల్ అత్యుత్తమ ప్రదర్శన. 2021లో కూడా సింగ్ డోపింగ్‌లో పట్టుబడడంతో నిషేధం విధించారు.

మెయిన్ డ్రాకు శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్: కిడాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్ మెయిన్ డ్రాకి అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన సింగిల్స్ క్వాలిఫయర్స్ రెండో మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 21-12, 21-6తో హువాంగ్ యు కై (చైనీస్ తైపీ)పై గెలిచాడు. తరుణ్ మన్నేపల్లి 13-21, 21-23తో పనిట్చాఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు. ప్రధాన పోటీల మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రేరణ-మృణమయి జోడీ 21-19, 19-21, 21-13తో భారత్‌కే చెందిన వైష్ణవి-అలీషా జంటపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా, రష్మీ-సానియా ద్వయం, సిమ్రాన్-కవిప్రియ జంట ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-ప్రతీక్ ద్వయం, హరిహరన్-రుబాన్ జోడీ ఇంటిముఖం పట్టారు.

బిజినెస్

నెలాఖరులోగా కొత్త బీమా పాలసీ

న్యూ ఇండియా అష్యూరెన్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ ఈ నెలాఖరులోగా సరికొత్త బీమా పాలసీ ప్రారంభించబోతోంది. పారామెట్రిక్ పాలసీ పేరుతో ప్రకటించే ఈ పాలసీ ద్వారా రిటైల్, వ్యాపార సంస్థలు వాతావరణ మార్పులతో సంభవించే ప్రకృతి విపత్తుల నష్టాలకు పరిహారం పొందవచ్చని సంస్థ సీఎండీ గిరిజా సుబ్రమణియన్ చెప్పారు. భారీ వర్షాలు, గాలి వానలు, వరదలు, దుర్భిక్షాలు ఈ కోవలోకి వస్తాయన్నారు. ఈ పాలసీ కింద నిర్ణీత ప్రామాణికాల ప్రకారం నష్టపరిహారం లభిస్తుంది. దీంతో క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ కూడా త్వరగా పూర్తవుతుంది.

ఐటీఆర్-యూ నోటిఫై చేసిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఇక నాలుగేళ్ల క్రితం వరకు తమ అప్‌డేటెడ్ ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు. ఐటీ శాఖ ఇందుకోసం ఐటీఆర్-యూ పేరుతో కొత్త ఫారాన్ని విడుదల చేసింది. ఇంతకు ముందు ఈ గడువు రెండేళ్ల వరకు మాత్రమే ఉండేది. 2025 బడ్జెట్‌లో ఈ గడువును నాలుగేళ్లకు పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. ఏడాది నుంచి రెండేళ్ల అప్‌డేటెడ్ రిటర్న్‌లపై అదనంగా 25, 50 శాతం పన్ను చెల్లించాలి. అదే మూడు నుంచి నాలుగేళ్ల అప్‌డేటెడ్ రిటర్న్‌లు ఫైల్ చేస్తే 60, 70 శాతం అదనపు పన్ను చెల్లించాలని ఐటీ శాఖ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	540
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	109
కర్నూలు	125	నెల్లూరు	114
విశాఖపట్నం	121	అనంతపురం	114
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,020 ▼	87,100 ▼	1,08,000 ▼
విజయవాడ	98,500 ▲	92,000 ▲	97,500 ▼
విశాఖపట్నం	97,020 ▲	87,100 ▼	1,08,000 ▼
రాజమండ్రి	95,020 ▼	87,100 ▼	98,200 ▼
ప్రొద్దుటూరు	94,900 ▼	87,350 ▼	97,600 ▼
ముంబై	93,807 ▲	85,927 ▲	95,800 ▲

పసిడి దిగుమతులకు కళ్లెం



కొత్త నిబంధనలు జారీ చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి వచ్చి పడే పసిడి, వెండి దిగుమతులను ప్రభుత్వం మరింత కట్టడి చేసింది. ఆ దేశంతో మన దేశానికి ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ముసుగులో కొన్ని సంస్థలు ప్లాటినం పేరుతో బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ సుంకాలు ఎగవేస్తుండడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇక నుంచి నామినేటెడ్ సంస్థలు, అర్హత పొందిన నగల వ్యాపారులు/సంస్థలు, చెల్లుబాటయ్యే టారిఫ్ రేటు కోటా (టీఆర్‌క్యూ) ఉన్న సంస్థలను మాత్రమే ఈ ఒప్పందం కింద యూఏఈ నుంచి బంగారం, వెండి దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. శుద్ధి చేయని, పాక్షికంగా శుద్ధి చేసిన లేదా పౌడర్ రూపంలో ఉన్న బంగారం, వెండిలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ఎందుకంటే?

భారత్-యూఏఈ సీఈపీఏ ఒప్పందం ప్రకారం మన దేశ సంస్థలు యూఏఈ నుంచి ఏటా 200 టన్నుల వరకు పాక్షికంగా లేదా ఏ మాత్రం శుద్ధి చేయని ప్లాటినంను ఖనిజ రూపంలో లేదా పౌడర్ రూపంలో ఒక శాతం సుంకంతో దిగుమతి చేసుకోవచ్చు. అయితే చాలా సంస్థలు ఈ ఒప్పందం ముసుగులో స్వచ్ఛమైన బంగారాన్ని కూడా ప్లాటినం ముసుగులో దిగుమతి చేసుకుంటూ సుంకం ఎగవేస్తున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇందుకోసం బంగారం, వెండి, ప్లాటినంలకు వేరు వేరు కోడ్స్ కేటాయించింది. ప్లాటినం కూడా 99 శాతం స్వచ్ఛత ఉంటేనే ఒక శాతం డ్యూటీతో అనుమతిస్తామని ప్రకటించింది. దీంతో దుబాయ్ నుంచి వచ్చే అక్రమ బంగారం, వెండి దిగుమతులకు తెరపడుతుందని భావిస్తున్నారు.

టీవీఎస్ నుంచి కొత్త ఎలక్ట్రిక్ ఆటో



ప్రారంభ ధర రూ. 2.95 లక్షలు

చెన్నై: టీవీఎస్ మోటార్.. కొత్త ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్ పేరుతో దీన్ని విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 2.95 లక్షలు (ఎక్స్-షోరూమ్). 51.2 వాట్స్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ ఆటో ఒకసారి చార్జింగ్‌తో 179 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కేవలం 2.15 గంటల్లోనే 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావటం దీని ప్రత్యేకత అని టీవీఎస్ తెలిపింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈ ఆటో ప్రయాణిస్తుంది. 'టీవీఎస్ స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్' ఫీచర్లను ఈ ఆటోకు జోడించినట్లు కంపెనీ తెలిపింది.

ఇలియోస్ బ్రూవరీస్‌తో యూబీఎల్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో కింగ్‌ఫిషర్ బీరుతో పాటు ఇతర బీర్ల ఉత్పత్తిని పెంచుతున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) ప్రకటించింది. ఇందుకోసం ఇలియోస్ బ్రూవరీస్ సంస్థకు చెందిన ప్లాంట్‌ను లీజుకు తీసుకున్నట్లు తెలిపింది. యూబీఎల్‌కు ఇప్పటికే సొంతంగా శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం వద్ద బీర్ ఉత్పత్తి యూనిట్ ఉంది. అయితే రాష్ట్రంలో కింగ్‌ఫిషర్‌తో పాటు కంపెనీకి చెందిన ఇతర బ్రాండ్ల బీరుకు డిమాండ్ భారీగా పెరుగుతోంది. దీంతో వేరే కంపెనీ ప్లాంట్‌ను లీజుకు తీసుకుని బీర్ల ఉత్పత్తి పెంచాలని నిర్ణయించినట్టు తెలిపింది. ఇలియోస్ బ్రూవరీస్‌తో కుదిరిన లీజు ఒప్పందం మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది.

రూ.5.6 లక్షల కోట్ల సంపద ఆవిరి


సెన్సెక్స్ 873 పాయింట్లు డౌన్

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్లూచిప్ షేర్లలో లాభాల స్వీకరణ మంగళవారం మార్కెట్‌ను కుంగదీసింది. దీంతో సెన్సెక్స్ 872.98 పాయింట్లు నష్టపోయి 81,186.44 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 27 నష్టాల్లో క్లోజయ్యాయి. ఆటో, ఫైనాన్షియల్స్, రక్షణ రంగాల షేర్లలో కూడా ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. మార్కెట్ నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండో రోజు. మంగళవారం బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,64,594.68 కోట్లు దిగజారి రూ.4,38,03,259.51 కోట్ల వద్ద (5.13 లక్షల కోట్ల డాలర్లు) స్థిరపడింది.

7 ఐపీఓలకు సెబీ ఆమోదం: క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్, శ్రీ లోటస్ డెవలపర్స్ యూరో ప్రతీక్ సహా ఏడు కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. సెబీ ఆమోదం పొందిన ఇతర కంపెనీల్లో కాలిబర్ మైనింగ్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, జెసన్స్ ఇండస్ట్రీస్, జెమ్ ఆరోమేటిక్స్ ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ రూ.3,000 కోట్లు సమీకరించనున్నాయి.

టైమ్ దాతల జాబితాలో ముకేశ్ అంబానీ, అజీమ్ ప్రేమ్‌జీ

నిఖిల్ కామత్‌కూ స్థానం



న్యూఢిల్లీ: ప్రపంచంలో దాతృత్వ కార్యకలాపాలు నిర్వహించే అగ్రశ్రేణి 100 మంది ప్రముఖుల జాబితాలో దేశీయ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీతో పాటు విప్రో మాజీ చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ, జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు చోటు దక్కింది. టైమ్ మ్యాగజైన్ ప్రపంచంలో దాతృత్వ కార్యకలాపాల్లో అత్యంత ప్రభావశీలురైన 100 మంది దాతల జాబితా-2025ని తొలిసారిగా విడుదల చేసింది. అత్యంత అవసరంలో ఉన్న సామాజిక వర్గాలకు విరాళాలందించే దాతలు, ఫౌండేషన్ల సారథులు, లాభాపేక్ష రహిత సంస్థల ఉదారతకు సంబంధించిన కథనాలను ఈ జాబితా వెల్లడిస్తుందని టైమ్ పత్రిక తెలిపింది. టైమ్ కథనం ప్రకారం ముకేశ్, నీతా అంబానీ దంపతులు 2024లో రూ.407 కోట్ల విరాళాలందించి దేశంలోనే అతి పెద్ద దాతలుగా నిలిచారు. దేశంలో అత్యంత సంపన్నులైన ఈ దంపతులు తమ దాతృత్వ కార్యకలాపాల ద్వారా కోట్లాది మందికి సాధికారత కల్పిస్తున్నారని ఆ నివేదికలో తెలిపారు. 11,000 కోట్ల డాలర్ల (రూ.9.35 లక్షల కోట్లు) సంపద కలిగిన తమ వ్యాపార సామ్రాజ్యం ఎన్ని రంగాలకు విస్తరించిందో వారి దాతృత్వ కార్యకలాపాలు కూడా అంతగా విభిన్న రంగాలకు విస్తరించాయని పేర్కొంది. రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలైన నీతా అంబానీ తమ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు స్వయంగా సారథ్యం వహిస్తూ ఉంటారని టైమ్ మ్యాగజైన్ తెలిపింది.

గాంధేయవాది ప్రేమ్‌జీ

గాంధేయవాదిగా పేరొందిన టెక్నాలజీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీ ప్రపంచంలో అత్యంత ఉదారంగా దానధర్మాలు చేసే ప్రముఖుల్లో ఒకరుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఒక క్రమ పద్ధతిలో తన సంపదను వినియోగిస్తున్నారని టైమ్ పత్రిక తెలిపింది. గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం చేసిన తొలి భారతీయుడు ప్రేమ్‌జీ. 25 సంవత్సరాల క్రితం తాను ప్రారంభించిన ఫౌండేషన్‌కు 2013లో తన కంపెనీకి చెందిన 2,900 కోట్ల డాలర్ల (రూ.2.46 లక్షల కోట్లు) విలువ గల షేర్లను విరాళంగా అందించారు.

అంతేకాకుండా విప్రో సంస్థ విద్య, ఆరోగ్యం, ఇతర రంగాల మెరుగుదలకు కృషి చేస్తున్న 940 సంస్థలకు 2023-24 సంవత్సరంలో 10.9 కోట్ల డాలర్లు (రూ.926.5 కోట్లు) సాంప్రదాయిక గ్రాంట్లుగా అందించింది. ప్రేమ్‌జీ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా 59 క్షేత్ర స్థాయి కార్యాలయాలు, 263 ఉపాధ్యాయ అభ్యాస కేంద్రాల ద్వారా ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు, గ్రామీణ బాలల సంరక్షణ సిబ్బందితో సంబంధాలు కలిగి ఉంది. ఇప్పటి వరకు 80 లక్షల మంది బాలబాలికల కోసం విద్యా కార్యక్రమాలు చేపట్టింది.

విద్యనే నమ్మిన నిఖిల్ కామత్

డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థ జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ 2023లో గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం చేశారు. 36 సంవత్సరాల పిన్న వయసులో సంతకం చేసిన తొలి భారతీయుడుగా గుర్తింపు పొందారు. విద్య ఒక్కటే సమాజంలో అసమానతలను నిర్మూలించగలదని విశ్వసించే నిఖిల్ అప్పటికే పలు పర్యావరణ, విద్యా ప్రాజెక్టులకు కోట్లాది రూపాయలు విరాళంగా అందించారు. యంగ్ ఇండియా ఫిలాంత్రపిక్ ప్లెడ్జ్ (వైఐపీపీ) పేరిట సొంత సంస్థను స్థాపించి 10 కోట్ల డాలర్లకు పైబడిన సంపద కలిగిన, 45 సంవత్సరాల లోపు వయస్కులైన యువత అందరూ తమ సంపదలో 25 శాతం విరాళాలుగా అందించాలని పిలుపు ఇచ్చారని టైమ్ తెలిపింది.

వాతావరణ మార్పుల సొల్యూషన్లపై కృషి చేస్తున్న రెయిన్ మ్యాటర్ ఫౌండేషన్‌కు 10 కోట్ల డాలర్లకు (రూ.850 కోట్లు) పైగా నిధులు అందించారు. నిఖిల్ సారథ్యంలోని వైఐపీపీ 300 పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు, కెరీర్ కౌన్సెలింగ్, ఇతర సేవల కోసం 80 కోట్ల డాలర్లు (రూ.6,800 కోట్లు) సమీకరించింది. కాగా ఫుట్ బాల్ లెజెండ్ డేవిడ్ బెక్‌హామ్, ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్, అమెరికన్ దాత మెలిండా ఫ్రెంచ్ గేట్స్, ప్రిన్స్ విలియం, వేల్స్ ప్రిన్సెస్ కాథరిన్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్లాండ్ ఫార్మా.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.186.54 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం లాభం రూ.192.42 కోట్లతో పోల్చితే 3% తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.1,537.45 కోట్ల నుంచి రూ.1,424.91 కోట్లకు తగ్గింది. అమెరికా మార్కెట్ ఆదాయాలు 10% తగ్గటం పనితీరును దెబ్బతీసిందని పేర్కొంది. ఈ కాలంలో అమెరికా ఆదాయం రూ.791.80 కోట్లుగా ఉంది. మరోవైపు యూరప్ ఆదాయాలు 4% వృద్ధితో రూ.280.20 కోట్లుగా ఉండగా భారత ఆదాయం నిలకడగా రూ.52.5 కోట్లుగా ఉన్నట్లు గ్లాండ్ ఫార్మా తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.18 తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

ఎయిర్‌టెల్, గూగుల్ బంఫర్ ఆఫర్

6 నెలల పాటు 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్ ఉచితం

న్యూఢిల్లీ: టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్, టెక్ దిగ్గజం గూగుల్ జట్టు కట్టాయి. ఒప్పందంలో భాగంగా ఎయిర్‌టెల్ తన పోస్ట్‌పెయిడ్, వైఫై ఖాతాదారులకు గూగుల్ వన్ ద్వారా 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్‌ను ఆరు నెలల పాటు ఉచితంగా అందించనుంది. ఈ స్టోరేజ్‌ను గరిష్ఠంగా ఐదుగురితో పంచుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఆరు నెలల అనంతరం ఈ సబ్‌స్క్రిప్షన్ కొనసాగించాలనుకునే కస్టమర్లు నెలకు రూ.125 చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. ఒకవేళ సబ్‌స్క్రిప్షన్ అవసరం లేదనుకుంటే గూగుల్ వన్ సభ్యత్వాన్ని రద్దు చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

ఇప్పటికి వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధమే

» స్టే ఇవ్వాలంటే బలమైన కారణం చూపాల్సిందే: సుప్రీం



న్యూఢిల్లీ, మే 20: బలమైన ఆధారాలతో పిటిషనర్లు సవాలు చేసే వరకు పార్లమెంటు చేసిన చట్టాలను రాజ్యాంగబద్ధమైనవి గానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ అమలు చేయకుండా మధ్యంతర ఊరట కల్పించాలంటే స్పష్టంగా ఉన్న బలమైన కారణాన్ని చూపించాల్సిందేనని పిటిషనర్లకు స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం మంగళవారం వక్ఫ్ చట్టంపై దాఖలైన పలు పిటిషన్ల మీద విచారణ జరిపింది. కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించినవి, భూమిని వినియోగిస్తున్న వారు వక్ఫ్‌గా ప్రకటించినవి, ఆస్తిని రాసివ్వడం ద్వారా వక్ఫ్‌గా ప్రకటించినవి... ఈ మూడు రకాల ఆస్తులను డీనోటిఫై చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టే ప్రస్తుత చట్ట నిబంధనను పిటిషనర్లు ప్రధానంగా వ్యతిరేకిస్తున్నారు. చట్టాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్లు వేసిన వారి తరఫున కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కొత్త చట్టంతో న్యాయ ప్రక్రియతో నిమిత్తం లేకుండా వక్ఫ్ ఆస్తులను లాక్కునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పథకం ప్రకారం వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనే కార్యక్రమమని సిబల్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అధికారి ఆదేశాలతో వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులుగా ప్రకటించే పరిస్థితి నెలకొందని, బాధితులు కోర్టుల ద్వారా ఊరట పొందే అవకాశం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ అంటే శాశ్వతంగా అల్లాకు సమర్పించే ఆస్తి అని, కొత్త చట్టం వల్ల శాశ్వతం అనే భావనకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. పాత వక్ఫ్ చట్టాలు ఆస్తులను కాపాడేందుకు ఉద్దేశించినవి అయితే ప్రస్తుత వక్ఫ్ చట్టం వాటిని లాక్కునేందుకు ఉద్దేశించినట్లు కనబడుతోందని వ్యాఖ్యానించారు. ఒక ఆస్తి వక్ఫ్‌దా? ప్రభుత్వానిదా? అని ప్రభుత్వ అధికారి విచారిస్తున్నపుడు ఆ ఆస్తిని స్వాధీనం చేసుకొనే అధికారం కూడా సదరు అధికారికి కట్టబెడుతున్నారని ప్రస్తావించారు. ఇందులో ఎక్కడా కోర్టుల జోక్యానికి అవకాశం లేదని గుర్తు చేశారు. గతంలో వక్ఫ్‌కు ఎన్నికలు జరిగేవని, అందరూ ముస్లిములు ఉండేవారని, ఇప్పుడు అంతా నామినేటెడ్ సభ్యులని, 11 మందిలో ఏడుగురు ముస్లిమేతరులను నియమించే అవకాశం ఉందని, ఇది రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛకు, ప్రచారం చేసుకునే హక్కుకు భంగం కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. ఇద్దరే కదా అని ధర్మాసనం గుర్తు చేయగా, ఇద్దరైనా చాలా ఎక్కువేనని సిబల్ అన్నారు. హిందూ, సిక్కు ఎండోమెంట్ సంస్థల్లో మతేతరులు లేరని, ఎక్స్ అఫీషియో సభ్యులు కూడా అదే మతానికి చెందిన వారు ఉంటారని ప్రస్తావించారు.

వక్ఫ్ లౌకిక భావన

వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రభుత్వం గట్టిగా సమర్థించుకుంది. వక్ఫ్ పాలనలో లౌకిక అంశాలను మాత్రమే ప్రభుత్వం నియంత్రిస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా లిఖితపూర్వకంగా కోర్టుకు చెప్పారు. వక్ఫ్ అనేదే మౌలికంగా లౌకిక భావన అన్నారు. చట్టంపై ఇప్పటికిప్పుడు స్టే ఇవ్వాల్సిన జాతీయ అత్యవసర పరిస్థితి ఏమీ లేదని వ్యాఖ్యానించారు. సరైన పత్రాలు లేకుండా వక్ఫ్ ఆస్తులను కొనసాగించే ప్రస్తావనే లేదని తుషార్ మెహతా స్పష్టం చేశారు. కోర్టు సొంత నిర్ణయంతో అలాంటి వాటికి గుర్తింపు ఇచ్చే ప్రయత్నంచేస్తే ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. అందుకు అనుమతిస్తే చాలా మోసాలు జరుగుతాయన్నారు. ఆస్తిని మత ధర్మం కోసం వాడుతున్న వ్యక్తికి దాన్ని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ప్రాథమిక హక్కేమీ కాదని స్పష్టం చేశారు. ఒక చట్టం ద్వారా ఇచ్చిన హక్కును మారుతున్న కాలమాన పరిస్థితులను బట్టి మరో చట్టం ద్వారా తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పారు.

అన్ని దేశాలకూ వ్యాక్సిన్లు

కరోనా తరహా విపత్తులను ఎదుర్కోవడంపై డబ్ల్యూహెచ్ఓ సభ్య దేశాల ఒప్పందం

» మహమ్మారులు విజృంభించినప్పుడు ఫార్మా ఉత్పత్తుల్లో 20% డబ్ల్యూహెచ్ఓకు..

» పేద దేశాలకు అందించేందుకు వీలుగా నిర్ణయం.. ఓటింగ్‌కు అమెరికా దూరం



జెనీవా, మే 20: భవిష్యత్తులో కరోనా వంటి మహమ్మారులు విజృంభిస్తే.. ఎలా ఎదుర్కోవాలన్న దానిపై డబ్ల్యూహెచ్‌వో సభ్యదేశాలు చరిత్రాత్మక ఒప్పందానికి వచ్చాయి. మంగళవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యదేశాల ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకం చేశారు. కరోనా మహమ్మారితో ప్రపంచమంతా అతలాకుతలమైన క్రమంలో.. మరోసారి అలాంటి విపత్తు వస్తే ఎలా ఎదుర్కోవాలన్న దానిపై 2022లో డబ్ల్యూహెచ్‌ఓలో చర్చలు మొదలయ్యాయి. తాజాగా ఒప్పందం కుదిరింది. మొత్తం 135 సభ్యదేశాలకుగాను 124 దేశాలు అనుకూలంగా ఓటేయగా.. అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ సహా 11 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. "ప్రజారోగ్యానికి సంబంధించి ఇది చరిత్రాత్మక ఒప్పందం. భవిష్యత్తులో ఏదైనా మహమ్మారి వస్తే.. అందరం కలసికట్టుగా పోరాడి, ప్రపంచాన్ని రక్షించుకుంటాం" అని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ పేర్కొన్నారు. అయితే డబ్ల్యూహెచ్‌వోకు అత్యధికంగా నిధులు ఇచ్చే అమెరికా దూరంగా ఉండటంతో.. ఈ ఒప్పందం ఏమేర సఫలీకృతం అవుతుందన్న సందేహాలున్నాయి.

ఏమిటీ ఒప్పందం?

భవిష్యత్తులో ఏదైనా మహమ్మారి వస్తే.. దానికి సంబంధించిన వ్యాక్సిన్లు, ఔషధాలు, చికిత్సలు వంటివి ఏ దేశం అభివృద్ధి చేసినా కూడా.. అన్నిదేశాలకు అందుబాటులోకి తేవాలి. సభ్య దేశాల్లోని ఫార్మా సంస్థలు ఉత్పత్తి చేసే వ్యాక్సిన్లు, ఔషధాలు, టెస్ట్ కిట్‌లలో 20శాతం డబ్ల్యూహెచ్‌వోకు అందజేయాలి. వాటిని పేద దేశాలకు సరఫరా చేస్తారు. ఒప్పందంలోని నిబంధనలకు సభ్య దేశాలు స్వచ్ఛందంగా కట్టుబడి ఉండాలి.

ఆసియాలో కోరలు చాస్తున్న కొవిడ్!

» హాంకాంగ్, సింగపూర్‌లో వేలల్లో కేసులు

» ఆస్పత్రుల్లో చేరికలు.. తీవ్రత తక్కువ

» భారత్‌లోనూ 250 కేసుల నమోదు

న్యూఢిల్లీ, మే 20: కొవిడ్ మహమ్మారి ఆసియా ఖండంలో మళ్లీ విజృంభిస్తోంది. ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్, చైనాల్లో వ్యాప్తి చెందుతోంది. రోజురోజుకూ పాజిటివిటీ రేటు పెరుగుతోంది. భారత్‌లోనూ 257 కేసులు నమోదయ్యాయి. జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలు ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 కారణంగా కొవిడ్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జేఎన్.1 రకం వేరియంట్ పెరగడాన్ని బట్టి.. ఇంతకు మునుపు తీసుకున్న వ్యాక్సిన్ల ప్రభావం తగ్గుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. సింగపూర్‌లో ఏప్రిల్ 27-మే 3 మధ్య 14 వేల కేసులు వెలుగు చూడగా.. అంతకు ముందు వారం 11 వేల కేసులున్నట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే.. ఐసీయూలో చేరికలు స్వల్పంగా ఉన్నట్లు తెలిపింది. అటు థాయ్‌లాండ్‌లో ఈనెల 11-17 మధ్య కాలంలో 33 వేల కేసులు నమోదయ్యాయి. ఒక్క బ్యాంకాక్‌లోనే 6 వేల కేసులున్నాయి. హాంకాంగ్‌లోనూ కొవిడ్ కేసులు గత నెల 6-12 తేదీల(6.21%)తో పోలిస్తే.. 13.66శాతానికి చేరుకుంది. చైనాలో పాజిటివిటీ రేటు 3.3% నుంచి 6.3శాతానికి పెరిగింది. భారత్‌లో కొవిడ్ కేసులు 257కు చేరడంతో వైద్య సేవల డైరెక్టర్ జనరల్ సోమవారం వైద్యాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

నీ కడుపున ఎందుకు పుట్టానమ్మా!

» రెండున్నరేళ్ల బిడ్డపై బాయ్‌ఫ్రెండ్ అత్యాచారం.. అడ్డుకోని తల్లి.. చిన్నారి మృతి

ముంబై, మే 20: ఆ తల్లిది గుండెనా.. బండరాయా? రెండున్నరేళ్ల కూతురిపై బాయ్‌ఫ్రెండ్ అత్యాచారం చేస్తుంటే ఆ ఘోరాన్ని కళ్లప్పగించి చూసింది తప్ప అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు! ముంబైలోని మాల్వాని ప్రాంతంలో ఈ ఘోరం వెలుగుచూసింది. ఆ నిర్దయురాలైన తల్లి పేరు రీనా షేక్. ఆమె ప్రియుడు ఫర్హాన్ షేక్! అత్యాచారానికి గురైన పసిబిడ్డను ఆస్పత్రికి తీసుకెళితే ఆమె దయనీయ స్థితి చూసి వైద్యులే దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే పోలీసులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రీనా సమక్షంలోనే చిన్నారిపై ఫర్హాన్ అత్యాచారానికి ఒడిగట్టాడని.. ఆమె అడ్డుకోలేదని నిర్ధారించారు. వారిపై పోక్సో కేసు నమోదు చేశారు.

న్యాయాధికారి పోస్టులకు మూడేళ్ల లా ప్రాక్టీసు తప్పనిసరి: సుప్రీం

న్యూఢిల్లీ, మే 20: న్యాయాధికారిగా పదవులు చేపట్టాలంటే తొలుత న్యాయవాదిగా పనిచేసిన అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జ్యుడీషియల్ సర్వీసెస్‌లో ప్రారంభ పదవి అని మున్సిఫ్ మేజిస్ట్రేటుగా చేరాలంటే లాయర్‌గా కనీసం మూడేళ్లు ప్రాక్టీసు చేసి ఉండాలని తెలిపింది. న్యాయ కళాశాలల నుంచి పట్టాలు పొందిన వారు ఎలాంటి ప్రాక్టీసు లేకుండానే నేరుగా మున్సిఫ్ మేజిస్ట్రేటు పదవులు చేపట్టవచ్చంటూ 2002లో ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టింది. ఈ మేరకు ధర్మాసనం మంగళవారం తీర్పు చెప్పింది. ఈ మేరకు నిబంధనలను సవరించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

న్యాయ వ్యవస్థలో తిమింగలాలు?

(మొదటి పేజీ తరువాయి)



నిలబడింది. ఢిల్లీలోని ఒక న్యాయమూర్తి అధికార నివాసంలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మార్చిలో జరిగితే ఇంతవరకు ఎఫ్ఐఆర్ లేదు. దీన్ని కూడా కాలక్రమంలో మరచిపోవాల్సి వస్తుందని జనం అనుకుంటున్నారు. ఇతర పౌరుల విషయంలో జరిగినట్లుగా నేర న్యాయ వ్యవస్థ న్యాయమూర్తుల విషయంలో ఎందుకు పని చేయడం లేదు? ఆ డబ్బులు ఎవరివి? ఎక్కడి నుంచి వచ్చాయి? లాంటి వివరాల కోసం జనం ఎదురు చూస్తున్నారు" అన్నారు. న్యాయ వ్యవస్థ కలుషితం అయ్యిందని, వర్మ కన్నా పెద్ద తిమింగలాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. సుప్రీకోర్టు ఇప్పటివరకు సరిగానే వ్యవహరించిందని, ముగ్గురు న్యాయమూర్తుల కమిటీని వేయడం ద్వారా మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడారని చెప్పారు. జస్టిస్ గవాయ్ జస్టిస్ ఖన్నా బాటలో నడవాలని, నివేదికను బహిర్గతం చేయాలని సూచించారు. న్యాయమూర్తుల మీద ఆరోపణలు వచ్చినపుడు అంతర్గత విచారణ జరిపే సంప్రదాయానికి జస్టిస్ వెంకటస్వామి కేసులో 1991 నాటి సుప్రీంకోర్టు తీర్పు అవకాశం ఇచ్చిందని ధన్‌ఖడ్ చెప్పారు. ఆ తీర్పును పునస్సమీక్షించాలని డిమాండ్ చేశారు. నాటి తీర్పుతో న్యాయవ్యవస్థలో జవాబుదారీతనానికి, పారదర్శకతకు పాతర వేసినట్లు అయ్యిందని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని దేవెగౌడతో సమావేశమైన ధన్‌ఖడ్ రైతులకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలు నగదు రూపంలో బ్యాంకు ఖాతాల్లో వేయాలని అభిప్రాయపడ్డారు. ఇతర ఏ రకాలుగా ఇచ్చినా కొంత లంచాలకు పోతుందని వ్యాఖ్యానించారు.

టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చలు సఫలం కావడంతో టీచర్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. పలు డిమాండ్లపై ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఉద్యమానికి పిలుపునివ్వడంతో ఇటీవల చేపట్టాల్సిన బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ వ్యవహారంపై సోమ, మంగళవారాల్లో సంఘాల నేతలతో అధికారులు చర్చలు జరిపారు. మంగళవారం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌తో చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఈ క్రమంలో బదిలీలకు షెడ్యూలు జారీ చేయాలని నిర్ణయించారు. టీచర్ల బదిలీల వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. కాగా, సంఘాలతో జరిగిన చర్చల్లో పలు డిమాండ్లపై అధికారులు సానుకూలంగా స్పందించారు. ఉన్నత పాఠశాలల్లో 45మంది విద్యార్థులు దాటితే రెండో సెక్షన్ ఇవ్వాలని సంఘాలు కోరగా 49 దాటితే రెండో సెక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రతి 40 మంది విద్యార్థులకు అదనంగా సెక్షన్లు కేటాయిస్తారు. అలాగే, సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అంగీకరించారు. ఫౌండేషనల్ పాఠశాలల్లో 1:20 నిష్పత్తిలో టీచర్లను కేటాయిస్తామన్నారు. 20 మంది దాటితే రెండో టీచర్ పోస్టు కేటాయిస్తారు. 1,382 మంది ఎస్జీటీలకు పదోన్నతి కల్పించి మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తారు. 'తెలుగు మీడియం' అంశాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్‌లు రంగంలోకి దిగి.. సంఘాల ప్రతినిధులతో మాట్లాడి.. ఉద్యమాన్ని విరమించేలా చేశారు.

రేపటి నుంచి బదిలీల ప్రక్రియ

ఉపాధ్యాయులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న బదిలీల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ గురువారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంగళవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఉపాధ్యాయ బదిలీల చట్టం ప్రకారం ఇవి జరుగుతాయని తెలిపింది. మే 31 బదిలీలకు తుది గడువుగా నిర్ణయించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

షూటింగ్‌లో రాశీ ఖన్నాకు గాయాలు

నటి రాశీ ఖన్నా షూటింగ్‌లో గాయపడ్డారు. ఆమె ముఖానికీ, చేతివేళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె సోషల్‌మీడియా ద్వారా తెలిపారు. "కొన్ని పాత్రలు గాయాల్ని డిమాండ్ చేస్తాయి. ఆ గాయాలను లెక్కచేయకూడదు. మనమే ఒక తుపానుగా మారినప్పుడు ఏ పిడుగూ మనల్ని ఆపలేదు" అని పేర్కొన్నారు. ఆమెకు ఈ గాయాలు 'ఫర్జీ 2' వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలో అయినట్లు తెలుస్తోంది. కాగా, షాహిద్ కపూర్, విజయ్‌సేతుపతి, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'ఫర్జీ'. ప్రస్తుతం రెండో సీజన్ షూటింగ్ జరుగుతోంది.





ఎన్టీఆర్ బాలీవుడ్‌లోకి ఘనంగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. వైఆర్ఎఫ్ 'స్పై యూనివర్స్'లో భాగంగా ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న విడుదలవుతోంది. మంగళవారం ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు మేకర్స్. ఆకట్టుకునే సంభాషణలు, అద్భుతమైన విజువల్స్‌తో 95 సెకన్ల పాటు సాగిన ఈ టీజర్ యాక్షన్ ప్రియులను అలరించేలా ఉంది. ముఖ్యంగా, ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే పోరాట సన్నివేశాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. కియారా అద్వానీ కథానాయిక.

పోలీస్‌గా మంచు మనోజ్



మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. పరిశోధనాత్మక ఉత్కంఠభరిత కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి 'రక్షక్' అనే శక్తిమంతమైన పేరు పెట్టారు. శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు నవీన్ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో మనోజ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ఆసక్తిని కలిగించింది. మనోజ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌పై 'దాచిన నిజం శాశ్వతంగా దాగి ఉండదు' అనే ట్యాగ్‌లైన్ కథలోని మిస్టరీని సూచిస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా బిజీగా ఉన్న మంచు మనోజ్ ప్రస్తుతం 'భైరవం', 'మిరాయ్' సినిమాల్లో నటిస్తున్నారు. ఇప్పుడు 'రక్షక్' చిత్రంతో మళ్లీ హీరోగా అలరించేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

వినోదాత్మక చిత్రం



ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న వినోదాత్మక చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్‌జే మూవీస్ బేనర్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య దర్శకుడు మారుతి ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ 'ఈ సినిమాకు టైటిల్‌తోనే విజయం సాధించారు. సినిమా కూడా బాగుంటుందనే ఫీల్ కలుగుతోంది. కచ్చితంగా ఈ చిత్రం ప్రవీణ్ కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది' అని అన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'మారుతి చేతుల మీదుగా మా ట్రైలర్ రిలీజ్ అవడం సంతోషంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ చిత్రం ద్వారా ప్రవీణ్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఈ సినిమాలో కేజీఎఫ్ గరుడ పాత్ర అందరికీ నచ్చుతుంది' అని నిర్మాత జనార్ధన్ ఆచారి చెప్పారు.

మళ్లీ వస్తున్న మాయాబజార్



తెలుగువారు ఇష్టపడే క్లాసిక్ చిత్రాల వరుసలో 'మాయాబజార్' ముందు స్థానంలో ఉంటుంది. తరాలు గడుస్తున్నా ఈ సినిమాపై వారికి ఉన్న ఆదరాభిమానాలు ఏ మాత్రం తగ్గలేదు సరికదా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇటీవల రీరిలీజ్‌ల ట్రెండ్ ఊపందుకున్న తరుణంలో ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా కలర్ వెర్షన్‌లో బలుసు రామారావు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్ టీడీ జనార్ధన్ మాట్లాడుతూ "తెలుగు సినిమా చరిత్రలో ఈ సినిమాది ప్రత్యేక స్థానం. ఇప్పటితరానికి ఈ సినిమా ఓ మైలురాయిలాంటిది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేశ్ ప్రసాద్, దర్శకులు ఎస్వీకృష్ణారెడ్డి, వీరశంకర్, త్రిపురనేని చిట్టి తదితరులు పాల్గొన్నారు.



కీరవాణికి పవన్‌కల్యాణ్ అభినందన

'సలసల మరిగే నీలోని రక్తమే..' అనే పాటకు సంగీత సాహిత్యాలతో కీరవాణి ప్రాణం పోశారని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందించారు. మంగళవారం ఉదయం తనని కీరవాణి కలసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తను హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం కథలోని భావోద్వేగాలను శిఖరస్థాయికి తీసుకెళ్లాయని ఆయన చెప్పారు. 'మొదటిసారి మీతో చేస్తున్నాను అంటే అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకు తగ్గట్లు ఉండాలి కదా' అని కీరవాణి చెప్పడం ఆయన అంకితభావాన్ని తెలియజేస్తుంది' అన్నారు పవన్‌కల్యాణ్.

శక్తిమంతమైన యోధుడు



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు. అలాగే మంచు మనోజ్ విలన్‌గా, రీతికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ముంబైలోని చారిత్రక గుహల్లో ప్రారంభమైంది. తేజతో పాటు కొన్ని ప్రధాన నటీనటులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టులో ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మంచు మనోజ్ ఫస్ట్‌లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి.

సందేశాత్మక కథతో...



రఘుబాబు, బలగం సత్యనారాయణ, విజయలక్ష్మీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలివి వనం'. రాజ్‌నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు. నాగదుర్గ హీరోయిన్ పూర్తిగా తెలంగాణ పల్లెటూరి నేపథ్యంలో సాగనున్న చిత్రమిదని మేకర్స్ చెప్పారు. అడవులను రక్షించుకోవాలని గొప్ప సందేశం ఇచ్చే కథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. త్వరలోనే విడుదల కానుంది.

భర్త జైల్లో .. భార్య ఊహల్లో..

- జగన్ మళ్లీ సీఎం అయితే హోంమంత్రి తానేనట!
- ఉబ్బితబ్బిబ్బవుతున్న నందిగం సురేశ్ భార్య
- లాయర్‌తో ఆనందాన్ని పంచుకున్న బేబీలత
- ఇరువురి ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్



గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): భర్త జైల్లో ఉంటే భార్య దుఃఖించటం సహజం. కానీ, ఇందుకు భిన్నంగా మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్ భార్య ఆశలు, ఆలోచనలు ఉండటం, అవి బహిర్గతమవటంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాపట్ల ఎంపీగా ఉన్న నందిగం సురేశ్ ఆనాటి ముఖ్యమంత్రి జగన్ అండ చూసుకొని అనేక అరాచకాలకు పాల్పడిన విషయం తెలిసిందే. అప్పటి పాపాలు ఇప్పుడు ఆయనను వెంటాడుతూ పలు కేసుల్లో నిందితునిగా ఉన్న విషయం తెలిసిందే. సురేశ్‌ను అరెస్టు చేసిన సందర్భాల్లో ఆయన భార్య బేబీలత పోలీసులతో ఘర్షణ పెట్టుకొని, ఆ తరువాత మీడియాతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఆమె పేరు వెలుగులోకి వచ్చింది. బేబీలత తమ మహిళా లాయర్‌తో ఫోన్‌లో జరిపిన ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో మంగళవారం విస్తృతంగా హల్‌చల్ చేసింది. ఇందులో ఆనాడు జరిగిన సంఘటనలను గురించి వీరిద్దరూ మాట్లాడుకున్నారు. ఆ ఇరువురి సంభాషణల్లో సురేశ్ భార్యను ఉద్దేశించి మహిళా లాయర్ మాట్లాడుతూ.. 'ఈసారి జగన్ మీకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తారు. మిమ్మల్ని హోంమంత్రిని కూడా చేయటం ఖాయ'మని పొగిడారు. దీనిపై బేబీలత ఫోన్‌లోనే తబ్బితబ్బిబ్బయ్యారు. 'జైలు వద్దకు మొదట వెళ్లినప్పుడు గేటు వద్ద ఓ అధికారి సెల్యూట్ చేసి భవిష్యత్తులో మీరు హోం మంత్రి అవుతా'రంటూ పొగిడారంటూ తన ఆనందాన్ని లాయర్‌తో బేబీలత పంచుకుంది.

ఫోన్ సంభాషణ ఇలా...

మహిళా లాయర్ : ఒక్క ఎస్సీ (నందిగం సురేశ్) తప్ప అందరూ బయటకు వచ్చేశారు.

సురేశ్ భార్య : నిజంగా అండీ. మీరు కేసు విషయంలో చాలా పట్టుదలగా ఉన్నారు.

లాయర్ : మీరు ఎన్నన్నా నేను పట్టుదలతోనే ఉన్నా. మీరు ఏమన్నా అనుకోండి. నేను మిమ్మల్ని నెక్స్ట్ హోం మినిస్టర్‌గా చూడాలంతే.

సురేశ్ భార్య : అయ్యో.. ఆయన ముందు అనేరు లేని పోయింది...

లాయర్: లేదు.... లేదు...కోర్టులో లాయర్లు కూడా ఇదే అనుకుంటున్నారు.

సురేశ్ భార్య: అవును. ఆ రోజు జైలు దగ్గర ఎంట్రీ విషయంలో ఓ సీఐ నా పట్ల దురుసుగా ప్రవర్తించాడు. అప్పుడే ఆయనను దులిపేశా. అదే సీఐ నిన్న కోర్టు దగ్గర కనిపించాడు. 'మేడం బాగున్నారా.? సార్‌కు బెయిలొచ్చిందా? మీరు నెక్స్ట్ హోం మినిస్టర్ లే మేడం. మీకేం బాధలేదు.' అని అన్నాడు. నేను 'నీకు నా మీద కోపమా...మా ఆయన మీద కోపమా?' అని గట్టిగా అడిగాను. 'లేదు...లేదు...మేడం. రాష్ట్రమంతా మీరే తదుపరి హోం మంత్రి అని అనుకుంటున్నారు." అని అన్నాడు. అలా అంటుంటే ఆనందం వేసింది నాకు. భగవంతుడు రాత రాయాలి మేడం... మనుషులు అనుకుంటే అయ్యేది కాదు.

లాయర్ : ఈ మాట అన్నయ్య (నందిగం సురేశ్) అరెస్టు అయినప్పుడే చెప్పాగా. దేవుడు రాసేశాడు. మీరు నెక్స్ట్ హోం మంత్రి...అంతే. ఈ రోజు లాయర్లు ఏమన్నారో చెబితే మీరు నమ్మరు. 'ఆయన బయటకొచ్చినా బేబమ్మదే హవా సాగుతుంది. జగన్ బేబమ్మకే టికెట్ ఇస్తారు. ఇక సార్ ఇంట్లో ఉండి సేవ చేసుకోవాల్సిందే.' అని అన్నారు మేడం.

కేసీఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ పిలుపు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణకు రావాలని కోరింది. ఈ మేరకు ఆయనకు సమన్లు పంపింది. కమిషన్ ముందు జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావుకు, ఈటల రాజేందర్‌కు కూడా సమన్లు జారీ చేశారు. హరీశ్‌ను జూన్ 6న, ఈటలను జూన్ 9న హాజరవ్వాలని కోరారు. కేసీఆర్‌కు జూన్ 5న విచారణకు హాజరవుతారా? విచారణ ప్రక్రియను న్యాయస్థానంలో సవాలు చేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

ఒకేసారి పరీక్షలు, ఫలితాలు

- ఉన్నత విద్య అకడమిక్ క్యాలెండర్ విడుదల
- ఆగస్టు 4 నుంచి ఇంజనీరింగ్, 11 నుంచి డిగ్రీ తరగతులు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ కార్యకలాపాలను ఏకతాటిపైకి తేవాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. అన్ని యూనివర్సిటీలు... అడ్మిషన్లు, తరగతులు, పరీక్షలు, ఫలితాలు ఒకే సమయంలో నిర్వహించాలని స్పష్టం చేస్తూ 2025-26 మోడల్ అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. డిగ్రీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ కోర్సులకు కామన్ షెడ్యూలు తేదీలను అందులో సూచించింది. ఇన్నాళ్లూ యూనివర్సిటీలు వేర్వేరుగా అడ్మిషన్లు, పరీక్షలు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇకపై అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు మొదటి వారం నాటికి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేస్తారు. జూలై చివరి వారం నాటికి ఇంజనీరింగ్ అడ్మిషన్లు, ఫార్మసీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిస్తారు. ప్రతి శనివారం పలు అంశాలపై కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నత విద్యామండలి సూచించింది. యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సోషల్ మీడియా ప్రభావం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా, జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి.

సెమిస్టర్ల వారీగా క్యాలెండర్

సెమిస్టర్	డిగ్రీ	ఇంజనీరింగ్
సెమిస్టర్ 1	ఆగస్టు 11న తరగతులు ప్రారంభం	ఆగస్టు 4 నుంచి తరగతులు
	డిసెంబరు 10- 23 వరకు పరీక్షలు	డిసెంబరు 23- జనవరి 9 వరకు పరీక్షలు
	జనవరి 13 ఫలితాలు	జనవరి 29న ఫలితాలు
సెమిస్టర్ 2	డిసెంబరు 29న తరగతులు ప్రారంభం	జనవరి 19న తరగతులు ప్రారంభం
	జూన్ 27- జూలై 10 వరకు పరీక్షలు	జూన్ 8- 28 వరకు పరీక్షలు
	జూలై 13 ఫలితాలు	జూలై 18న ఫలితాలు
సెమిస్టర్ 3	జూన్ 30న తరగతులు ప్రారంభం	జూన్ 30న తరగతులు ప్రారంభం
	అక్టోబరు 31- నవంబరు 16 వరకు పరీక్షలు	అక్టోబరు 31 నుంచి నవంబరు 20 వరకు పరీక్షలు
	డిసెంబరు 6న ఫలితాలు	డిసెంబరు 10న ఫలితాలు
సెమిస్టర్ 4	నవంబరు 17న తరగతులు ప్రారంభం	నవంబరు 21న తరగతులు ప్రారంభం
	మార్చి 17 నుంచి 30 వరకు పరీక్షలు	మార్చి 24- ఏప్రిల్ 13 వరకు పరీక్షలు
	ఏప్రిల్ 20న ఫలితాలు	మే 3న ఫలితాలు
సెమిస్టర్ 5	జూన్ 30న తరగతులు ప్రారంభం	జూన్ 30న తరగతులు ప్రారంభం
	అక్టోబరు 31- నవంబరు 16 వరకు పరీక్షలు	అక్టోబరు 31- నవంబరు 20 వరకు పరీక్షలు
	డిసెంబరు 6న ఫలితాలు	డిసెంబరు 10న ఫలితాలు
సెమిస్టర్ 6	నవంబరు 17న తరగతులు ప్రారంభం	నవంబరు 21న తరగతులు ప్రారంభం
	మార్చి 17 నుంచి 30 వరకు పరీక్షలు	మార్చి 24 - ఏప్రిల్ 13 వరకు పరీక్షలు
	ఏప్రిల్ 20న ఫలితాలు	మే 3న ఫలితాలు
సెమిస్టర్ 7	జూన్ 30న తరగతులు ప్రారంభం	జూన్ 30న తరగతులు ప్రారంభం
	అక్టోబరు 31- నవంబరు 16 వరకు పరీక్షలు	అక్టోబరు 31- నవంబరు 20 వరకు పరీక్షలు
	డిసెంబరు 6న ఫలితాలు	డిసెంబరు 10న ఫలితాలు
సెమిస్టర్ 8	నవంబరు 17న తరగతులు ప్రారంభం	నవంబరు 21న తరగతులు ప్రారంభం
	మార్చి 17 నుంచి 30 వరకు పరీక్షలు	మార్చి 30 - ఏప్రిల్ 13 వరకు పరీక్షలు
	ఏప్రిల్ 20న ఫలితాలు	ఏప్రిల్ 30న ఫలితాలు

ఊరి కోసం మాటామంతీ..!

స్ర్కీన్ గ్రీవెన్స్‌కు డిప్యూటీ సీఎం పవన్ శ్రీకారం



అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై, వారి నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక పంథాను ఎంచుకున్నారు. అభిమానుల తాకిడి, భద్రత కారణాల దృష్ట్యా గ్రామీణ ప్రజలతో పూర్తిగా మమేకం కాలేకపోతున్న ఆయన.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒకరోజు ఒక గ్రామంలోని ప్రజలతో ముచ్చటించి, వాళ్ల సమస్యలను వినేందుకు "మన ఊరి కోసం మాటామంతీ" అనే స్ర్కీన్ గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం ప్రారంభంకానున్న ఈ కార్యక్రమంలో తొలుత శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలోని రావివలస గ్రామ ప్రజలతో పవన్ మాట్లాడతారు. దీనికోసం టెక్కలిలోని భవానీ థియేటర్‌ను వేదికగా ఎంచుకున్నారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి పవన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భవానీ థియేటర్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడతారు. ఈ కార్యక్రమం కోసం రావివలస నుంచి 290 మందిని ఆహ్వానిస్తారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పవన్... ప్రజల సమస్యలను వింటారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతోపాటు రాష్ట్రస్థాయి అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో తాగు, సాగునీరు, రోడ్లు, మురుగుకాల్వలు, ఉపాధి హామీ పథకం, పాఠశాల విద్య, నిరుద్యోగం, చెరువులు తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు.

నిరంతరాయంగా మాటామంతి...

స్ర్కీన్ గ్రీవెన్స్ ద్వారా ఒక్కోసారి ఒక్కో గ్రామంతో పవన్ కల్యాణ్ మమేకమవుతారని, ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఉపముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో స్వయంగా ముచ్చటించాలన్న కోరిక పవన్‌కు బలంగా ఉంది. అయితే భద్రతా కారణాలు, అభిమానుల తాకిడితో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఒక్కో గ్రామ ప్రజలకు ఒకే రోజు ఎక్కువ సమయం కేటాయించేలా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. సినిమా స్ర్కీన్ అయితే లైవ్ వాతావరణం ఉంటుందని ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

నేడు బెంగళూరుకు పవన్

కర్ణాటక నుంచి ఆరు కుంకీ ఏనుగుల స్వీకరణ

బెంగళూరు, మే 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పంట పొలాలపై దాడిచేస్తున్న అడవి ఏనుగుల బెడదను నివారించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఆరు కుంకీ ఏనుగులను ఆ రాష్ట్రానికి అప్పగించనుంది. వీటిని స్వీకరించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌తోపాటు అటవీశాఖ అధికారులు బుధవారం బెంగళూరుకు రానున్నారు. విధానసౌధ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది.



మిట్ట మధ్యాహ్నం మంచు సోయగం



పాడేరు ఘాట్ రోడ్డును మంగళవారం మధ్యాహ్నం శీతాకాలాన్ని తలపించేలా దట్టంగా పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మోదకొండమ్మ వారి పాదాలను దర్శించుకునేందుకు వచ్చిన మైదాన ప్రాంతవాసులు ఏజెన్సీలో వాతావరణాన్ని ఆస్వాదించారు.

- పాడేరు, ఆంధ్రజ్యోతి

ప్రతి చిన్న విషయానికీ హైకోర్టుకా!

(మొదటి పేజీ తరువాయి)

క్రీడా మైదానాలుగా మార్చాయని, ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని వ్యాఖ్యానించింది. కోర్టులో షో చేయవద్దని హెచ్చరించింది. ప్రతీ ఒక్కరూ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. తిరువూరు నగర పంచాయితీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా భద్రత కల్పించాలని కోరుతూ వైసీపీ కౌన్సిలర్లు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. భద్రత అవసరమైన కౌన్సిలర్లు పోలీసులకు వినతి సమర్పించాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చామని, తమ ఆదేశాలకు అనుగుణంగా వినతిపత్రం ఎందుకు సమర్పించలేదని పిటిషనర్లను ప్రశ్నించింది. తాము ఇచ్చిన ఆదేశాలు పోలీసులు అమలు చేయలేదని గుర్తిస్తే కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు ఎవరినీ ఉపేక్షించబోమని, వారిని శిక్షించడానికి కూడా వెనుకాడబోమని వ్యాఖ్యానించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ కింద చర్యలు ప్రారంభిస్తామని పేర్కొంది. పిటిషనర్ల వైపు నుంచి తప్పు ఉందని తేలితే రూ.10లక్షలు జరిమానా విధించి వ్యాజ్యాలు కొట్టివేస్తామని హెచ్చరించింది. కోర్టులతో ఆటలాడొద్దని, మీ మధ్యన ఉన్న సిల్లీ వివాదాలు పరిష్కరించడానికి ఇక్కడ లేమని ఘాటుగా స్పందించింది. తమ ఆదేశాల అమలుకు సంబంధించిన నివేదికను తదుపరి విచారణలో తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

వాదనలు సాగాయిలా...

తిరువూరు నగర పంచాయితీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఓటర్లు అందరికీ తగిన భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, గుమ్మా వెంకటేశ్వరి సోమవారం అత్యవసరంగా హౌజ్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది పపుడిప్పు శశిధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ నెల 19న చైర్మన్ ఎన్నికలో పాల్గొనకుండా కౌన్సిలర్లను అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారని, చైర్మన్‌గా పోటీ చేయబోతున్న వ్యక్తిని సీఐ, డీఎస్పీ నిర్బంధించడంతో ఎన్నిక 20వ తేదీకి వాయిదా పడిందని వివరించారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. శాంతి భద్రతల సమస్య కారణంగా కౌన్సిలర్లు హోటల్లో ఉంటున్నారని, హోటల్ నుంచి ఎన్నిక జరిగే హాలు వరకు భద్రత కల్పించాలని కోరామని చెప్పారు. తాము సమర్పించిన వినతులను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఈసీ పంపిందని పేర్కొన్నారు. అయితే కౌన్సిలర్లు ఇళ్లకు వెళ్తేనే భద్రత కల్పిస్తామని సీఐ, డీఎస్పీ చెబుతున్నారని తెలిపారు. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ.. భద్రత కల్పించాలని కోరుతూ పిటిషనర్లు పోలీసులకు ఎలాంటి వినతిపత్రం అందజేయలేదని స్పష్టం చేశారు. ఈ నెల 16న ఇదే కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం భద్రత కల్పించాలని కోరుతూ పోలీసులకు వినతి సమర్పించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఎన్నికల సంఘానికి వినతి ఇస్తే సరిపోదని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. పోలీసులకు వినతిపత్రం ఎందుకు సమర్పించలేదని పిటిషనర్లను ప్రశ్నించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది బదులిస్తూ.. స్థానిక సీఐ వ్యవహార శైలిపై తమకు అభ్యంతరం ఉందన్నారు. కౌన్సిలర్‌ను బలవంతంగా ఎత్తుకెళ్లారని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సీఐ పేరు ఏమిటని ప్రశ్నించారు. సీఐ గిరిబాబు, డీఎస్పీ ప్రసాదరావు అని న్యాయవాది బదులిచ్చారు. పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే ఎందుకు ఫిర్యాదు చేయలేదని జీపీ వాదించారు.



పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. పిటిషనర్లు వారి ఇంటి వద్ద ఉంటే రక్షణ కల్పించగలమని, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారో కూడా పోలీసులకు తెలియదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది ఆకాశ్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల సంఘానికి సమర్పించిన వినతిని రాష్ట్ర డీజీపీ, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఫార్వర్డ్ చేశామని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్నికల కమిషనర్ పంపిన వినతిపై డీజీపీ ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు పోలీసులకు సరిపోవా? అసలేం జరుగుతోందని నిలదీశారు. పిటిషనర్లు ఎక్కడున్నారో తెలియదని సామాన్య ప్రజలు చెబితే అర్థం చేసుకోగలమన్నారు. పోలీసులకు ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంది కదా? అని ప్రశ్నించారు. కౌన్సిలర్లు ఎక్కడ ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆరాతీశారు. పదిమంది కౌన్సిలర్లు రామవరప్పాడులోని ఓ హోటల్‌లో, మరో కౌన్సిలర్ మంజుల తిరువూరులోని శాంతినగర్‌లో ఉన్నారని ఆయన బదులిచ్చారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చైర్మన్ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వీలుగా కోర్టును ఆశ్రయించిన ఇద్దరు పిటిషనర్లతో పాటు మరో 9మంది కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. పోలీసుల రక్షణ ఆసరాగా తీసుకొని ఏమైనా అక్రమాలకు పాల్పడితే కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించడంతో పాటు రూ.10లక్షల జరిమానా విధిస్తామని పిటిషనర్లను హెచ్చరించారు. ప్రతి చిన్న విషయానికీ కోర్టు మెట్లు ఎక్కేవారికి ఇదో గుణపాఠం అవుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

కఠిన సవాళ్లు ఎంచుకుంటేనే ఉన్నత శిఖరాలు

- ఇక ప్రభుత్వ ఫలితాలపై పత్రికా ప్రకటనలు
- టెన్త్ టాపర్ల సన్మాన కార్యక్రమంలో మంత్రి లోకేశ్
- మంత్రి లోకేశ్‌తో సన్మానం ఊహించలేదు
- షైనింగ్ స్టార్స్-2025లో విద్యార్థుల స్పందన



మంత్రి లోకేశ్‌తో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విద్యా వ్యవస్థకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు!

అమరావతి, మంగళగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్కరణలతో రాష్ట్ర విద్యా వ్యవస్థలో మ్యాజిక్ జరుగుతోందని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ కూడా జరుగుతోందన్నారు. 'షైనింగ్ స్టార్స్' పేరుతో.. పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన 47 మంది విద్యార్థులను మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సన్మానించారు. ప్రముఖులు రచించిన తొమ్మిది రకాల పుస్తకాలను వారికి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'మిమ్మల్ని చూస్తుంటే గర్వంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులున్నా తల్లిదండ్రులను తలెత్తుకునేలా చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్య సాధన కోసం పట్టుదలతో ముందుకు సాగాలి. అనేక సవాళ్లు ఉన్నా విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్నాం. నేడు మీరు సాధించిన విజయంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. ఏపీ విద్యా వ్యవస్థకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు. వచ్చే ఏడాది నుంచి ప్రైవేటు పాఠశాలల తరహాలో ప్రభుత్వ ఫలితాలపై పేపర్లలో ప్రకటనలు జారీచేస్తాం. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలంటే కఠినమైన లక్ష్యాలనే ఎంచుకోవాలి. జీవితంలో అనేక పరీక్షలుంటాయి. పరీక్షలను సవాలుగా తీసుకునే వారే విజేతలుగా నిలుస్తారు. జూన్ నెలాఖరుకు విద్యా సంస్కరణలు పూర్తిచేస్తాం" అని మంత్రి అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ... విద్య ద్వారా మాత్రమే సమాజంలో కఠినమైన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

నేను అల్లరి బ్యాచ్!

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సరదాగా సమాధానాలు చెప్పారు. మీరు చదువుకునేటప్పుడు పాఠశాలలో పరీక్షలు కష్టంగా ఉన్నాయా? అసెంబ్లీలో ప్రశ్నలు కష్టంగా ఉన్నాయా? అని సంతోష్ అనే విద్యార్థి ప్రశ్నించగా... 'రెండూ కష్టమైనవే. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో మూడు ప్రశ్నలు వచ్చాయి. వాటికి సమాధానం చెప్పేందుకు ఎంతో ప్రిపేర్ కావాల్సి వచ్చింది. పాఠశాల రోజుల్లో నేను లాస్ట్ బెంచ్ విద్యార్థిని. అల్లరి బ్యాచ్ కూడా' అని సమాధానమిచ్చారు. అదృష్టాన్ని నమ్ముతారా? కష్టాన్ని నమ్ముతారా? అని ఓ విద్యార్థి ప్రశ్నించగా ఉన్నత స్థానాలకు చేరాలంటే కష్టానికి మించిన ప్రత్యామ్నాయం లేదని, ఈ విషయంలో మోదీ, చంద్రబాబు నుంచి ప్రేరణ పొందానని అన్నారు.

మరెన్నో మెడల్స్ అందుకుంటా



మంత్రి లోకేశ్ గారి చేతుల మీదుగా మెడల్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరెన్నో పతకాలను సాధిస్తాను. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టుల్లోనూ బోధన బాగుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం. అలాగే, యూపీఎస్సీ సాధించి ప్రజలకు సేవ చేయాలనీ ఉంది.

- కె.జోషిత, 597 మార్కులు, హరిపురం, శ్రీకాకుళం జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధనతోపాటు మెరుగైన వసతులు అందుతున్నాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత, రుచి పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని మా మార్కుల ద్వారా రుజువైంది. అమ్మా నాన్నలు కూడా గర్వంగా ఫీలవుతున్నారు. మంత్రి లోకేశ్ చేతుల మీదుగా సన్మానం ఊహించలేదు. లోకేశ్ ప్రోత్సాహంతో తర్వాతి తరం విద్యార్థులు స్ఫూర్తి పొందుతారు. ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

- అంగడి పావని చంద్రిక, 598 మార్కులు, జడ్పీ హైస్కూల్, ఒప్పిచర్ల, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా

మహానాడు నిర్వహణకు 19 కమిటీలు

- సమన్వయ కమిటీలో మంత్రి లోకేశ్, పల్లా
- తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల
- మంత్రి ఫరూక్‌కు మీడియా బాధ్యతలు

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పార్టీ పండుగ మహానాడు నిర్వహణకు 19 కమిటీలను నియమించారు. కమిటీల వివరాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేశారు. మహానాడు సమన్వయ కమిటీ కన్వీనర్‌గా మంత్రి లోకేశ్ నియమితులయ్యారు. ఈ కమిటీలో పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు మంత్రులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు రాజేశ్ ఉన్నారు.

కమిటీలు, కన్వీనర్లు...

ఆహ్వాన కమిటీ: పల్లా శ్రీనివాసరావు (ఏపీ), బక్కని నర్సింహులు (తెలంగాణ)
తీర్మానాల కమిటీ : యనమల రామకృష్ణుడు
వసతి ఏర్పాట్ల కమిటీ : మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు
సభా నిర్వహణ కమిటీ: కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు
భోజనాల కమిటీ : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
మీడియా కమిటీ: ఎన్ఎండీ ఫరూక్. మంత్రి వంగలపూడి అనిత (కో కన్వీనర్), మంత్రి కొలుసు పార్థసారధి (సభ్యులు), బీవీ వెంకటరాముడు (పార్టీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్), దారపనేని నరేంద్ర (పార్టీ కేంద్ర కార్యాలయ మీడియా కో-ఆర్డినేటర్)
మహానాడు ఆర్థిక వనరుల కమిటీ : మంత్రి అనగాని సత్యప్రసాద్
సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
ఫొటో ప్రదర్శన కమిటీ: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
ప్రతినిధుల నమోదు కమిటీ : చింతకాయల విజయ్
సభాప్రాంగణ పరిరక్షణ కమిటీ: మంత్రి నిమ్మల రామానాయుడు
అలంకరణ కమిటీ : ఎమ్మెల్యే పులివర్తి నాని
రవాణా కమిటీ: మంత్రి పొంగూరు నారాయణ
వాహన పార్కింగ్ కమిటీ: ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు
రక్తదానం, మెడికల్ క్యాంప్ కమిటీ: మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి
వలంటీర్ల నిర్వహణ కమిటీ: మంత్రి కొల్లు రవీంద్ర
జనసమీకరణ కమిటీ : మంత్రి గొట్టిపాటి రవికుమార్
సుందరీకరణ - పరిశుభ్రత కమిటీ : మంత్రి వాసంశెట్టి సుభాశ్

ఆ డాక్టర్.. మరో 11 కోర్సులు చదివేశారు!

70 ఏళ్ల వయసులో.. 61 డిగ్రీలు, కోర్సులు

నిత్య విద్యార్థి.. డాక్టర్ కర్రి రామారెడ్డి



రాజమహేంద్రవరం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆయనో ప్రముఖ వైద్యుడు. వయసు 70 సంవత్సరాలు. వయసు పైబడుతున్నా చదువుపై మమకారం తగ్గలేదు. మానసిక వైద్యుడిగా రోగులకు సేవలు అందిస్తూనే 61 కోర్సులు పూర్తి చేసేశారు. ఆయనెవరో కాదు.. రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి. గతంలోనే 50 డిగ్రీలు చదివేసిన ఈ డాక్టర్ తాజాగా మరో 11 కోర్సులు పూర్తి చేసి... మొత్తం 61 డిగ్రీలు, కోర్సులను తన ఖాతాలో వేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని మానస హాస్పిటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి-జూన్ సెమిస్టర్‌లో 11 ఎన్‌పీటెల్ కోర్సులు ఒకేసారి పూర్తిచేసినట్టు చెప్పారు. ఈ పరీక్షలన్నింటికీ స్థానిక రాజీవ్‌గాంధీ కాలేజీనే సెంటర్ కావడం వల్ల వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం రాలేదన్నారు. తన కోర్సులన్నీ శ్రమించి పరీక్షలు రాసి తెచ్చుకున్నవే తప్ప, హానరరీ డిగ్రీలో, ఫెలోషిప్ పదవి వల్లో వచ్చినవి కాదని స్పష్టం చేశారు.

పంటల మద్దతు ధరలపై మంత్రుల కమిటీ

పీఎంకిసాన్‌తోపాటే అన్నదాత-సుఖీభవ.. రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధం: సీఎం

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయ దిగుబడులు, గిట్టుబాటు ధరలు, నిత్యావసరాల ధరలపై పర్యవేక్షణకు ఆరుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. మిర్చి, బర్లీ పొగాకు, ఆక్వా, కోకో, చెరకు, మామిడి తదితర పంటలకు ధరలు తగ్గడానికిగల కారణాలను అధికారులు వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ 'పంటలకు ఈసారి ధరలు తగ్గాయి. మనం కూడా మానిటరింగ్ చేయాలి. రైతులకు గిట్టుబాటు ధర దక్కేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీ నిరంతర పర్యవేక్షణ చేయాలి' అని సీఎం అన్నారు. అన్నదాత-సుఖీభవ కింద రైతులకు అందించనున్న సాయాన్ని పీఎం కిసాన్ సొమ్ముతోపాటు జమ చేద్దామని సీఎం అన్నారు.

రేపు ఢిల్లీకి చంద్రబాబు

- రెండురోజులపాటు సుడిగాలి పర్యటన
- ఎల్లుండి ఒకేరోజు ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ

అమరావతి, ఢిల్లీ, మే 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రసాయం కోరేందుకు చేపడుతున్న ఈ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ఒకేరోజు ఏడుగురు కేంద్రమంత్రులతో భేటీ కాబోతున్నారు. గురువారం రాత్రికి ఢిల్లీ చేరుకుని, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు కేంద్ర మంత్రులతో భేటీ అవుతారు. అదే రోజు ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలతో కూడా సీఎం భేటీ కానున్నారు. మరునాడు 24వ తేదీన భారత మండపంలో జరిగే నీతి అయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఈ పర్యటనలోనే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు శుక్రవారం కలుస్తారు. గోదావరి - బనకచర్ల ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ప్రీ-ఫీజుబిలిటీ రిపోర్టును ఆమెకు అందిస్తారు. బనకచర్ల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని మరోసారి కోరతారు. ఈ పథకానికి ఆర్థిక సాయం కోసం ఇప్పటికే రెండుసార్లు నిర్మలను చంద్రబాబు కలిసి వినతిపత్రం అందించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇవ్వాలని ఆ సమయంలో సీఎంను ఆమె కోరారు. డీపీఆర్ తయారీకి సమయం పట్టే వీలున్నందున ప్రీ-ఫీజుబిలిటీ రిపోర్టును(పీఎస్ఆర్) సిద్ధం చేయాలని జల వనరుల శాఖను చంద్రబాబు ఆదేశించారు. బుధవారం ఆ రిపోర్టు సిద్ధమవుతుందని జలవనరుల శాఖ తెలిపింది. కేంద్రమంత్రి నిర్మలతో భేటీకి ముందు, ఆ తర్వాత కూడా ఆయన పలువురు మంత్రులను కలుస్తారు. కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలుస్తారు. ఆ తర్వాత కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర శాస్త్ర సాంకేతిక, సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్రసింగ్‌తో భేటీ అవుతారు. సాయంత్రం 4గంటల నుంచి 5 వరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశం కానున్నారు. అనంతరం కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ అవుతారు.


రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్ విజయానంద్, మంత్రులు

రేషన్ వాహనాలు రద్దు

- 1 నుంచి చౌకధరల దుకాణాల్లోనే పంపిణీ
- రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో జగన్ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (రేషన్ వాహనాలు) వ్యవస్థను రద్దుచేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. జూన్ 1 నుంచి లబ్ధిదారులకు చౌకధరల దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని నిశ్చయించింది. 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు మాత్రం ఇంటికే డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించింది. దీపం ఫేజ్-3లో ఉచిత గ్యాస్ సిలెండర్ల రాయితీ సొమ్మును ముందుగానే లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం వెలగపూడి సచివాలయంలో సమావేశమైన మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వెల్లడించారు. జూన్ ఒకటో తేదీ నుంచి గతంలో మాదిరిగానే చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎండీయూ వాహనాలను ఉచితంగా వాటి లబ్ధిదారులకే బదలాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో ఓ యూనివర్సిటీ ఉండాలని కేబినెట్ భేటీలో సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకే పరిమితమైపోయిన తెలుగు విశ్వవిద్యాలయం, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను పూర్తి స్థాయిలో రాష్ట్రంలో నెలకొల్పాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాజమండ్రిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయం, ఏలూరులో అంబేడ్కర్ వర్సిటీ హెడ్‌క్వార్టర్స్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 200 జంతు ప్రదర్శనల శాలల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని సీఎం చెప్పారు. వీలున్న ప్రాంతాల్లో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 9,260 ఎండీయూ వాహనాల కొనుగోలుకు రూ.1,860 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని.. పైలట్ ప్రాజెక్టు కోసం మరో రూ.200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ వాహనాల వల్ల వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనం కలుగకపోగా.. బియ్యం అక్రమ రవాణాకు దారితీసిందన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రకారం 25 శాతం మందికి నిత్యావసర సరుకులు అందకపోవడం, 26 శాతం మంది ఎండీయూ ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు వచ్చాయన్నారు. దొంగ లెక్కలు చూపించి వాహనాలను దారి మళ్లించారని.. ఒక్కొక్క వాహనానికి నెలకు 27 వేలు కార్పొరేషన్ నుంచి చెల్లిస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈబీసీ తదితర కార్పొరేషన్ల ద్వారా ఎండీయూ వాహనాలు పొందిన వారిలో 10 శాతం కట్టిన వారికి ఈ వాహనాలను ఉచితంగా అందజేయాలని మంత్రిమండలి నిర్ణయించిందన్నారు. రేషన్ కార్డుల్లో పేరు చేర్చడం కోసం దాదాపు మూడున్నర లక్షల దరఖాస్తులు వచ్చాయని.. కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 70 వేల మెట్రిక్ టన్నుల అక్రమ బియ్యాన్ని కూటమి ప్రభుత్వం సీజ్ చేసిందని తెలిపారు.

కేబినెట్ మరిన్ని నిర్ణయాలివీ..

- భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి వెనక్కి తీసుకున్న 500 ఎకరాల భూమిని తిరిగి వ్వాలంటూ జీవీఐఏఎల్ చేసిన అభ్యర్థనకు ఆమోదం.
- అమరావతిలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా ఏర్పాటుకు ఆమోదం. ఇందులో ఏపీ విద్యార్థులకు 20% సీట్లు కేటాయింపు.
- సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా 1,136 ఎస్జీటీలు, 1,124 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను (మొత్తం 2,260).. ఖాళీగా ఉన్న అదనపు పోస్టులుగా మార్చుతూ పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన జీవో 13కు ధ్రువీకరణ. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు విద్యావకాశాలను పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల కోసం ఈ 2,260 పోస్టుల కల్పనకు ఆమోదం.
- కడప జిల్లా కే బొమ్మేపల్లిలో 1,000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎకరానికి రూ.5 లక్షల చొప్పున 41.99 ఎకరాల ప్రభుత్వ భూమిని అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి ఆమోదం.
- శ్రీసత్యసాయి జిల్లా పెద్ద కొల్ల గ్రామంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్రాజెక్టు అభివృద్ధికి ఎకరా రూ.5 లక్షల చొప్పున 12.87 ఎకరాలు అదానీ గ్రీన్ ఎనర్జీకి బదిలీకి అంగీకారం.
- నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో పారిశ్రామిక పార్కుకు 615.18 ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయింపు.
- కర్నూలు జిల్లా బి తాండ్రపాడులో ఈఎస్ఐసీ ఆస్పత్రి నిర్మాణానికి 5 ఎకరాలు ఈఎస్ఐసీకు కేటాయింపు.
- చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజన్ నుంచి పుంగనూరు, చౌడేపల్లి సోమల, సదుం మండలాలను, చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుంచి రొంపిచర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి డివిజన్‌లో బదిలీకి ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి ఆమోదం.
- రవాణా వాహనాలకు సంబంధించి గ్రీన్ ట్యాక్స్ రేటును తగ్గించడానికి ఉద్దేశించిన ముసాయిదాకు ఆమోదం.
- హైకోర్టులో 245 పోస్టుల కల్పనకు అంగీకారం.

32,271 కోట్ల పెట్టుబడులకు పచ్చజెండా

- ఎస్ఐపీబీ నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర

రాష్ట్రంలో భారీగా రూ.32,271 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలతో వచ్చిన పారిశ్రామిక సంస్థలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇవి పరిశ్రమలు స్థాపిస్తే 35,371 మంది యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయి. ఈ నెల 15వ తేదీన సీఎం చంద్రబాబు అధ్యతన జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చిన వివిధ సంస్థల ప్రతిపాదనలను ఆమోదించిన సంగతి తెలిసిందే. వీటిని మంగళవారం కేబినెట్ ఆమోదించింది. కేవలం ఐదు రోజుల్లోనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా పరిశ్రమలను స్థాపించేందుకు వచ్చే సంస్థలకు వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్న సంకేతాలను రాష్ట్ర ప్రభుత్వం పంపింది.

- డెక్కన్ ఫైన్ కెమికల్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, పీయూఆర్ ఎనర్జీ, బ్లూజెట్ హెల్త్ కేర్, జూపిటర్ రెన్యువబుల్స్ సంస్థలు పరిశ్రమలు స్థాపించేందుకు వీలుగా ప్రత్యేక పారిశ్రామిక విధానం కింద భూమి, కరెంటు, నీళ్ల రోడ్లు వంటి వసతులకు ఆమోదం.
- మోహన్ సింటెక్స్ ఇండియాకి, ఏటీసీ టైర్స్‌కి ప్రత్యేక ప్యాకేజీకింద ప్రోత్సాహకాల కాలపరిమితి పెంపు.
- పెట్టుబడులు పెట్టడానికి రామభద్ర ఇండస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఐపీఎల్)కు ప్రత్యేక ప్రోత్సాహకాలు.
- వింగ్‌టెక్ మొబైల్స్, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రైన్యూర్స్ ఇండియా (అలీప్)కు విద్యుత్, రోడ్లు, నీరు వంటి మౌలిక సదుపాయాల కల్పన.
- లెదర్ అండ్ ఫుట్‌వేర్ పాలసీ(2024-29)కి ఆమోదం.
- భోగాపురంలో నిర్మిస్తున్న జీవీఏఎల్ అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అదనపు భూమి కేటాయింపు.
- వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం.
- విశాఖ తాజ్ గేట్‌వేను 5 స్టార్ డీలక్స్ హోటల్ కమ్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌గా అభివృద్ధి చేసేందుకు సమ్మతి.
- స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ (బెంగళూరు) తిరుపతిలో ఐబీఐఎస్ పేరిట నిర్మించే త్రీస్టార్ హోటల్‌కు, తిరుపతిలో నోవాటెల్ హోటల్‌కు ప్రోత్సాహకాలు.
- తిరుపతి వడమాలపేటలో బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పీ ఆధ్వర్యంలో 5స్టార్ హోటల్.
- నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో రోజుకు 20 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం.
- ఎకోరాన్ ఎనర్జీ ఇండియాకు చెందిన 260 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ ప్లాంట్‌ను.. అదే గ్రూప్‌లో భాగమైన ఆమ ప్లస్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు బదలాయించేందుకు ఆమోదం.
- అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రాళ్ల అనంతపురం, కురబహరెళ్లిల్లో ఇదే సంస్థకు చెందిన 300.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీకి బదలాయించేందుకు సమ్మతి. 2,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు అనుమతి.

సంక్షేమానికి ఓ కేలెండర్

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో మద్యం స్కాం, తల్లికి వందనం, ప్రభుత్వ పథకాలపై చర్చ జరిగింది. ప్రస్తుత ఆర్థిక దుస్థితిలో ఒకేసారి రూ.10 వేల కోట్లుపైచిలుకు నిధులివ్వడం అంటే ఖజానాపై భారీగా భారం పడుతుందని.. తల్లికి వందనం కింద ఇచ్చే మొత్తాన్ని రెండు విడతలుగా ఇస్తే బాగుంటుందని కొందరు మంత్రులు సూచించారు. చంద్రబాబు స్పందిస్తూ.. ఈ విషయంలో మరో ఆలోచనకు తావే లేదన్నారు. ఒకే విడతలో తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా పాఠశాలలు పునఃప్రారంభించేలోగా ఈ నిధులిచ్చి తీరాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై మంత్రులు వినూత్నంగా ఆలోచించాలని, ఈ దిశగా మరింత శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. పింఛన్ల పంపిణీ సమయంలోను, ఇటీవల మత్స్యకారులకు భృతి అందజేసే సమయంలోనూ నేరుగా తాను లబ్ధిదారులను కలిసి వారితో సంభాషించానని.. అదే విధంగా మంత్రులూ జనంలోకి వెళ్లాలన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇప్పటికే ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఉచిత సిలిండర్లకు సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లో పడ్డాయో లేదో ఎంత మంది మంత్రులు తెలుసుకున్నారని సీఎం ప్రశ్నించారు. మంత్రులెవ్వరూ సమాధానం ఇవ్వకపోవడంతో.. ప్రతి ఒక్కరూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి డబ్బులు అందిందీ లేనిదీ తెలుసుకుని.. వారు ఉచితంగా అందుకున్న సిలిండర్‌పై టీ పెట్టించుకుని తాగి రావాలని ఆయన సూచించారు. మిగిలిన పథకాల విషయంలోనూ వినూత్నంగా ఆలోచించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

శ్రీశైలం ఆలయ విస్తరణపై దృష్టి

శ్రీశైలం ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆలయ విస్తరణకు అటవీశాఖపరంగా ఉన్న అడ్డంకులను తొలగించడానికి.. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. సంవత్సరానికి రూ.250 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో రెండో అతిపెద్ద ఆలయంగా శ్రీశైలం ఉందని, దీనిని మరింత అభివృద్ధి చేస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. టెంపుల్ టూరిజంలో భాగంగా శ్రీశైలాన్ని అభివృద్ధి చేస్తే ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

5 లక్షల మందితో యోగా దినోత్సవం

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని మం త్రులకు సీఎం సూచించారు. 5 లక్షల మందితో దీనిని నిర్వహించాలని తెలిపారు. అలాగే, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని.. ఇకపై రెవెన్యూ సమస్యలు, పరిష్కారం, పురోగతిపై ప్రతి 3 నెలలకోసారి తనకే నేరుగా నివేదిక ఇవ్వాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆదేశించారు.

లిక్కర్ స్కాం వార్తలపై స్పందించొద్దు

మద్యం స్కాంపై మంత్రులెవరూ మాట్లాడొద్దని సీఎం ఆదేశించారు. ఈ కుంభకోణం కేసులో సిట్ విచారణకు సంబంధించి గానీ, పత్రికల్లో వచ్చే కథనాలపై గానీ మాట్లాడవద్దని సీఎం ఈ సందర్భంగా స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సిట్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతోందన్నారు. ఈ సమయంలో మంత్రులు దానిపై మాట్లాడితే తప్పుడు సంకేతాలు పంపుతుందని, విపక్షంపై కక్ష సాధింపు చర్యగా ప్రజల్లోకి వెళ్తుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఉండాల్సిన పని లేదని స్పష్టం చేశారు. తప్పనిసరైతే మంత్రులు కాకుండా.. పార్టీ నేతలతో మద్యం స్కాంపై మాట్లాడించాలని సీఎం సూచించారు.

రాజకీయంగా వెనుకబడకూడదు!

రాజకీయంగా కూటమి పార్టీలు వెనుకబడ్డాయనే అభిప్రాయం ప్రజల్లోకి వెళ్లకుండా మంత్రులు జాగ్రత్త వహించాలని సీఎం స్పష్టం చేశారు. వైజాగ్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహణలో సరిగా వ్యవహరించలేకపోయామన్నారు. పలు చోట్ల కోరం లేక స్థానిక సంస్థల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు వాయిదా పడిన ఘటనలు నేతల ప్రణాళిక, సమన్వయలోపాన్ని చాటుతున్నాయన్నారు. ప్రధానితో లోకేశ్ భేటీకి మీడియా, రాజకీయ పక్షాల్లో విస్తృత ప్రచారం లభించిందని మంత్రి జనార్దన్‌రెడ్డి ప్రస్తావించారు.

అంతరిక్ష రంగంలో వంద కోట్ల డీల్

- సీమెన్స్‌తో ఇథర్వింగ్ ఏరోస్పేస్ ఒప్పందం

కణేకల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): దేశంలో అంతరిక్ష సాంకేతికత, ఉత్పత్తుల అభివృద్ధిలో వేగంగా ఎదుగుతున్న ఇథర్వింగ్ ఏరోస్పేస్ సంస్థతో సీమెన్స్ సిమ్యులేషన్ కంపెనీ రూ.100 కోట్ల ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఇథర్వింగ్ ఏరోస్పేస్ సంస్థ సీఈవో మానేగర్ సర్మస్ వాలి తెలిపారు. అనంతపురం జిల్లా కణేకల్లులోని తన స్వస్థలంలో మంగళవారం ఆయన ఆ వివరాలను విలేకరులకు తెలిపారు. తమ సంస్థ బెంగళూరు కేంద్రంగా పనిచేస్తోందని, ఇథర్వింగ్ ఏరో స్పేస్ పేరుతో డిజిటల్ సిమ్యులేషన్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, అంతరిక్ష రంగంలో నూతన ఉత్పత్తుల రూపకల్పనలో వేగంగా పురోగతి సాధిస్తోందని చెప్పారు. ఇలాంటి సమయంలో సీమెన్స్ సంస్థ తమతో ఒప్పందం కుదుర్చుకుందని హర్షం వ్యక్తం చేశారు. ఇథర్వింగ్ మెంటార్ ఆర్‌సీ బిరాదర్ ఈ ఒప్పందంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. ఈ ఒప్పందంతో ఉపగ్రహాల డిజైన్, క్షిపణుల సాంకేతికత తదితర అంశాల్లో అధునాతన పద్ధతులను ఇథర్వింగ్ అభివృద్ధి చేస్తుందని తెలిపారు.



మళ్లీ తెరపైకి లిఫ్టు!

- పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి గోదావరి జలాలు తోడేద్దాం
- 2021 నాటి ఉత్తర్వును బయటకు తీసిన ప్రాజెక్టు అధికారులు
- డ్యాం ఎత్తును 41.15 మీటర్లకు కుదించిన జగన్
- దానికి విరుగుడుగా ఎత్తిపోతల నిర్మాణానికి జీవో 134 జారీ
- అప్పట్లోనే సర్వత్రా విమర్శల వెల్లువ

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): మూలనపడేసిన పోలవరం ఎత్తిపోతల పథకం మళ్లీ తెరపైకి వచ్చింది. దీనిని చేపట్టేందుకు సిద్ధమైన ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఆకస్మికంగా పూర్వపు జీవో 134ను బయటకు తీయడం కలకలం రేపుతోంది. వాస్తవానికి పోలవరం ఉసురు తీసేలా దాని ఎత్తును 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదిస్తూ ముఖ్యమంత్రిగా నాడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నిల్వ సామర్థ్యాన్ని తగ్గించినందుకు విరుగుడుగా డెడ్ స్టోరేజీ నుంచి గోదావరి జలాలను పశ్చిమ గోదావరి మెట్ట ప్రాంతానికి తీసుకెళ్లేందుకంటూ రూ.912.84 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించాలని జీవో 134 జారీచేశారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీలో 35 మీటర్ల వద్ద నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తోడేసేందుకు ఆమోద ముద్ర వేశారు. దీనిపై అప్పట్లోనే సాగునీటిరంగ నిపుణులు, సాగునీటి సంఘాల సమాఖ్య ప్రతినిధులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. పోలవరం బ్యారేజీగా మిగిలిపోతుందంటూ 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు కూడా ఈ నిర్ణయాన్ని ఆక్షేపించారు. ఎత్తును కుదించడం వల్ల 194.60 టీఎంసీల నిల్వ సామర్థ్యం నుంచి 119 టీఎంసీల నిల్వకు ప్రాజెక్టు పరిమితమవుతుందని.. బహుళార్థ సాధక ప్రాజెక్టు నుంచి చిన్న తరహా బ్యారేజీగా పోలవరం మిగిలిపోతుందని, దీనిని పూర్తి చేసినా.. గోదావరి జిల్లాలకు సాగునీరు అందదని నిపుణులు హెచ్చరించారు. రూ.55,848 కోట్లను వ్యయం చేసి ప్రాజెక్టును నిర్మించినా ఏమాత్రమూ ప్రయోజనం ఉండదన్నారు. జల విద్యుత్కేంద్రం కూడా నిరుపయోగంగా మారుతుందని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేకత తీవ్రతరం కావడంతో.. జగన్ ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు ప్రారంభించలేదు. ఫలితంగా గోదావరికి వచ్చిన భారీ వరదకు డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. తర్వాత ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీ వచ్చింది. గైడ్‌బండ్ కూడా కుంగిపోయింది. ఈ పరిణామాల దరిమిలా కేంద్ర జలశక్తి శాఖ నిర్మాణ పనులను తన నియంత్రణలోకి తీసుకుంది. పనులపై సలహాలివ్వడానికి అమెరికా, కెనడాలకు చెందిన నిపుణులను నియమించింది. వారి సూచనల మేరకే ఇప్పుడు కొత్త డయాఫ్రం వాల్ పనులు, ఈసీఆర్ఎఫ్ డ్యాం సన్నాహక పనులు జరుగుతున్నాయి. ఈ తరుణంలో.. పోలవరం ఇంజనీరింగ్ అధికారులు ఒక్కసారిగా జగన్ ఆలోచనలను అమలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పోలవరం డెడ్‌స్టోరేజీలో 35 మీటర్ల వద్ద నుంచి నీటిని ఎత్తిపోసేలా లిఫ్ట్ ఇరిగేషన్ చేపడదామని, దీనిపై గతంలోనే జీవో జారీ అయిందని జల వనరుల శాఖ ఉన్నతాధికారులకు నివేదించడం గమనార్హం. వారి ఆలోచనలు మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం.

గుదిబండ ఈ బండి!

- అట్టహాసాలకు పోయి పౌర సరఫరాలను అస్తవ్యస్తంగా మార్చిన గత ప్రభుత్వం
- రూ.కోట్లతో ఎండీయూల కొనుగోలు..
- ఆపరేటర్లకు జీతాలతో కార్పొరేషన్ దివాలా
- అవే వాహనాల్లో పేదల బియ్యం స్మగ్లింగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రజా పంపిణీ వ్యవస్థలో గత వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన రేషన్ వాహన వ్యవస్థను (ఎండీయూలు) రాష్ట్ర కేబినెట్ రద్దుచేసింది. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా దాదాపు 30 వేల రేషన్ షాపుల ద్వారా సాఫీగా సాగిపోతున్న ప్రజా పంపిణీ వ్యవస్థలోకి ఎవరూ అడక్కపోయినా గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ విధానాన్ని తీసుకువచ్చింది. దీనికోసం రూ. 539 కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి మొత్తం 9,260 ఎండీయూలను కొనుగోలు చేసింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామంటూ లబ్ధిదారుల నుంచి 10 శాతం వాటా తీసుకుని మిగిలిన 90 శాతం ప్రభుత్వమే భరించేలా ఒప్పందం చేసుకుంది. 2021 ఫిబ్రవరి నుంచి ఆర్భాటంగా రేషన్ వాహనాలను రోడ్లపైకి తెచ్చింది. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులను ఇంటింటికీ సరఫరా చేస్తున్నందుకు ఎండీయూ నిర్వాహకులకు ప్రభుత్వం నెలకు రూ. 21 వేలు చొప్పున చెల్లిస్తోంది. ఆ వాహనాలకు ఏటా బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించింది. ఇవన్నీ లెక్కిస్తే ఒక్కో రేషన్ వాహనానికి ప్రతి నెలా రూ. 27 వేలు చొప్పున రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఈ విధంగా ఎండీయూల కారణంగా ఇప్పటి వరకు రూ. 1,860 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ప్రభుత్వం గుర్తించింది. రేషన్ వాహనాలు లేనప్పుడు కూడా రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ సజావుగానే సాగింది. కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసిన డీలర్లకు ఆయా సరుకులపై కమీషన్ మాత్రమే చెల్లించేవారు. దాంతో ఒక్కో డీలరుకు నెలకు సగటున రూ.7 వేలకు మించి ఖర్చయ్యేది కాదు. ఇప్పుడు రేషన్ డీలర్లకు యథావిధిగా కమీషన్ చెల్లిస్తూనే.. ఎండీయూల ఆపరేటర్లకు నెలకు రూ. 21 వేలు చొప్పున ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తోంది. అంటే ముగ్గురు రేషన్ డీలర్లకు చెల్లించే కమీషన్ మొత్తాన్ని ఇప్పుడు ఒక ఎండీయూ ఆపరేటర్‌కే చెల్లించాల్సివస్తోంది. రేషన్ వాహనాల కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులకు ప్రతినెలా వాయిదాల (ఈఎంఐ) కింద సుమారు రూ. 247 కోట్లు, ఏటా సర్వీసు ఫీజు కింద రూ. 200 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. చంద్రబాబు ప్రభుత్వానికి ఈ బండి పెద్ద గుదిబండగా మారింది.

పంపిణీలో కొత్త బెడద

రేషన్ సరుకుల డెలివరీ కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నా కార్డుదారులకు మేలు జరగకపోగా.. కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇంటింటికి తీసుకువెళ్లి అందించాల్సిన రేషన్ వాహనాలను ఎక్కడో వీధి చివరన నిలిపి పంపిణీ చేస్తున్నారు. దీంతో డోర్ డెలివరీ విధానం వీధి డెలివరీగా మారింది. అది కూడా ప్రతి నెలా 1 నుంచి 17 వరకు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. మిగిలిన రోజులన్నీ ఖాళీగానే ఉంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 500 పైగా ఎండీయూ ఆపరేటర్లు తమ వాహనాలను తిప్పడం మానేశారు.

పేదల బియ్యం ఓడలకు ఎత్తి..

రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు స్మగ్లర్లు కొందరు ఎండీయూ ఆపరేటర్లతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ సరుకుల పంపిణీ పేరుతో ఇంటింటికీ తిరుగుతున్న ఎండీయూ ఆపరేటర్లలో కొందరు కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ప్రభుత్వం కిలోకు రూ.43 పైగా ఖర్చు పెట్టి పేదలకు ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని కార్డుదారుల నుంచి కేవలం రూ.10కే తీసుకోవడం, చాలామందికి సరుకులు ఇవ్వకుండానే వెళ్లిపోవడం, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నేరుగా ఎండీయూ వాహనాల్లోనే స్మగ్లర్ల అడ్డాలకు రేషన్ బియ్యాన్ని తరలించడం వంటి ఉదంతాలు తరచూ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా పోర్టులకు తరలించి అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు చేస్తున్న విధానాన్ని కూటమి ప్రభుత్వం బట్టబయలు చేసింది.

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రివర్గ ఉపసంఘం

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సమగ్రంగా చర్చించి హేతుబద్ధమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ భేటీలో నిర్ణయించారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని నాలుగు మండలాలను, చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లోని ఒక మండలాన్ని మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని నిశ్చయించారు. దీనిపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. వైసీపీ హయాంలో 2022లో నూతన జిల్లాలను ఏర్పాటు చేశారు. అయితే జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందన్న ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. మంగళవారం కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చ జరిగింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై వస్తున్న డిమాండ్లపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

రేషన్ బియ్యానికి బదులు నగదు..

రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యానికి బదులు నగదు చెల్లించే అంశంపై మంత్రిమండలి చర్చించినట్లు సమాచారం. కేజీ రూ. 43కు కొని ఉచితంగా అందజేస్తుంటే.. వాటిని తిరిగి రూ. 10కే ఎండీయూ ఆపరేటర్లకు ఇచ్చేస్తున్నారని, దీని వల్లే రేషన్ బియ్యం స్మగ్లింగ్ వ్యవస్థీకృతమైందని మంత్రులు అభిప్రాయపడ్డారు.

తోట చంద్రయ్య కుమారుడికి సర్కారు కొలువు

- మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానం
- 2022లో వైసీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురైన చంద్రయ్య



తోట చంద్రయ్య(ఫైల్), చంద్రయ్య పాడె మోస్తున్న చంద్రబాబు (ఫైల్)

మాచర్లటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురైన టీడీపీ నేత తోట చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో చంద్రయ్య కుమారుడు వీరాంజనేయులుకు ప్రభుత్వ ఉద్యోగం ఇద్దామని సీఎం ప్రతిపాదించారు. మంత్రులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కుటుంబానికి పెద్దదిక్కయిన తోట చంద్రయ్య హత్యతో ఆయన కుటుంబం ఆర్థికంగా చితికిపోయి ఇబ్బందుల పాలైందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున ఆదుకోవాల్సి ఉందని సీఎం వ్యాఖ్యానించారు. చంద్రయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడం పట్ల పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.


ఎవరీ చంద్రయ్య.. ఏం జరిగింది?

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తోట చంద్రయ్య టీడీపీలో యాక్టివ్‌గా ఉండేవారు. నాటి సీఎం జగన్ అరాచక పాలనపై ఎలుగెత్తారు. వైసీపీ హయాంలో వెల్దుర్తి మండలం ఎంపీపీగా ఉన్న చింతా శివరామయ్య, అతని కుమారుడు ఆదినారాయణల అక్రమాలపై పలు రూపాల్లో పోరాటాలు చేశారు. దీంతో కక్షగట్టిన వారిద్దరూ 2022,జనవరి 13నగ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చంద్రయ్యను అడ్డగించి నడిరోడ్డుపై కత్తులతో తెగబడ్డారు. గొంతు కోసి ప్రాణం తీశారు. హత్య చేసే ముందు 'జై జగన్' అని అంటే వదిలేస్తామని చెప్పినా.. తన ప్రాణం పోయినా అనని 'జై టీడీపీ. జై చంద్రబాబు' అంటూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చంద్రయ్య హత్య సమాచారం తెలుసుకున్న అప్పటి విపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు గుండ్లపాడుకు చేరుకుని కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపి శ్మశాన వాటిక వరకు చంద్రయ్య పాడె మోశారు. అధికారంలోకి వచ్చాక కుటుంబాన్ని ఆదుకుంటామని అప్పుడే హామీ ఇచ్చారు.

రేషన్ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): రేషన్ వాహనాలను రద్దు చేసి మళ్లీ చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్న నిర్ణయంపై రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు హర్షం ప్రకటించారు. డీలర్స్ ఫ్రెండ్లీ ముఖ్యమంత్రి అంటూ చంద్రబాబుకు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 'గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో అనాలోచితంగా తెచ్చిన రేషన్ వాహనాల వల్ల ఆర్థిక భారంతోపాటు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇప్పుడు వాటిని రద్దు చేసి తిరిగి రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ చేయాలనే నిర్ణయంతో అన్ని సమస్యలకూ చెక్ పెట్టారు' అని ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ వేదిక అధ్యక్షుడు ముత్యాల శేషు మరో ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్ల వ్యవస్థపై సీఎం నమ్మకం ఉంచారంటూ ధన్యవాదాలు తెలిపారు.


నిర్మాణంలో ఉన్న జడ్పీ హైస్కూల్ ప్రహరీ


సౌత్‌మోపూరులో నిర్మించిన సిమెంట్ రోడ్డు

అక్షరం అండగా..
అభివృద్ధి దిశగా..

- సౌత్‌మోపూరు గ్రామంలో నేడు విజయోత్సవ సభ
- ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' ఈడీ ఆదిత్య రాక
- గ్రామంలో అభివృద్ధి పనుల పరిశీలన
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'లో వచ్చిన సమస్యలకు పరిష్కారం



నెల్లూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆరంభంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా...' అంటూ 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన కార్యక్రమంతో నెల్లూరులోని మారుమూల గ్రామమైన సౌత్‌మోపూరు అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. నెల్లూరు నగరానికి పశ్చిమాన 23 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు లేవు. జడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ లేదు. శ్మశానాలు ఆక్రమణలకు గురవుతుండేవి. ఇంకా అనేక సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ఈ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది. గత జనవరి చివరి వారంలో ప్రత్యేక కథనాల ద్వారా వీటిని వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' అధ్యక్షతన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా...' గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యల పరిష్కారానికి రూ.1.22 కోట్లు మంజూరు చేయించారు. దీంతో గత మూడు నెలలుగా ఈ ఊరి సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. ఇప్పటికే కొన్నిపనులు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగిన, జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూసి, ప్రజలతో మమేకమయ్యేందుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య, టీడీపీ సీనియర్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం సౌత్‌మోపూరుకి విచ్చేయనున్నారు. వారు ఉదయం 11 గంటలకు గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని సీసీ రోడ్డును, అనంతరం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ప్రహరీని పరిశీలిస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వేసిన సీసీ రోడ్డును చూస్తారు. 11.20 గంటలకు బీసీ కాలనీలో రచ్చబండపై రూ.2 లక్షలతో నిర్మించతలపెట్టిన శ్లాబు పనులకు శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు బీసీ కాలనీలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగే విజయోత్సవ సభలో పాల్గొంటారు.

కూల్‌గా కొల్లగొట్టారు!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. కానీ.. జగన్ హయాంలో మద్యం స్కామ్ రెండు దశల్లో నడిచింది. మొదటి దశలో... ఒక్కో కేసుకు ఇంత చొప్పున కమీషన్ ఫిక్స్ చేసి, మద్యం తయారీదారుల నుంచి ముడుపులు పిండుకున్నారు. రెండో దశలో నడిచిందే కీలకం! అది... ప్రభుత్వ సొమ్మును మద్యం కంపెనీలకు 'అదనం'గా ఇచ్చి, అదే మొత్తాన్ని తమ 'ప్యాలెస్'కు మళ్లించారు. ప్రభుత్వ ధనం అంటే ప్రజా ధనమే! దానినే... సొంతానికి మింగేశారు.

కమీషన్లతో మొదలుపెట్టి..

జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో సుమారు రూ.3100 కోట్లు చేతులు మారాయి. ప్రభుత్వం ద్వారా మద్యం దుకాణాలు నడపాలన్నది ఒక 'మాస్టర్ ప్లాన్'. ప్రైవేటు మద్యం దుకాణాలతో ముడుపులు లభించే అవకాశం లేదు. మహాఅయితే... తమ నేతలు, అనుచరులకు షాపులు దక్కుతాయి. వాటి ఆదాయమూ వారికే వస్తుంది. కానీ... 'మాకేంటి' అని నాటి ప్రభుత్వ పెద్దలు ఆలోచించారు. అందుకే... ప్రభుత్వ మద్యం షాపులు తీసుకొచ్చారు. 2019 ఏడాది చివరి నుంచే వైసీపీ పెద్దలు మద్యం కంపెనీలతో బేరసారాలు ప్రారంభించారు. 'సరుకు మీదే. కానీ... షాపులు ప్రభుత్వానివి. వాటిలో మీ మద్యం అమ్మితే కేసుకు ఎంత ఇస్తారు?' అని ప్రశ్నించారు. లిక్కర్‌కు రూ.200, బీరుకు రూ.50 చొప్పున తమకు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ ప్రభుత్వ పెద్దలు ఇలా మద్యం కంపెనీలను ముడుపులు అడిగింది లేదు. తొలిసారి ఈ మాట విని... మద్యం కంపెనీలు అవాక్కయ్యాయి. కమీషన్లు ఇచ్చుకోవడం ఇష్టంలేని కంపెనీలు... ఏపీలో వ్యాపారం వదులుకున్నాయి. కొన్ని కంపెనీలు మాత్రం వైసీపీ పెద్దలు అడిగిన మేరకు ముడుపులు సమర్పించుకున్నాయి. ఇందులో భాగంగా చిల్లర, నాసిరకం మద్యం బ్రాండ్లూ రంగ ప్రవేశం చేశాయి. ఇలా మొదటి ఆరు నెలలపాటు కంపెనీలు వైసీపీ నేతలకు కమీషన్లు చెల్లించాయి. అంటే... ఇది తమకు వచ్చే లాభంలోంచి సమర్పించుకున్న ముడుపు! ఇది లిక్కర్ స్కామ్‌లో మొదటి దశ! అసలు సినిమా... రెండో దశలోనే ఉంది!

జనం సొమ్ము... 'జగన్'కే!?

కమీషన్లు తీసుకుంటున్న క్రమంలోనే... నాటి ప్రభుత్వ పెద్దలకు మరో ఆలోచన వచ్చింది. అన్ని కంపెనీల నుంచి పక్కాగా ముడుపులు వసూలు చేసేలా... మద్యం స్కామ్‌లో రెండో దశ మొదలైంది. మొదటి ఆరు నెలలు కంపెనీలు సొంత డబ్బును ముడుపులుగా చెల్లిస్తే, మిగిలిన నాలుగేళ్ల పాటు ప్రజా ధనమే మద్యం కంపెనీల ద్వారా తాడేపల్లికి వెళ్లింది. వంద విలువైన మద్యాన్ని జగన్ ప్రభుత్వం 160కి కొనుగోలు చేసింది. అదనంగా చెల్లించిన రూ.60ని కంపెనీల నుంచి వైసీపీ పెద్దలు తిరిగి తీసుకున్నారు. ఉదాహరణకు... మాన్షన్ హౌస్ బ్రాందీని పొరుగునే ఉన్న తెలంగాణ ప్రభుత్వం కేసును రూ.1083తో కొనుగోలు చేయగా... ఏపీ ప్రభుత్వం అదే బ్రాండ్ మద్యం కేసుకు రూ.1695 చెల్లించింది. అదనంగా ఒక్క కేసుకు దాదాపు రూ.600. ఇలా అదనంగా చెల్లించిన మొత్తం తిరిగి తాడేపల్లికి చేరిందన్న మాట! ఇలా... మొత్తం కుంభకోణంలో లిక్కర్‌పై రూ.2861 కోట్లు, బీరుపై రూ.252 కోట్లు 'అదనం'గా చేతులు మారాయి. ఇది... మద్యం కంపెనీల సొంత సొమ్ము కాదు! అచ్చంగా... ప్రజా ధనం!

ధరలు తగ్గించడమే నిదర్శనం

సాధారణంగా, కాలక్రమంలో వస్తువుల ధరలు పెరుగుతుంటాయి. మద్యం ఉత్పత్తి ధరలు కూడా పెంచాలని కంపెనీలు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఉంటాయి. కానీ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తర్వాత దాదాపు 20 బ్రాండ్ల రేట్లు తగ్గించుకున్నాయి. దీనికి అనుగుణంగా ఎక్సైజ్ శాఖ ఎమ్మార్పీలు తగ్గించింది. మాన్షన్ హౌస్ బ్రాందీ క్వార్టర్ సీసాపై రూ.30, హాఫ్ బాటిల్‌పై రూ.60, ఫుల్ బాటిల్‌పై రూ.110 తగ్గింది. రాయల్ చాలెంజ్ సెలెక్ట్ గోల్డ్ విస్కీ క్వార్టర్‌పై రూ.20, ఫుల్‌పై రూ.80 తగ్గింది. యాంటిక్విటీ బ్లూ విస్కీ ఫుల్ బాటిల్‌పై ఏకంగా రూ.200 ధర తగ్గింది. ఇంకా చాలా కంపెనీలు దశలవారీగా ధరలు తగ్గించేశాయి. దీనిని బట్టి చూస్తే... గత ప్రభుత్వంలో ఇవన్నీ అదనంగా తీసుకున్నాయని స్పష్టంగా అర్థమవుతోంది. అలా తీసుకున్న మొత్తాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పంగా చెల్లించారు. మరోవైపు... జగన్ హయాంలో ప్రభుత్వం నుంచి అదనంగా చెల్లించి మద్యం కొనుగోలు చేయడంతో, ఎక్సైజ్ శాఖ దానికి అనుగుణంగా ఎమ్మార్పీలు పెంచింది. వెరసి... మందు బాబుల జేబులు గుల్ల! వైసీపీ పెద్దల జేబులు కళకళ!

ముడుపులపై మొదట్లోనే ఒత్తిడి

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే మద్యం కంపెనీలపై ముడుపుల ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో మద్యం అమ్ముకోవాలంటే కప్పం కట్టాల్సిందేనని వైసీపీ వర్గాలు తేల్చేశాయి. దానికి అంగీకరించని కంపెనీలకు ఆర్డర్లు ఆగిపోయాయి. రాష్ట్రంలో అత్యధికంగా అమ్ముడుపోయే కింగ్‌ఫిషర్ బీరు 2018-19లో రాష్ట్రంలో 1.02 కోట్ల కేసులు అమ్మితే, 2023-24లో కేవలం 11.82లక్షల కేసులు అమ్మారు. అంటే 2018-19లో అమ్మిన దాంతో పోలిస్తే కేవలం 11.54శాతం మాత్రమే. అదే నాకౌట్, బడ్వైజర్ కంపెనీల బీర్లు అయితే మొత్తంగా కనిపించకుండా పోయాయి. అదే సమయంలో... బ్రిటీష్ ఎంపైర్, బీరా 91 బూమ్, బ్లాక్ బస్టర్ అల్ట్రా కంపెనీల బీర్ల అమ్మకాలు భారీగా పెరిగిపోయాయి. ఇక... పాపులర్ లిక్కర్ బ్రాండ్ మెక్‌డోవెల్స్ నంబర్-1 బ్రాందీ 2023-24లో కేవలం 5 కేసులు అమ్ముడైంది. ఇంపీరియల్ బ్లూ కేవలం ఏడు కేసులే అమ్మింది. అవే బ్రాండ్లు 2018-19లో 20లక్షలకు పైగా కేసులు అమ్ముడయ్యాయి. ఇక.. 2018-19లో ఒక్క కేసు కూడా అమ్ముడుపోని సిరీస్ క్లాసిక్ బ్లూ ఫైనెస్ట్ విస్కీ, గ్రేసన్స్ సిల్వర్ స్ట్రిప్స్, రాయల్ ప్యాలెస్, ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ, గ్రేసన్స్ కింగ్స్‌వెల్ సెలెక్ట్ ఇండియన్ బ్రాందీలు జగన్ హయాంలో లక్షల కేసులు విక్రయించాయి. దీనికి ఒకటే కారణం... ముడుపులు ఇచ్చేందుకు, తమ 'అదనపు స్కీమ్'కు సహకరించిన వారికే ఆర్డర్లు!

తప్పలేదు... ఇచ్చేశారు!

- ఐపీఎస్ కొల్లికి 'అదనపు' జీతం
- నాడు బాబు అరెస్టే ఆయన చేసిన అదనపు పని
- టీడీపీ టార్గెట్‌గా పలు బాధ్యతలు అప్పగించిన జగన్
- నాటి అదనపు బాధ్యతలకు నేడు వేతనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆయన పేరు... కొల్లి రఘురామిరెడ్డి, ఐపీఎస్. జగన్ హయాంలో ఆయనకు అప్పగించిన పని కాకుండా, అదనంగా చేసిన పని... చంద్రబాబును అరెస్టు చేయడం!

ఇలా అదనంగా చేసిన పనికి... అదనపు వేతనం చెల్లించిందెవరో తెలుసా? చంద్రబాబు ప్రభుత్వమే!

వినడానికి వింతగా ఉన్నా... ఇది నిజం! ఇంకా చెప్పాలంటే, ఇదో తప్పనిసరి చెల్లింపుల తంతు!

అధికారికంగా నిబంధనల ప్రకారం... 'ఫుల్ అడిషనల్ చార్జి'గా అదనపు బాధ్యతలు నిర్వహించే అధికారులకు అదనపు జీతమివ్వాలి. ఇది రూల్! జగన్ ప్రభుత్వం అమరావతి భూముల్లో అక్రమాలు జరిగాయంటూ 'సిట్' నియమించిన సంగతి తెలిసిందే. దానికి డీఐజీ హోదాలో ఉన్న రఘురామిరెడ్డిని అధిపతిగా నియమించింది. అప్పటికి ఆయన విజిలెన్స్‌లో ఉన్నప్పటికీ... అదనంగా 'సిట్' పని అప్పగించారు. దాంతో ఆగకుండా... అప్పటి ప్రతిపక్ష నేతలను ఇరికించేందుకు పెట్టిన పలు సీఐడీ, ఏసీబీ కేసులను 'అదనం'గా కొల్లికే అప్పగించారు. అందులో... 'స్కిల్ డెవలప్‌మెంట్' కేసూ ఒకటి. ఇదే కేసులో కొల్లి రఘురామిరెడ్డి నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేశారు.

ఇచ్చేయాల్సిందే!

చంద్రబాబు స్థానంలో జగన్ ఉంటే ఏం చేసేవారు? తనను అరెస్టుచేసిన అధికారికి 'అదనపు' వేతనం చెల్లించే వారా? లేక శంకరగిరి మాన్యాలు పట్టించే వారా? ఈ విషయాన్ని పక్కనపెడితే... చంద్రబాబు ప్రభుత్వం మాత్రం రఘురామిరెడ్డి చేసిన అదనపు పనికి అదనపు వేతనం చెల్లించేసింది. 'సిట్'లో తాను చేసిన అదనపు పనులకు... అదనపు వేతనం ఇవ్వాలని ఫలితాల వెల్లడికి ముందే కొల్లి దరఖాస్తు పెట్టుకున్నారు. ఇప్పుడు... కూటమి ప్రభుత్వం అందుకు ఆమోదం తెలిపింది. అదనపు వేతనం ఇస్తూ ఉత్తర్వులు (జీవో నంబరు.879) జారీ చేసింది. నిబంధనల ప్రకారం ఇలా ఇవ్వక తప్పదని అధికారులు పేర్కొంటున్నారు.

వంశీ ముందస్తు బెయిల్‌పై
విచారణ వాయిదా

అమరావతి/విజయవాడ/నూజివీడు టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. వాదనలు కొనసాగింపు కోసం విచారణను గురువారానికి వాయిదా వేసింది. పీటీ వారెంట్ అమలుపై తాత్కాలిక స్టే విధించింది. వంశీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు వాదనలు కొనసాగింపు కోసం విచారణను గురువారానికి వాయిదా వేశారు.

పీటీ వారెంట్‌కు అనుమతి

వంశీపై దాఖలైన పీటీ వారెంట్‌ను విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం అనుమతించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న వంశీని న్యాయాధికారి ముందు హాజరుపరిచేందుకు గన్నవరంలోని ఎనిమిదో ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఈ కోర్టుకు వేసవి సెలవులు ఉండడంతో విచారణ విజయవాడలోని మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగింది.

మరో కేసులో..

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌ను ఏలూరు జిల్లా నూజివీడు కోర్టు పెండింగ్‌లో ఉంచింది. నకిలీపట్టాల పంపిణీ కేసులో కస్టడీ కోరుతూ పోలీసుల దాఖలు చేసిన పిటిషన్ విచారణను ఈనెల 22కు కోర్టు వాయిదా వేయగా, బెయిల్ పిటిషన్‌ను మాత్రం పెండింగ్‌లో పెట్టింది.

బోరుగడ్డకు 3 వరకు రిమాండ్

గుంటూరు/నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న గుంటూరు జిల్లా పెదకాకాని మండల సర్వేయర్‌ను దూషించి, బెదిరించిన కేసులో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు గుంటూరు కోర్టు వచ్చే నెల 3 వరకు రిమాండ్ విధించింది. 2016 మే 9న సర్వేయర్ చిరుమామిళ్ల మల్లికార్జునరావును బెదిరించిన ఘటనపై అప్పట్లో పెదకాకాని స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి బోరుగడ్డ కోర్టుకు గైర్హాజరవుతున్నాడు. దీంతో కోర్టు ఆయనకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం బోరుగడ్డ అనంతపురం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. పెదకాకాని పోలీసులు పిటీ వారెంట్‌పై గుంటూరు కోర్టుకు తీసుకొచ్చారు. ఆరో కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉండగా.. ఆ మెజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జి అయిన నాలుగో కోర్టు మెజిస్ట్రేట్ శోభారాణి ఎదుట హాజరుపరిచారు. బోరుగడ్డకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో అతడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు. కాగా, బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ మంగళవారం నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.గాయత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో బోరుగడ్డను మార్చి24న కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి రిమాండ్ విధించారు. అప్పటినుంచి దాన్ని పొడిగిస్తున్నారు.


మద్యం స్కాం నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి, గోవిందప్ప బాలాజీ, సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణక్య, దిలీప్‌లను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

ఏసీబీ కోర్టుకు లిక్కర్ గ్యాంగ్

- ఏడుగురు నిందితులకు జూన్ 3 వరకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, మే 20(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో నిందితులు మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. వారి రిమాండ్‌ను జూన్ 3వరకు పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశాలిచ్చారు. ఈ కేసులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, పైలా దిలీప్ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న విషయం తెలిసిందే. రిమాండ్ గడువు ముగియడంతో వారిని మంగళవారం ఏసీబీ కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టుకు హాజరైన సందర్భంగా ఆ ఏడుగురు నిందితులు జైల్లో ఇబ్బందులను న్యాయాధికారికి వివరించారు. తనకు నట్స్ ఇవ్వాలని ఆదేశించినా జైలు అధికారులు ఇవ్వడం లేదని జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. తాను ఇచ్చిన ఉత్తర్వులను జైలు అధికారులకు పంపాలని సిబ్బందిని ఈ సందర్భంగా న్యాయాధికారి ఆదేశించారు. తనకు మంచం, దిండు ఇచ్చినప్పటికీ ప్రత్యేక కేటగిరి బ్యారక్ ఇవ్వలేదని గోవిందప్ప బాలాజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశామని న్యాయాధికారి చెప్పారు. మంచం, దిండు ఇవ్వాలని సజ్జల శ్రీధర్‌రెడ్డి కోరారు. దీనిపై పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి సూచించారు. దీనికి ముందు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతుండగా, 'యూ ఆర్ వెరీ యాక్టివ్' అంటూ న్యాయాధికారి వ్యాఖ్యానించారు. జైల్లో పరిశుభ్ర వాతావరణం ఉండట్లేదని, నడుస్తుంటే జారుతోందని, రెండు రోజుల క్రితం తాను కాలు జారి పడిపోయానని మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. కాగా, మద్యం కేసులో సిట్ దర్యాప్తును, దాని పురోగతిని ఎప్పటికప్పుడు ఏసీబీ కోర్టుకు తెలియజేయాలని దర్యాప్తు అధికారిని న్యాయాధికారి ఆదేశించారు. సిట్ దాఖలు చేసిన మెమోలో కొత్త విషయాలేమీ లేవన్నారు. ఇప్పటి వరకు నమోదుచేసిన వాంగ్మూలాలను మెమోకు జత చేయాలని, ఇకపైనా ఆ విధంగానే చేయాలని ఆదేశించారు. కోర్టులో సిట్ దాఖలు చేసిన పిటిషన్లు తాము పరిశీలించుకోవడానికి అందుబాటులో ఉండట్లేదని నిందితుల తరఫు న్యాయవాదులు న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై న్యాయాధికారి స్పందిస్తూ.. దరఖాస్తు చేస్తే కాపీలను అందజేస్తామని చెప్పారు.

రాజ్ బెయిల్ పిటిషన్‌పై కౌంటర్‌కు ఆదేశం

మద్యం కేసులో నిందితులు రాజ్ కసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్ దాఖలు చేసిన బెయిల్, గోవిందప్ప బాలాజీని కస్టడీని కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. రాజ్ కసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది. గోవిందప్ప కస్టడీ పిటిషన్‌పై ఆయన తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో మరింత దర్యాప్తు కోసం ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను వారం రోజులు కస్టడీ ఇవ్వాలని కోరుతూ ఏసీబీ కోర్టులో సిట్ మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. కాగా, మద్యం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు అనుమతించింది. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. ఈడీ పిటిషన్‌ను అనుమతిస్తూనే తదుపరి ప్రక్రియ అమలుపై కలెక్టర్‌కు న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు.

వజ్రాల హారాలు.. బంగారు వడ్డాణాలు!

- భార్య బ్యాంకు లాకర్‌లో 2.8 కిలోల గోల్డ్
- కోట్లకు పడగలెత్తిన ఆళ్లగడ్డ విద్యుత్ ఏడీఈ

నంద్యాల, మే 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీఈ రవికాంత్‌చౌదరిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఐదు రోజుల క్రితం ఓ రైతు నుంచి రవికాంత్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కగా, దర్యాప్తులో కళ్లు చెదిరే ఆస్తులు, బంగారు నగలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఏడీఈ ఇంట్లో విలువైన పత్రాలు, ఎల్ఐసీ బాండ్లు, ఎఫ్‌డీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆయన సతీమణి హిమబిందు బ్యాంకు లాకర్‌లో కోట్ల విలువైన బంగారు ఆభరణాలు గుర్తించారు. మంగళవారం.. ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు కృష్ణయ్య, శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి ఏడీఈ ఇంటికి వెళ్లారు. సాయంత్రం ఏడీఏ సతీమణి హిమబిందును వెంటబెట్టుకుని నంద్యాల పట్టణంలోని ఒక పబ్లిక్ సెక్టార్ బ్యాంకుకు వెళ్లి, ఆమె పేరిట ఉన్న లాకర్‌ను తెరిపించారు. అందులో రూ.2.85 కోట్ల విలువ చేసే 41 రకాల బంగారు ఆభరణాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగల్లో వజ్రాలతో పొదిగిన హారాలు, ఆకర్షణీయమైన మూడు వడ్డాణాలతో పాటు 10 జతల కమ్మలు, బంగారం జడ కుచ్చులు, వంకీలు, లాంగ్‌చైన్స్ వంటివి కూడా ఉన్నాయి. అనంతరం డీఎస్పీ సోమన్న మీడియాతో మాట్లాడుతూ.. ఏడీఈ ఇంటి విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని చెప్పారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే కోణంలో దర్యాప్తు సాగుతోందన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

లైన్‌మెన్‌గా చేరి ఏడీఈ స్థాయికి..

రవికాంత్‌చౌదరి 30 ఏళ్ల కిందట విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా చేరారు. ఆ తర్వాత లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈగా పదోన్నతి పొందడంతో సమీప ప్రాంతాల్లోనే సుదీర్ఘకాలం పనిచేశారు. మూడేళ్ల కిందట ఏడీఈగా పదోన్నతి పొంది ఇక్కడే పనిచేస్తున్నారు.

సినిమా చూపిస్తా!


- రిటైర్ అయినా.. దేశం విడిచి వెళ్లినా పట్టుకొస్తా
- పేర్లు రాసి పెట్టుకోండి.. అధికారంలోకొచ్చాక వారి సంగతి చూస్తా
- మరోసారి బెదిరింపులకు దిగిన వైసీపీ అధ్యక్షుడు జగన్



అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి): 'నేనొచ్చానంటే ఎవ్వరినీ బతకనివ్వను!'... ఇది వైసీపీ అధ్యక్షుడు జగన్ చెప్పకనే చెబుతున్న మాట! తాను అధికారంలో ఉన్న ఐదేళ్లూ టీడీపీ కార్యకర్తలపైనా, నేతలపైనా, చివరికి చంద్రబాబుపైనా కేసులు పెట్టి అరెస్టు చేయించిన జగన్... ఇప్పుడు 'తప్పుడు కేసులు... అక్రమ అరెస్టులు' అని ఆక్రోశిస్తున్నారు. తన హయాంలో జరిగిన అరాచకాలన్నీ... 'మీరు నాటిన విత్తనం, పెరిగి పెద్దదై మిమ్మల్నే కబళిస్తుంది' అని టీడీపీ సర్కారును హెచ్చరిస్తున్నారు. తాజాగా మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా.. పోలీసు వ్యవస్థపైనా బెదిరింపులకు దిగారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులు, నేతలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని ఆరోపించారు. తన జోలికి, తనవాళ్ల జోలికి వచ్చిన ప్రతి ఒక్కరికీ 'జగన్ 2.0'లో అసలు సినిమా చూపిస్తానంటూ బెదిరింపులకు దిగారు. కళ్లు మూసుకుంటే ఒక ఏడాది పూర్తయిందని, మరో మూడేళ్లు కళ్లు మూసుకుంటే తానే అధికారంలోకి వచ్చేస్తానని జగన్ చెప్పుకొచ్చారు. రెడ్‌బుక్ అనను గాని.. వైసీపీ కార్యకర్త జోలికి వచ్చిన ప్రతి ఒక్కరి పేరూ రాసుకోవాలని వైసీపీ నేతలకు జగన్ సూచించారు. వైసీపీ జోలికి వచ్చిన పోలీసు అధికారులు రిటైర్ అయినా, విదేశాలకు వెళ్లినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా లాక్కొచ్చి మరీ వారికి సినిమా చూపిస్తామని జగన్ అన్నారు. వల్లభనేని వంశీ, నందిగం సురేశ్ తదితరుల అరెస్టు గురించి ప్రస్తావించారు. చంద్రబాబు ప్రభుత్వంపై ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని, ప్రజలు వ్యవస్థలపై తిరగబడే రోజులు వస్తున్నాయని జగన్ జోస్యం చెప్పారు. తాను త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తానని, ఆ మేరకు ప్రభుత్వంపై పోరాడాలని నేతలకు జగన్ పిలుపు ఇచ్చారు.

జగన్‌ను కోర్టుకు రప్పిస్తా!

- అప్పటి వరకు నిద్రపోను.. న్యాయవాది అబ్దుల్ సలీం



రాయదుర్గం, మే 20(ఆంధ్రజ్యోతి): కోడి కత్తి, గులకరాయి కేసులలో మాజీ సీఎం జగన్‌ను కోర్టుకు రప్పించి తీరుతానని విశాఖపట్నానికి చెందిన న్యాయవాది అబ్దుల్ సలీం అన్నారు. అప్పటి వరకు నిద్రపోనని వ్యాఖ్యానించారు. క్రైమ్ నంబర్ 122/24గా నమోదైన అనిష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బెంగాల్ బాండ్ల కేసు విషయమై మంగళవారం ఆయన అనంతపురం జిల్లా రాయదుర్గం కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కోడి కత్తి కేసులో హాజరు కావాలని 2023, ఏప్రిల్ 10న జగన్‌ను కోర్టు ఆదేశించిందని తెలిపారు. అయితే, ఆ కేసులో చంద్రబాబు, హర్షవర్ధన్ చౌదరిని తప్పించి, శీను అనే వ్యక్తిని మాత్రమే విచారించారని జగన్ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ఆ పిటిషన్‌ను ఎన్ఐఏ కోర్టు కొట్టివేసిందని, దాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. జగన్ వేసిన పిటిషన్ కొట్టివేస్తే తప్ప కోడి కత్తి కేసు విచారణ ప్రారంభం కాదన్నారు. మాజీ సీఎం జగన్ కోర్టు విధివిధానాలను పాటించడం లేదని విమర్శించారు. కోడి కత్తి, గులకరాయి కేసులలో ఆయన ఇప్పటివరకు వాంగ్మూలం ఇవ్వలేదని తెలిపారు. జగన్ కోర్టుకు హాజరై సాక్ష్యం చెబితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయని చెప్పారు. నేరం చేసినవారికి శిక్ష తప్పదని, నేరాలకు పాల్పడిన జార్ఖండ్ మాజీ సీఎం మధుకోడా జైల్లో ఉన్నారని, ఇదే విషయం జగన్ కేసుల్లోనూ రుజువు కాబోతోందని సలీం వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.